అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో 15 మంది మావోయిస్టులు లొంగుబాటు

మోదీ తన సమయంలో సగం దేశం వెలుపలే...

'సర్' అంటే దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు చేయడమే : ఒవైసీ 05

సంపుటి 28, సంచిక: 171 | గురువారం | 11-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

# ఉస్మానియా వర్సిటీకి రూ.1000 కోట్లు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకరం. రాష్ట్రంలో 25 వేల ప్రభుత్వ పాఠశాలలో 1.25 లక్షల మంది ఉపాధ్యాయులు ఉండగా, 18 లక్షల మంది విద్యార్థులు మాత్రమే చదువుకుంటున్నారు. అదే 11 వేల ప్రైవేట్ పాఠశాలుంటే వాటిలో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎంఎ, పిహెచ్‌డి చదువుకున్న ఉపాధ్యాయులున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య తక్కువగా ఉండడం ఆందోళనకరం.
– సిఎం రేవంత్‌రెడ్డి

## నాణ్యమైన సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యనందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం




- ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, డిజైన్స్‌పై విద్యార్థుల అభిప్రాయాలు, సూచనలకు క్యూర్ కోడ్
- విద్యతోనే జీవితాల్లో మార్పులు, వెలుగులు, ఆత్మగౌరవం
- ఉస్మానియా విశ్వవిద్యాలయ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- రాజకీయ పార్టీల ఉచ్చులో విద్యార్థులు పడొద్దని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్య ఒక్కటే జీవితాల్లో మార్పును, వెలుగులు తెస్తుంది. విద్య ఒక్కటే వెనకబాటు తనం నుంచి బయటికి తీసుకువచ్చి ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. విద్య ఒక్కటే మన తల్లిదండ్రుల కళ్లలో ఆనందాల వెలుగులను నింపుతుంది. ఆలాంటి నాణ్యమైన, సాంకేతిక నైపుణ్యంతో కూడిన విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యం'' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒయు అభివృద్ధికి రూ.1000 కోట్లు మంజూరు చేస్తూ తరువాయి 2లో

## కంపెనీల ప్రోత్సాహానికి స్టార్టప్ ఫండ్


- రూ.వెయ్యి కోట్లతో ఏర్పాటు
- నిధులు సద్వినియోగం చేసుకొని వన్ బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలి
- సిఎం రేవంత్‌రెడ్డి ఆశాభావం
- టి–హబ్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్ ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్




స్టార్టప్ కంపెనీను ప్రోత్సహించడానికి ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలతో స్టార్టప్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకుని స్టార్టప్ కంపెనీలను ప్రారంభించడమే కాకుండా కనీసం 1 బిలియన్ డాలర్ల కంపెనీలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ టీహబ్‌లో ఏర్పాటు చేసిన తరువాయి 2లో

## గ్రామ పంచాయతీ ఎన్నికలు




# నేడు తొలి పోరు



### సర్పంచ్ ఎన్నిక వెన్నంటే ఉప సర్పంచ్ కూడా..

- 3,834 సర్పంచ్, 27,628 వార్డులకు పోలింగ్
- ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ప్రక్రియలో పాల్గొననున్న 56,19,430 మంది ఓటర్లు
- 18 రకాల గుర్తింపు కార్డులకు అనుమతి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు పక్రియ ప్రారంభమవుతుంది. కౌంటింగ్ పూర్తి కాగానే వార్డు సభ్యుల నుంచి ఉప సర్పంచ్ ఎన్నికను కూడా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నద్ధమైంది. ఓట్లు జరిగే గ్రామాల్లో 'లేబర్' హాలిడే ప్రకటించింది. రాష్ట్రంలోని 3834 సర్పంచ్, 27,628 వార్డు తరువాయి 2లో

## ఓట్ చోరీపై చర్చకు రండి

హోంమంత్రి అమిత్‌షాకు రాహుల్‌గాంధీ సవాల్



**న్యూఢిల్లీ:** ఓట్ చోరీ చేసేందుకు ఎన్నికల సంఘంతో బిజెపి కుమ్మక్కైందన్న విషయంపై తనతో చర్చకు రావాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షాకు సవాలు విసిరారు. లోక్‌సభలో బుధవారం రాహుల్‌గాంధీ–అమిత్ షా మధ్య సవాళ్ళు ప్రతి సవాళ్ళతో తీవ్ర వాగ్వాదం జరిగింది. అమిత్ షా ఆత్మరక్షణలో పడ్డారని, భయపడి, తరువాయి 2లో

## ఓట్ చోరీ వాళ్లే చేశారు

- నెహ్రూ, ఇందిరా, సోనియాగాంధీలపై లోక్‌సభలో అమిత్ షా వ్యాఖ్యలు
- దేశంలోకి అక్రమంగా వచ్చినవారిని ఓటర్ల జాబితాలో కొనసాగించేందుకే ఈ లొల్లి అన్న హోంమంత్రి
- వాకౌట్ చేసిన ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ:** సరిహద్దుల్లోంచి అక్రమంగా దేశంలోకి వచ్చిన చొరబాటుదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించడం కోసమే 'సర్' (ఓటర్ జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ) అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ కూడా ఓట్ చోరీకి పాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో బుధవారం కూడా కొనసాగిన చర్చ మధ్యలో హోంమంత్రి జోక్యం చేసుకుంటూ, అవినీతి కార్యకలాపాల ద్వారా ఇంకెంతోకాలం తాము ఎన్నికల్లో విజయం సాధించలేమని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయని విమర్శించారు. అసలు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ పరాజయానికి కారణం ఆ పార్టీ నాయకత్వమే తప్ప ఇవిఎంలు లేదా ఓట్‌చోరీ సమస్యలు కాదని వ్యంగ్య విమర్శలు చేశారు.
''అక్రమంగా దేశంలోకి వచ్చిన చొరబాటుదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించడానికే ప్రతిపక్షాలు ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణను ఒక సమస్యగా తెచ్చి పార్లమెంటులో ప్రస్తావిస్తున్నాయని, తరువాయి 2లో

## దీపావళికి యునెస్కో గుర్తింపు

### కల్చరల్ హెరిటేజ్ జాబితాలో చోటు



**న్యూఢిల్లీ :** దివ్వెల పండుగ దీపావళికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ జాబితాలో దీపావళి పండుగ చేరింది. ఢిల్లీ ఎర్రకోట వద్ద నిర్వహించిన సమావేశంలో యునెస్కో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రకటన చేశారు. దీనిపై హర్షం వ్యక్తం తరువాయి 12లో




## చీకటి ఒప్పందాలు.. అంకెల గారడీలు

- గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన ఒప్పందాలతో ప్రజలకు పనికొచ్చే పనులేవీ లేవు
- రెండేళ్లలో ఎన్నికోట్ల పెట్టుబడులొచ్చాయ్, ఎంతమందికి ఉద్యోగాలిచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలి
- ప్రభుత్వానికి మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్లోబల్ సమ్మిట్ లో జరిగిన ఎంఒయుల వెనుక చీకటి ఒప్పందాలు, అంకెల గారడీ తప్ప ప్రజలకు పనికొచ్చే పనులు ఏవీ లేవని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రెండేళ్లుగా కోట్లు ఖర్చు చేసి సిఎం తిరిగిన దేశాలు, నిర్వహించిన సమ్మిట్స్ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మొత్తం ఎన్ని కోట్ల పెట్టుబడులు వచ్చాయి? అందులో ఎన్ని కంపెనీలు తరువాయి 12లో

విత్తన చట్టంలో మార్పులు చేయండి
ముసాయిదా సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 'సక్సెస్ జోష్'
నాడు దావోస్‌లో రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు ..



03

## 220 ఇండిగో విమానాలు రద్దు




### సంస్థ సిఇఒకు సమన్లు జారీ చేసిన డిజిసిఎ

**ముంబయి :** 'ఇండిగో'లో సంక్షోభం కొనసాగుతూనే ఉంది. ఎయిర్‌లైన్స్‌లో గత కొంత కాలంగా నెలకొన్న అంతరాయం సమసిపోయిందని, కార్యకలాపాలు తిరిగి గాడిలో పడ్డాయని సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ చెప్పినప్పటికీ బుధవారం కూడా పలు విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ, ముంబయితో సహా మూడు ప్రధాన విమానాశ్రయాలలో దాదాపు 220 విమానాలను రద్దు చేసింది. ఢిల్లీ విమానాశ్రయంలో 137 విమానాలను, ముంబయి విమానాశ్రయంలో 21 సేవలను రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. ఇండిగో బెంగళూరు విమానాశ్రయంలో 61 విమానాలను రద్దు చేసిందని, వాటిలో 35 రాకపోకలు, 26 నిష్క్రమణలు తరువాయి 12లో

## మత ఘర్షణలకు బిజెపి కుట్ర

### తమిళనాట రాజకీయ లబ్ధి కోసమే 'దీపం' వివాదం: వామపక్షాల విమర్శ

**న్యూఢిల్లీ:** తమిళనాడులో రాజకీయ లబ్ధి కోసం మత ఘర్షణలకు బిజెపి, హిందూత్వ శక్తులు కుట్ర చేస్తున్నట్లు వామపక్షాలు విమర్శించాయి. మదురై జిల్లాలోని తిరుప్పరంకుంద్రం కొండపై ప్రార్థనా సంస్థల చుట్టూ వివాదాన్ని సృష్టిస్తున్నాయని దుయ్యబట్టాయి. ప్రజల జీవనోపాధి, రాజ్యాంగ హక్కులపై మోదీ ప్రభుత్వ దాడుల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్న సంఘ్ పరివార్ మతోన్మాద రాజకీయాన్ని తిరస్కరించాలని పిలుపునిచ్చాయి. ఇందుకోసం ప్రజాస్వామ్య, లౌకిక, భావసారూప్య వర్గాలన్నీ కలిసి రావాలని కోరుతూ సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఆర్‌ఎస్‌పి, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఎ బేబి, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజ్ మంగళవారం ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. 'తిరుప్పరంకుంద్రం కొండపై మూడు ఆలయాలు, ఒక దర్గా, జైనుల పురాతన గుహలు ఉన్నాయి. శతాబ్దాలుగా ఈ కొండ మత సామరస్యానికి చిహ్నంగా నిలిచింది. మత విశ్వాసాలు వేరైనాగానీ తరువాయి 12లో

## ట్రంప్ ఒప్పందం ఉల్లంఘన



### కాంగోలో హింస

- రువాండా మద్దతుతో దూసుకెళ్తున్న ఎం–23 తిరుగుబాటుదారులు
- రెండు లక్షలమంది ప్రజలు వలస

**కిన్షాసా:** డి.ఆర్. కాంగో (డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో)లో సమస్య పరిష్కారానికి గతవారం (డిసెంబరు 4)న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఒక ఒప్పందం కుదిర్చినా ఫలితం లభించలేదు. రువాండా మద్దతుతో ఎం–23 తిరుగుబాటుదారులు ఒప్పందాన్ని ఉల్లంఘించి ముందుకు దూసుకుపోతూ జైత్రయాత్ర చేస్తున్నారు. కాంగో అధ్యక్షుడు ఫెలెక్స్ తిసెకిడి, రువాండా నాయకుడు పాల్ కగమె మధ్య ఒప్పందం జరిగినా ప్రయోజనం లేకపోయింది. అంతకుముందు జూన్‌లో కూడా ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం ప్రకారం రెండు పక్షాలు ఒక ఆర్థిక సమీకృత ఒప్పందానికి వచ్చాయి. ఖనిజ సంపదతో తులతూగే ఉవిరా ప్రాతంపై తిరుగుబాటు దారులు తాజా దాడులు చేస్తుంటే కాంగో సైన్యం పారిపోతోంది. ఎం 23 హింసాకాండ, దాడులు భరించలేక తూర్పు కాంగో నుండి ఇటీవల 2,00,000 మంది ప్రజలు ఇళ్ళువదలి పారిపోయారు. దీర్ఘకాలంగా ఈ ప్రాంతంలో ఉన్న తెగల సమస్య ఎం–23 (మార్చ్ 23 ఉద్యమం) రూపంలో తూర్పు కాంగో దక్షిణ కివూ రాష్ట్రంలో చిచ్చురేపింది. సరిహద్దుల్లో ఉన్న రువాండా ప్రభుత్వం మద్దతుతో ఎం 23 తిరుగుబాటు దారులు తూర్పు కాంగోలో కొత్త ప్రాంతాలను ఆక్రమిస్తున్నారు. హింసాకాండ సృష్టిస్తున్నారు. ఈ కారణంగా ఉవిరా ప్రాంతంలో తిరుగుబాటుదారులు ముందుకు తరువాయి 12లో




# ప్రపంచం
WORLD NEWS

## హైతీలో ఘర్షణలు :49 మంది మృతి

**శాంటియాగో:** హైతీ రాజధాని పోర్ట్ ఔప్రిన్స్‌లో ముఠాల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణల్లో కనీసం 49 మంది మరణించారని వార్తలు అందుతున్నాయి. ఒక బలమైన ముఠా కూటమి సభ్యులమధ్య అంతర్గతంగా ఈ ఘర్షణలు జరిగాయి. మరణించినవారిలో 10 మంది పిల్లలు కూడా ఉన్నారని స్థానిక మానవహక్కుల గ్రూపు ప్రకటించింది. పోర్ట్ ఔ ప్రిన్స్‌లోని బెల్–ఎయిర్ మురికివాడలో ఉన్న ఒక ముఠాలో అత్యున్నతస్థాయి ర్యాకింగ్ సభ్యుడు డేడే ఈ ఘర్షణల్లో హతుడయ్యాడు. ఆయనను తల నరికి చంపారు. ఈ ఘర్షణల్లో బలమైన ముఠా నాయకుడు కెంపెస్ సొనన్, ఒక మాజీ పోలీసు ఉన్నతాధికారి కూడా తీవ్రంగా గాయపడ్డారని శాంతి–అభివృద్ధి కమిటీ ఒక ప్రకటనలో తెలియజేసింది. హైతీ రాజధాని నగరంలోని 90 శాతం ప్రాంతం ఈ ముఠాల చేతుల్లోనే ఉంటుంది. దీంతో ఈ ఘర్షణలు నగరం అంతటా వ్యాపిస్తాయని భావిస్తున్నారు. హైతీ రాజధానిలో విస్తారంగా ఉన్న ఈ ముఠాలమధ్య ఇటీవల ఒక శాంతి ఒప్పందం కుదిరింది. ఘర్షణలు పడకూడదని సామరస్యంగా జీవించాలని వారు తీర్మానించుకున్నారు. అందువల్ల ఈ ఘర్షణలు జరగడానికి అసలు ఆస్కారమే లేదు. కానీ భారీ ఎత్తున హింసాకాండ జరిగింది.

## బోల్సెనారోకు జైలుశిక్ష తగ్గిస్తూ బ్రెజిల్ దిగువసభ తీర్మానం



**బ్రసిలియా:** బ్రెజిల్ దేశ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సెనారో (70) కు విధించిన జైలు శిక్షను రెండు సంవత్సరాలకే పరిమితం చేస్తూ ఆ దేశ పార్లమెంటు దిగువసభ తీర్మానం చేసింది. ఇక ఈ బిల్లును ఎగువసభ సెనేట్ ఆమోదించాల్సి ఉంది. ఎగువసభలో కూడా బిల్లు ఆమోదం పొందితే ఆయన 20 సంవత్సరాలు జైలుశిక్ష అనుభవించాల్సిన అవసరం ఉండదు. బ్రెజిల్ సుప్రీంకోర్టు ఆయనకు 27 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. గత నెల చివరివారం నుండీ ఆయన జైలుశిక్ష అనుభవించడం ప్రారంభించారు. కానీ ఇంతలోనే ఆ దేశ పార్లమెంటు జోక్యం చేసుకుని ఆయనకు జీవితకాల శిక్షను గణనీయంగా తగ్గిస్తూ దిగువసభ ఒక బిల్లును ఆమోదించింది. విముక్తి కలగజేసి రెండేళ్ళకే శిక్షను పరిమితం చేసింది. ఆరోగ్య పరిస్థితి బాగోలేనందువల్ల శిక్షను ఇంటికే పరిమితం చేయాలని, గృహనిర్బంధం చేయాలని బోల్సెనారో అనుచరులు, ఆయన తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టును కోరారు. కొద్దికాలం అదేవిధంగా ఆయన గృహనిర్బంధంలో ఉన్నారు. 2022లో బ్రెజిల్ ఎన్నికల్లో అధ్యక్షుడుగా గెలిచిన లూయీస్ ఇనాసియో లులా డసిల్వాను బాధ్యతలు చేపట్టనీయకుండా బోల్సెనారో కుట్రకు పాల్పడ్డారన్న ఆరోపణలు రుజువు కావడంతో సుప్రీంకోర్టు ఈ ఏడాది సెప్టెంబరులో ఆయనను నేరస్థుడుగా నిర్ధారించింది. తీవ్రమైన శిక్ష విధించింది. మితవాద లిబరల్ పార్టీ నాయకుడు బోల్సెనారో 2019 జనవరి నుండి 2023 జనవరి వరకూ బ్రెజిల్ 38వ దేశాధ్యక్షుడుగా పనిచేశారు. ఎన్నికల్లో గెలిచిన లులా డసిల్వాను పదవీ బాధ్యతలు చేపట్టనీయకుండా తానే అధికారంలో కొనసాగేవిధంగా ఆయన కుట్రకు పాల్పడ్డి అల్లర్లు రెచ్చగొట్టారు.

## చైనాలో అగ్ని ప్రమాదం : 12 మంది ఆహుతి



**శాంటౌ:** దక్షిణ చైనాలోని శాంటౌ ప్రాంతంలో ఉన్న నివాసిత భవనంలో అగ్ని ప్రమాదం సంభవించడంతో 12 మంది సజీవదహనమయ్యారు. గ్యాంగ్ డాంగ్ రాష్ట్రం శాంటౌలో మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ అగ్ని ప్రమా దం సంభవించింది. నాలుగు అంతస్తుల్లో ఉన్న ఈ రీ–ఇన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ ని ర్మాణంలో 1600 అడుగుల విస్తీర్ణంలో 40 నిమిషాలసేపు ఈ మంటలు భయభ్రాంతులు సృష్టించి 12 మందిని బలితీసుకున్నాయి. ఆ తర్వాత ఈ మంటలను ప్రకృతి విపత్తు నివారణ బృందాలు నియంత్రించాయి. గతనెల చివరి వారంలో హాంగ్‌కాంగ్‌లో ఏడు ఆకాశహర్మ్యాలు దగ్ధమైన ప్రపంచాన్ని దిగ్భ్రాంతి పరచిన ప్రమాదం తర్వాత చైనాలో జరిగిన మరో అగ్ని ప్రమాదం ఇదే. ఈ వరుస ఘటనలతో గ్యాంగ్ డాంగ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ప్రమాదానికి గల కారణం ఏమిటో తెలుసుకోవాలంటూ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. పోలీసులు, అత్యవసర నిర్వహణాధికారులు, క్రమశిక్షణాబృందం సిబ్బంది ఈ టాస్క్‌ఫోర్స్‌లో సభ్యులుగా ఉంటారు. ఈ నాలుగు అంతస్తుల భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో విద్యుత్ పరికరాలు, ఇతర విక్రయాలకు సంబంధించిన స్టోర్‌ను ఏర్పాటు చేశారని, ఈ స్టోర్ నుండే మంటలు పై అంతస్తులకు వ్యాపించాయని ప్రాథమికం సమాచారంలో వెల్లడైంది.

## మీడియాకు ప్రాణాంతక సంవత్సరం – 2025

# 67 మంది జర్నలిస్టులు మృతి

- ప్రమాదకర దేశాలలో మెక్సికోకు రెండోస్థానం
- 503 మంది నిర్బంధం, 135 మంది అదృశ్యం
- ఉక్రేన్,హోండూరాస్‌లలో ఇద్దరు విదేశీ జర్నలిస్టులు మృతి

**న్యూయార్క్ :** ప్రపంచవ్యాప్తంగా 2025వ సంవత్సరంలో డిసెంబరు ఒకటో తేదీ నాటికి 67 మంది జర్నలిస్టులు మ రణించారు. అనేకమంది జర్నలిస్టులు అదృ శ్యం కాగా 503 మంది జర్నలిస్టులు ప్రపంచవ్యాప్తంగా జైళ్ళల్లో ఉన్నారు. ప్రస్తుతం 37 దేశాలలో 135 మంది జర్నలిస్టులు జాడ తెలియకుండా పోయారు. 20 మంది జర్నలిస్టులు ఉగ్రవాద ముఠాలవద్ద బందీలుగా ఉన్నారు. హౌతీ ఉగ్రవాదులవద్ద ఏడుగురు బందీలుగా ఉండగా, యెమెన్‌లో మిగిలినవారు బందీలుగా ఉన్నారు. ఒక్క పశ్చిమ ఆసియా, లా టిన్ అమెరికాలోనే 72 శాతం జర్నలిస్టులు అదృశ్యమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 10 దేశాలు జర్నలిస్టులకు ఈ నాటికీ కారాగారవాసాలుగా మిగిలిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా గణాంకాలు చూసినప్పుడు సిరియాలో అత్యధికసంఖ్యలో జర్నలిస్టులు జాడ తెలియకుండా పోయారు. ముఖ్యంగా సురక్షితంగా భావిస్తున్న వారి వారి మాతృదేశాల్లోనే జర్నలిస్టులకు ఎక్కువ అపాయాలు జరుగుతున్నా యి. వార్తల కవరేజీ బాధ్యతల నిర్వహణలో ఇద్దరు జర్నలిస్టులు మాత్రమే ఈ ఏడాది విదేశాలలో మరణించారు. ఉక్రేన్‌లో రష్యా చేసిన డ్రోన్‌దాడిలో ఫ్రెంచ్ ఫొటో జర్నలిస్టు ఆంటోనీ లల్లికన్ మరణించగా, సాల్వడార్ దేశానికి చెందిన చెందిన జర్నలిస్టు జేవియర్ హెర్క్యులస్ హోండూరాస్‌లో మరణించారు. మిగిలిన జర్నలిస్టులు అందరూ స్వదేశాలలోనే హత్యలకు గురయ్యారు. జర్నలిస్టులు ఈ ఏడాది ప్రమాదాల బారినపడి మరణించలేదు. హత్యలకు గురయ్యారు. వృత్తిపరంగా హత్యలకు గురయ్యారు. వార ని వెంటాడి వేటాడి చంపారు. ఆసియాలో 43.54 శాతం, యూరప్, సెంట్రల్ ఆసియాలో 23.84 శాతం, అమెరికాలో 20.48 శాతంమంది జర్నలిస్టులు నిర్బంధంలో ఉన్నారు. ‘‘రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్’’ సంస్థ ప్రాంతాల వారీగా ఈ గణాంకాలను సమకూర్చింది. పూర్వపు సోవియట్ రిపబ్లిక్‌లలో జర్నలిస్టులు నియంత పోకడలకు బలవుతున్నారు. జార్జియా,అజర్‌బైజాన్, బెలారస్‌లలో జర్నలిస్టులకు స్వేచ్ఛలేదు. బెదిరింపులు వారికి నిత్యకృత్యం.అజర్‌బైజాన్‌లో ప్రస్తుతం 25 మంది జర్నలిస్టులు జైళ్ళల్లో మగ్గుతున్నారు. ఇజ్రాయెల్‌లో 20 మంది పాలస్తినా జర్నలిస్ట్ లు, గాజా,వెస్ట్‌బ్యాంక్‌లలో 16 మంది జర్నలిస్టులు జైళ్ళలో మగ్గిపోతున్నారు. మాలీలో ‘రేడియో కోటన్‌డీ ఆన్సోం గో జర్నలిస్టు, డైరెక్టర్ సాలెక్ అగ్ జిద్దౌ, ప్రెజెంటర్ మౌస్త ఫా కోనే ఇద్దరూ 2023 నవంబరు నుండి గుర్తుతెలియని సాయుధ ముఠాలవద్ద బందీలుగా ఉన్నారు. ప్రపంచదేశాల్లో, వివిధ ప్రాంతాలలో జరుగుతున్న యుద్ధాలవల్ల, అవినీతి, మానవ వ్యతిరేక దాడులు, హింస,ద్వేషం ఏటేటా పెరుగుతున్న తరుణంలో జర్నలిస్టులు కేవలం మరణించడంలేదు. వారు హత్యలకు గురవుతున్నారు. జర్నలిస్టుల హత్యా ఘటనలు ఏటేటా పెరుగుతున్నాయి. ఈ ఏడాది పశ్చిమ ఆసియా అగ్రస్థానంలో ఉంది. అత్యధికంగా జర్నలిస్టులు ఈ ప్రాంతంలో జరిగిన ఘర్షణల్లో మరణించారు. గాజా ప్రాంతం అగ్రస్థానంలో ఉండగా మెక్సికో రెండోస్థానంలో ఉంది. వీటిల్లో ప్రభుత్వాలు స్వయంగా చేసిన హత్యలు ఉన్నాయి. వ్యవస్థాగతమైన నేరాలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నందువల్ల జర్నలిస్టుల హత్యలు కూడా పెరుగుతున్నాయి. 2025లో ఇప్పటివరకూ మరణించిన జర్నలిస్టులలో 57 మంది యుద్ధం, లేదా క్రిమినల్ నెట్‌వర్క్ కారణంగా మరణించారు.

సాధారణ పోలీసులు, పారామిలిటరీ దళాలు సహా హంతక ముఠాలు కూడా ఈ హత్యలకు కారకులవుతున్నారు. గడచిన 12 నెలల్లో ఇజ్రాయెల్ సాయుధ బలగాల చర్యల కారణంగా 43 శాతం జ ర్నలిస్టులు హత్యలకు గురయ్యారు. చైనా,రష్యా, ఉక్రేన్, మయన్మార్ దేశాలు జర్నలిస్టులకు అతిపెద్ద బందిఖానాలుగా మారాయి. చైనాలో 121 మంది జర్నలిస్టులో జైళ్ళ ల్లో బందీలుగా ఉండగా, రష్యాలో 48 మంది, ఉక్రేన్‌లో 26 మంది, మయన్మార్‌లో 47 మంది జర్నలిస్టులు, బెలారస్‌లో 33 మంది, వియత్నాంలో 28 మంది, అజర్‌బైజాన్‌లో 25 మంది, ఇరాన్‌లో 21 మంది, ఇజ్రాయెల్‌లో 20 మంది, ఈజిప్టులో 20 మంది, సౌదీఅరేబియాలో 19 మంది జర్నలిస్టులు బందీలుగా జైళ్ళల్లో మగ్గుతున్నారు. సిరియాలో బషర్ అలీ అస్సాద్ ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత అరెస్టులకు గురైన జర్నలిస్టుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వారంతా బలవంతంగా హత్యలకు గురయ్యారా? లేక జాడ తెలియకుండా పోయారా? అనే విషయంలో అన్వేషణ జరుగుతోంది. ఇక మెక్సికోలో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ముఠాల కారణంగా ఈ ఏడాది అనేకమంది జర్నలిస్టులు మరణించారు. ఆందోళన కలిగించేస్థాయిలో ఈ ఏడాది మెక్సికోలో జర్నలిస్టుల మరణాలు పెరిగాయి.

ప్రపంచంలో జర్నలిస్టులకు ప్రమాదకరంగా మారిన దేశాలలో మెక్సికో రెండోస్థానంలో ఉంది. మెక్సికోలో మాదక ద్రవ్యాల ముఠాలు, మానవ అక్రమ రవాణా ఉగ్రవాద ముఠాలు ఘోరమైన నేరాలకు పాల్పడుతున్నాయి. గడచిన మూడు సంవత్సరాలకంటే ఈ ఏడాది జర్నలిస్టులకు మెక్సికో అత్యంత ప్రాణాంతకదేశంగా మారింది. ఈ సంవత్సరంలో మెక్సికోలో ఏకంగా తొమ్మిదిమంది జర్నలిస్టులు మరణించారు. ప్రపంచంలో హత్యకు గురైన జర్నలిస్టులలో 24 శాతం మంది మెక్సికోలోనే ఉన్నారు.

## సెక్యూరిటీ గ్యారంటీ ఇస్తే ఎన్నికలకు సై

ట్రంప్ విమర్శలకు జెలెన్స్కీ ప్రతిస్పందన

**కీవ్:** ఉక్రేన్‌లో తక్షణం ఎన్నికల నిర్వహణకు ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ సంసిద్ధత ప్రకటించారు. ఉక్రేన్‌కు పూర్తి భరోసా ఇచ్చేవిధంగా సెక్యూరిటీ గ్యారంటీలు గనుక ఇస్తే దేశంలో 60 నుండి 90 రోజుల వ్యవధిలోనే సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. అదే విధంగా నేడో–రేపో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తాను సవరించిన శాంతి ప్రణాళిక ప్రతిపాదనలు సమర్పిస్తానని కూడా చెప్పారు. ఉక్రేన్‌లో ఎన్నికలను ఎగవేసేందుకు యుద్ధాన్ని ఒక సాకుగా అడ్డం పెట్టుకున్నారని ట్రంప్ చేసిన విమర్శకు జెలెన్స్కీ పైవిధంగా స్పందించారు. ట్రంప్ ప్రకటించిన ముసాయిదా శాంతి ప్రణాళికపట్ల జెలెన్స్కీ విముఖత ప్రకటించారు. యూరప్ నాయకులతో ఆయన కొద్ది రోజులుగా ముమ్మరంగా మంతనాలు సాగిస్తూ వచ్చారు. యూరప్‌లోని పలు దేశాలలో ఆయన పర్యటించి నాయకులతో చర్చలు జరిపారు. చివరిగా లండన్‌లో బ్రిటన్ ప్రధాన మంత్రి అధికార నివాసంలో నాటో కూటమి నాయకులతో సమావేశం నిర్వహించిన తర్వాత తమ వద్ద ఉన్న భూభాగాలను రష్యాకు వదులుకునేది లేదని స్పష్టం చేశారు. సవరించిన కొత్త ప్రణాళికను ట్రంప్‌కు సమర్పించగలనని అసలు విషయం స్పష్టం చేశారు. ట్రంప్ ప్రతిపాదనలు పూర్తిగా రష్యాకే అనుకూలంగా ఉన్నాయని మొదటి నుండీ జెలెన్స్కీ నసుగుతూనే ఉన్నారు. పైకి మాత్రం ఇష్టపూర్వకంగా ఉన్నట్టే వ్యవహరించారు. జెనీవా సదస్సులో కొన్ని రాయితీలు సంపాదించారు. ఉక్రేన్‌కు పూర్తి భద్రతా హామీలు ఉండాలన్నారు. ట్రంప్ రూపొందించిన 28 అంశాల తొలి ప్రణాళిక ప్రతిపాదనలన్నీ రష్యాకే అనుకూలంగా ఉన్నాయని నాటో కూటమి, యూరోపియన్ యూనియన్ నాయకులు విమర్శించారు. ఈ ప్రణాళికను అంగీకరించవద్దని జెలెన్స్కీపై వారు ఒత్తిడి తెచ్చారు. దీంతో ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అసలు ఉక్రేన్ యుద్ధ నివారణకు తాను రూపొందించిన ముసాయిదా శాంతి ప్రణాళిక ప్రతిని జెలెన్స్కీ ఇన్ని రోజులు గడచినాగానీ అసలు చదవలేదని విమర్శించారు.

## నోబెల్ శాంతి బహుమతి ఉత్సవానికి మచాడో గైర్హాజరు

**నార్వే:** ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మారియా కొరినో మచాడో (58) నార్వేలో బుధవారం జరిగిన అవార్డు స్వీకారోత్సవానికి గైరుహాజరయ్యారు. ఆమె బదులుగా ఆమె కుమార్తె ఈ నోబెల్ శాంతి బహుమతి స్వీకరించారు. గడచిన కొద్ది రోజులుగా మచాడో ఎక్కడ ఉన్నారో కూడా తమకు జాడ తెలియదని, ఆమె గురించిన సమాచారం తెలియడంలేదని నోబెల్ కమిటీ అధికారులు చెప్పారు. ఐతే వెనిజులాపై ట్రంప్ దాడులు చేసేందుకు బెరింపులు చేయడం, కరీబియన్ సముద్ర జలాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకున్న పరిస్థితుల మధ్య వెనిజులా ప్రభుత్వంమచాడోపై ఆంక్షలు విధించింది. నార్వే వెళితే దేశం వదలి వెళ్ళిపోయిన నేరస్థురాలుగా మచాడోను ప్రకటిస్తామని అటార్నీ జనరల్ తారెక్ విలియం సాబ్ అన్నారు. ఆమెపై అనేక నేరాభియోగాలు ఉన్నారు. వెనిజులా హోంమంత్రి దియాస్‌దాడో కేబెల్లో మాట్లాడుతూ, మచాడో నార్వే వెళుతున్నారో లేదో తమకు తెలియదన్నారు.

## స్టార్టప్ ఫండ్
(మొదటి పేజీ తరువాయి)

గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో ఏర్పాటవుతున్న స్టార్టప్ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలన్న లక్ష్యంతో పని చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ‘హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నా. అంటే కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలు ఎదగాలి. వీటిల్లో 2034 నాటికి కనీసం 10 స్టార్టప్‌లు సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. 1998లో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో ఇద్దరు మిత్రులు కలిసి కాలిఫోర్నియాలో స్టార్టప్‌గా ప్రారంభించిన ఒక గ్యారేజీయే ఇప్పుడు గూగుల్‌గా అవతరించింది. ఇదెంతో స్ఫూర్తి దాయకమైన అంశం. రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక విజన్‌తో ముందు కు సాగుతూ, ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలన్న లక్ష్యంతో రెండు రోజుల పాటు తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌పైన గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించాం. జాతీయ అంతర్జాతీయ కార్పోరేట్ ప్రతినిధుల సమక్షంలో తెలంగాణ రైజింగ్ విజన్‌ను ఆవిష్కరించాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, అలాగే 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ రాష్ట్రం ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. పదిహేను ఇరవై ఏళ్ల కిందట ప్రారంభించబడిన అనేక స్టార్టప్‌లు ఇప్పుడు బిలియన్స్ డాలర్ల కంపెనీలుగా ఎదిగాయి. టీమ్ వర్క్‌తో పనిచేయాలి. చివరగా విజయం సాధించడం చాలా ముఖ్యం. స్టార్టప్‌లు కూడా అదే విధంగా పనిచేయాలి’ అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**యూనివర్సిటీల్లో ఇంక్యూటేషన్ సెంటర్ల ఏర్పాటు : మంత్రి శ్రీధర్‌బాబు**

ఈ కార్యక్రమంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో ‘ఇంక్యూబేషన్’ సెంటర్లను ఏర్పా టు చేయనున్నట్లు వెల్లడించారు. తెలంగాణను ‘గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్’గా మార్చాలనే లక్ష్య సాధనలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ ‘వన్ హబ్’కు ధీటుగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దుతామన్నారు. మేం స్టార్టప్‌లను కేవలం చిన్న కంపెనీలుగా మాత్రమే చూడటం లేదని, సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందిస్తూ... కొత్త ఉద్యోగాలను సృష్టించే ‘ఎకనామిక్ ఇంజిన్స్’గా చూస్తున్నామన్నారు. 2024లో ఇక్కడి స్టార్టప్‌లు 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 160 శాతం అధికమని వివరించారు. ముఖ్యంగా హెల్త్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. మహిళా నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ దేశంలోనే ఆరో స్థానంలో ఉందన్నారు. 531 వుమెన్ లేడ స్టార్టప్‌లు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ పనితీరుకు, ప్రగతిశీల విధానాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం టెక్నాలజీని కేవలం టూల్‌గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తోందన్నారు.

## చర్చకు రండి
(మొదటి పేజీ తరువాయి)

తమను తాము రక్షించుకునే సమాధానాలు చెబుతున్నారని రాహుల్‌గాంధీ వ్యంగ్య విమర్శలు చేశారు. నాయకులు ఇద్దరూ సభలో పరస్పరంఒకరిపై మరొకరు వ్యంగ్య విమర్శలు చేశారు. తాము నిర్వహించిన మూడు పత్రికాగోష్ఠులలో ‘ఓట్ చోరీ’కి సంబంధించిన అడిగిన ప్రశ్నలపై చర్చకు రావాలని అమిత్ షాను సవాలు చేశారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ కొనసాగిన సందర్భంగా కాంగ్రెస్‌పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను రాహుల్‌గాంధీ దీటుగా తిప్పికొట్టారు. ఇద్దరి మధ్యా వాడీ–వేడీగా వాగ్వాదం జరిగింది. ‘‘నేను నిన్న (మంగళవారం) మూడు ప్రశ్నలు అడిగాను, ఎన్నికల కమిషనర్లు తీసుకున్న తిరుగులేని నిర్ణయాలను ఎవ్వరూ ప్రశ్నించడానికి వీలులేకుండా భారతదేశ చరిత్రలో మొదటిసారి వారికి చట్టపరమైన పూర్తి రక్షణలు కల్పించారు. ఈ విధమైన ఆలోచనల వెనుక ఉన్న అంతరార్థం ఏమిటో తప్పనిసరిగా ఆయన (అమిత్ షా) సమాధానం చెప్పితీరాలి, ఆయన హర్యానా గురించి మాట్లాడారు, ఆయన ఒక ఉదాహరణ చెప్పారు, కానీ ఓట్ చోరీకి సంబంధించి అనేక ఉదాహరణలు ఉన్నాయి’’ అని రాహుల్‌గాంధీ అన్నారు. ‘‘నేను నిర్వహించిన పత్రికాగోష్ఠుల్లో చెప్పిన అంశాలపై చర్చ చేద్దాం రండి, అమిత్ షా జీ, నేను మిమ్మల్ని సవాలు చేస్తున్నా, నేను నిర్వహించిన మూడు పత్రికాగోష్ఠిలో చెప్పిన అంశాలపై చర్చిద్దాం రండి’’ అని రాహుల్‌గాంధీ లోక్‌సభలో అన్నారు. ఈ సవాలుపై అమిత్ షా తిరిగి స్పందిస్తూ,ప్రతిపక్ష నాయకుడి కోరికలు, ఆలోచనలకు అనుగుణంగా తన ప్రసంగాన్ని మలచుకోలేనని, ఆయనకు అనుకూలంగా తాను మాట్లాడలేనన్నారు. ఎవరో చేసిన డిమాండ్‌కు అనుగుణంగా ఈ చర్చను, పరిస్థితులను మార్చడం వీలు కాదని అమిత్ షా అన్నారు. దీంతో రాహుల్‌గాంధీ ప్రతిస్పందిస్తూ, అమిత్ షా ఆత్మరక్షణలో పడ్డారని, ఆయన భయపడి వెనక్కితగ్గి జవాబులిస్తున్నారని హేళన చేశారు. ఓట్ చోరీపైన, ఎన్నికల సంఘం ప్రవర్తన పైనా గడచిన కొద్ది నెలలుగా పార్లమెంటులో అధికార–ప్రతిపక్షాలమధ్య తీవ్ర వాగ్వాదాలు, విమర్శలు–ప్రతివిమర్శలు వాడీవేడీగా కొనసాగుతున్నాయి. చేశారు.భారత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలిస్తూ, తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నదని మంగళవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్‌గాంధీ విమర్శించారు. తాము ఏం చేసిన చెల్లుబాటు అవుతుందని ఎన్నికల కమిషనర్లు భావిస్తున్నారని, ఈ చట్టాలు ఇదేవిధంగా యథాతథంగా కొనసాగబోవని, తాము అధికారంలోకి వస్తేగతకాలపు నిర్ణయాలను కూడా తిరగదోడి వాస్తవాలను వెలికితీసేవిధంగా చట్టాల్లో మార్పులు తీసుకు వస్తామని కూడా రాహుల్‌గాంధీ హెచ్చరిక చేశారు.

## రూ.1000 కోట్లు




(మొదటి పేజీ తరువాయి)

జిఓను విడుదల చేశారు. ఈ నిధులతో అభివృద్ధి చేయనున్న ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్, డిజైన్స్‌పై విద్యార్థుల అభిప్రాయాలు, సూచనల కోసం ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. బహిరంగసభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్ , ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఓయు వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా వినిపించిన ఉద్యమాల పురిటి గడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం అన్నారు. గుండెల నిండా అభిమానం నింపుకుని ఇక్కడికి వచ్చానన్నారు. 100 ఏళ్ల చరిత్ర గల ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఇక్కడికి రావడం జరిగిందన్నారు. విద్యార్థులు రాజకీయ పార్టీల ఉచ్చులో పడోద్దని సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమస్యలుంటే నిలబడి కోట్లాడాలని, వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు.

**తెలంగాణ పౌరుషాల గడ్డ**

తెలంగాణ గడ్డకు ఒక చైతన్యం, పౌరుషం ఉందని, ఆ చైతన్యం, పౌరుషానికి చదువుతో పనిలేదని ఈ తెలంగాణ నిరూపించిందని సిఎం పేర్కొన్నారు. ఎవరైనా ఆధిపత్యం చెలాయించాలని చూసిన ప్రతిసారీ తెలంగాణలో తిరుగుబాటు మొదలైందన్నారు. కొమురం భీమ్ నుంచి సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ ఉద్యమం వరకు ఆధిపత్యంపై పోరాటం కొనసాగించి విజయాలను అందుకుందని చెప్పారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ ముందు భాగాన నిలిచిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. అనేక త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంత ప్రజలు ఆస్తులు, అంతస్తులు, ఫామ్ హౌస్‌లు అడగలేదని, వారు కేవలం స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మాత్రమే కోరారని, కానీ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ ఏమి చేసిందో తెలిసిందేనన్నారు. గత పదేళ్ళ కాలంలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేయాలని ప్రయత్నం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందిస్తున్నామని చెప్పారు.



**పేదరికం, వెనకబాటుతనం వేర్వేరు**

పేదరికానికి, వెనకబాటుతనానికి సంబంధం లేదని, ఈ రెండు వేర్వేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో 20, 30 ఎకరాల భూములున్నవారు కూడా వెనకబాటులో ఉన్నారని, ప్రభుత్వం నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైందన్నారు. భూములు లేక ఉపాధి లేకపోవడం పేదరికమైతే, ఆర్థికంగా ఉండి కూడా చదువు లేకపోవడంతో వెనకబాటుతనానికి గురవుతున్నట్లు గుర్తించామన్నారు. అందుకే మారుమూల గ్రామాల నుంచి పేదరికం, వివక్ష, వెనకబాటుతనం సమూలంగా నిర్మూలించేందుకే ప్రభుత్వం 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు.

**భాష కేవలం కమ్యూనికేషన్ మాత్రమే**

కొందరు తమకే ఇంగ్లీష్ వచ్చని తెగ మురిసిపోతూ తనకు ఆ భాష రాదంటూ చులకన చేస్తున్నరని సిఎం అన్నారు. తాను గుంటూరులో చదువుకోలేదని, ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, విదేశీ భాష రాకపోవచ్చు గానీ వారిలాగా తనకు గూడుపుఠానీ తెలియదన్నారు. భాష కేవలం కమ్యూనికేషన్ మాత్రమేనని, విద్యతో పాటు నైపుణ్యం ఉండాలన్నారు. అదే నైపుణ్యం ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా బతుకోచ్చని తెలిపారు. చైనా, జపాన్ వారు ఇప్పుడిప్పుడు ఎబిసిడిలను నేర్చుకుంటున్నారని, వారు అమెరికాను మించి పోయే స్థాయికి ఎదిగరన్నారు.

**ఒయులో ఖాళీగా ఉన్న 1000 పోస్టులను భర్తీ చేయాలి**

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిధులు ఇచ్చిన ప్రభుత్వం సుదీర్ఘ కాలంగా ఖాళీగా ఉన్న లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని, ఈ ప్రక్రియలో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఒయు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మాట్లాడుతూ ఒయు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు తొలి పోరు
(మొదటి పేజీ తరువాయి)



స్థానాలకు పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. కాగా 3834 సర్పంచ్ స్థానాలకు 12,960 మంది అభ్యర్థులు, 27,628 వార్డు స్థానాలకుగాను 65,455 మంది వార్డు అభ్యర్థులు పోటీ పడనున్నారు. మొదటి విడతలో 56,19, 430 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లు తమ వెంట ఆధార్, పాన్, పట్టాదార్ పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు ఇలా మొత్తంగా 18 రకాలలో ఏదైన ఒక గుర్తింపు కార్డ్‌ను చూపించి ఓటు వేయవచ్చని ఎన్నికల కమిషన్ సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మొదటి విడత ఎన్నికలను హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి ప్రతి పోలింగ్ స్టేషన్ పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

**ఎన్నికలకు 45,086 బ్యాలెట్ బాక్సులు..**
**కోడ్ ఉల్లంఘన కేసులు పరిశీలిస్తాం: రాణికుముదిని**

గ్రామ సర్పంచ్ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగి ంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. మొదటి దశ ఎన్నికలకు 45,086 బ్యాలెట్ బాక్స్ లు వినియోగిస్తున్నామని వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రధాని మోదీ మాన్‌కిబాత్, అలాగే రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు నిర్వహించేందుకు అనుమతి కోరారని వివరించారు. ఎన్నికల ఉల్లంఘనలపైన రెండు కమిటీలను ఏర్పాటు చేశామని, సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారనే ఫిర్యాదును కూడా ఈ కమిటీనే పరిశీలిస్తుందని వివరించారు. కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగానే తాము చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏకగ్రీవ ఎన్నికలపైన ఎవరైనా ఫిర్యాదు చేస్తే దానికి సంబంధించిన ఆధారాలను, ఇతర అంశాలను కూడా కమిటీలు పరిశీలించి తమకు నివేదిక సమర్పిస్తారని, ఇందులో ఉల్లంఘనలు జరిగినట్టు తేలితే ఏకగ్రీవ ఎన్నిక రద్దు అవుతుందని రాణికుమిదిని వెల్లడించారు. తొలి విడతలో 396, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని వివరించారు. ఏకగ్రీవ ఎన్నిక జరిగిన గ్రామాల్లో ఆయా అభ్యర్థుల నుంచి ధృవీకరణ పత్రాలను కోరుతున్నామని, నియమ నిబంధనలకు లోబడే పరిశీలిస్తున్నామని వివరించారు. ఏకగ్రీవంగా, నోటాను కూడా అభ్యర్థిగా పరిగణలోకి తీసుకోవాలనే అంశంపైన సుప్రీం కోర్ట్‌లో కేసు విచారణలో ఉన్నదన్నారు.

**రూ.8.2 కోట్లను సీజ్ చేశాం: మహేశ్ భగవత్**

అదనపు డిజిపి మహేశ్ భగవత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా చేపట్టిన తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.8.2 కోట్లను సీజ్ చేశామన్నారు. రూ.2.3 కోట్ల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకునారు. ఎన్నికలలో 50వేల మంది. సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లాటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని వివరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీ చర్యలు తీసుకున్నామని వివరించారు.

## వాళ్లే చేశారు
(మొదటి పేజీ తరువాయి)

చొరబాటుదారులను ఓటర్ల జాబితాలో కొనసాగించాలన్నదే వారి ఉద్దేశమని ఆరోపించారు. ప్రతిపక్షాల ఎంపీలు సభ నుండి వాకౌట్ చేసిన తర్వాత కూడా అమిత్ షా మాట్లాడుతూ, ఎన్నోసార్లు ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయని, అందువల్ల దీనిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నా రు. కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం మాత్రం దేశంలోకి అక్రమంగా వచ్చే చొరబాటుదారులను గుర్తించడం, వారిని ఓటర్ల జాబితాల నుండి తొలగించడం, ఏరిపారేయడం, వారి స్వదేశాలకు తరలించడం వంటి చర్యలను పట్టువదలకుండా కొనసాగిస్తుందని అమిత్ షా ఉద్ఘాటించారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం చొరబాటుదారుల జోలికి వెళ్ళకుండా వారిని ఓటర్ల జాబితాలో కొనసాగించాలని కోరుకుంటున్నాయని, వారందరినీ మళ్ళీ వెనక్కు తీసుకువచ్చి ఓటర్ల జాబితాలలో చేర్చాలని కోరుకుంటున్నాయని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీ కూడా ఓట్ చోరీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ,‘‘స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానమంత్రి పదవి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు 28 మంది మద్దతు ఇవ్వగా, జవహర్‌లాల్ నెహ్రూకు ఇద్దరే మద్దతు ఇచ్చారని, ఐనాగానీ నెహ్రూ ప్రధానమంత్రి పదవి స్వీకరించారని, ఇది ఓట్ చోరీ తప్ప మరొకటి కాదని అన్నారు. ఇక రెండోసారి ఇందిరాగాంధీ కూడా ఓట్‌చోరీకి పాల్పడ్డారని, న్యాయస్థానం ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకున్న తర్వాత కూడా ఇందిరాగాంధీ తన అధికారులకు తిరుగులేకుండా ఉండేందుకు స్వీయ రక్షణలు ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. సోనియాగాంధీ కూడా దేశ పౌరసత్వం పొందడం కోసం కోర్టులను ఆశ్రయించారని విమర్శించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రభుత్వాలకు 'విత్తన చట్టం ముసాయిదా-2025' సవరణ నివేదిక అందజేస్తాం

ఎం.కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రప్రభుతత్వం విడుదల చేసిన 'విత్తన చట్టం ముసాయిదా 2025'లో సవరణలు చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. విత్తన చట్టం ముసాయిదాపై రైతు కమిషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా సమీక్ష, సమావేశాలు నిర్వహించామని గుర్తు చేశారు. వ్యవసాయ రంగ నిపుణుల నుండి స్వచ్ఛందంగా వచ్చిన సూచనలను పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పలు సవరణలతో కూడిన ఒక నివేదికను రూపొందించినట్లు కోదండరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తన చట్ట సవరణల నివేదికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతున్నామని వివరించారు. కేంద్రం తీసుకురాబోతున్న విత్తన చట్టంలో చాలా లొసుగులు ఉన్నాయని, రైతుల ప్రయోజనం కోసం చట్టం ఉండేలా చూడాలని సూచించారు. మల్టీనేషనల్ విత్తన కంపెనీల కోసం చట్టాలు రూపొందించాల్సిన అవసరం లేదని కోదండరెడ్డి పేర్కొన్నారు.

# విత్తన చట్టంలో మార్పులు చేయండి

'కేంద్ర విత్తన చట్టం ముసాయిదా -2025' సవరణలు చేస్తూ వ్యవసాయ శాఖ చేసిన సిఫార్సులు ఇవే..

| కేంద్రం | తెలంగాణ వ్యవసాయ శాఖ |
|---|---|
| సెక్షన్ 13లోని నిబంధన ప్రకారం వ్యవసాయ విత్తనాన్ని రైతులకు విక్రయించేందుకు ముందుగా విత్తన విడుదల చేసే ముందే కేంద్ర విత్తన కమిటీతో ముందస్తు నమోదు తప్పనిసరి. | రాష్ట్ర విత్తన కమిటీకి, రాష్ట్రానికి ప్రత్యేకమైన రకాలను నమోదు చేయడానికి అధికారం ఇవ్వాలి. రాష్ట్రాలకు, తమ రైతులకు విత్తన రకాల అనుకూలత, అవసరాలు బాగా లుసు. |
| సెక్షన్17(3)లోని నిబంధన ప్రకారం ఉత్పత్తిదారు లేదా ప్రాసెసింగ్ ప్లాంట్ సంబంధిత రాష్ట్ర ప్రభుత్వంలో నమోదు చేసుకోకపోతే ఉత్పత్తిదారు, విత్తన ఉత్పత్తి సంస్థ లేదా విత్తన ప్రాసెసింగ్ ప్లాంట్ విత్తనాన్ని విక్రయించకూడదు లేదా పంపిణీ చేయకూడదు. | ప్రతి విత్తన ఉత్పత్తి సంస్థ నిర్వాహకులు వ్యవసాయంలో డిగ్రీ లేదా డిప్లొమా కనీస విద్యార్హతను కలిగి ఉండాలి లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో కనీసం మూడు నెలల సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసి ఉండాలి. |
| సెక్షన్18(1)లోని నిబంధన ప్రకారం విత్తన డీలర్లు, పంపిణీదారులు విత్తన అమ్మకాలను ప్రారంభించే ముందు రాష్ట్ర ప్రభుత్వంతో నమోదు చేసుకోవాలి. | విత్తన డీలర్లు, పంపిణీదారులు రిజిస్ట్రేషన్‌కు అర్హత సాధించేందుకు వ్యవసాయంలో డిగ్రీ లేదా డిప్లొమా లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ నుండి విత్తనోత్పత్తిలో సర్టిఫికేట్ కోర్సు కనీస విద్యా అర్హతను కూడా కలిగి ఉండాలి. |
| సెక్షన్21(1డి)లో నిబంధన ప్రకారం ఏదైనా నమోదిత రకం విత్తనాన్ని అమ్మకానికి పెట్టినప్పుడు కేంద్ర కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఉత్పత్తిదారుడు విత్తన ప్రమాణాలను స్పష్టంగా ప్రదర్శించాలి.కే ంద్ర ప్రభుత్వ పోర్టల్ ద్వారా జారీ చేయబడిన క్యూ ఆర్ కోడ్‌ను చేర్చాలి. ఈ కోడ్ విత్తనం అధీకృత ధృవీకరణ సంస్థ ద్వారా ధృవీకరించబడిందా? లేదా? ఉత్పత్తిదారునితో స్వీయ ధృవీకరించబడిందా? అనేది సమాచారాన్ని అందిస్తుంది. | ప్రస్తుత ముసాయిదా చట్టం ప్రకారం విత్తన ఉత్పత్తి సంస్థల స్వీయధృవీకరణ అనుమతించబడుతుంది. స్వీయధృవీకరణ కారణంగా రైతుల పొలాల్లో విత్తన వైఫల్యం గురించి అనేక ఫిర్యాదులు తలెత్తాయి. అందుకే మార్కెటింగ్ కోసం ఉద్దేశించిన అన్ని విత్తనాలు గుర్తింపు పొందిన ధృవీకరణ సంస్థ ద్వారా ధృవీకరించాలి. స్వీయధృవీకరణను అనుమతించకూడదు. |
| సెక్షన్ 22లోని నిబంధన మేరకు అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం విత్తనాల ధరలను నియంత్రించవచ్చు. | తెలంగాణ వ్యవసాయ శాఖ: రైతుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తన ధరలను నియంత్రించే అధికారం కల్పించాలి. రాష్ట్ర విత్తన కమిటీ విత్తన ధరలను సమీక్షించి, హేతుబద్ధమైన ధరల పరిమితిని సిఫార్సు చేయడానికి అనుమతించాలి. |
| సెక్షన్ 33లో నిబంధన ప్రకారం విత్తనం ఎగుమతి చేసే దేశంలో నిర్వహించబడే వివిధ ప్రదేశాల పరీక్షల ఆధారంగా విత్తనాల దిగుమతికి అనుమతి ఉంది. | తెలంగాణ వ్యవసాయ శాఖ: స్థానిక అనుకూలతను పరీక్షించకపోతే దిగుమతి చేసుకున్న విత్తనాలు భారతీయ వ్యవసాయవాతావరణ పరిస్థితులలో వైఫల్యం చెందవచ్చు. తద్వారా పంట నష్టాలు జరిగే అవకాశం ఉంది. అందుకే దిగుమతి చేసుకున్న విత్తనాలన్నింటికీ కనీసం రెండు సంవత్సరాలు ఐసిఎఆర్/ఎస్ఎయు కేంద్రాలలో బహుళస్థాన పరీక్షలను తప్పనిసరి చేయడం చాలా అవసరం. |
| సెక్షన్34లోని నిబంధన మేరకు రిజిస్ట్రేషన్ లేకుండా విత్తనాల అమ్మకం, నకిలీ లేదా నాసిరకం విత్తనాల సరఫరా, లేదా సరైన లేబులింగ్ లేకుండా విత్తనాలను విక్రయిస్తే రూ. 50,000 నుండి 30 లక్షల వరకు జరిమానాతో పాటు మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష. | ఉత్పత్తి సంస్థలు చేసిన నేరాలకు పైన పేర్కొన్న జరిమానాలు,శిక్షతో పాటు, విత్తన ఉత్పత్తిదారు లేదా కంపెనీని కనీసం ఐదు సంవత్సరాల పాటు విత్తన ఉత్పత్తి , అమ్మకాల నుండి నిషేధించాలి. |

### ముసాయిదా సవరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతులకు విత్తనాన్ని విక్రయించేందుకు ముందుగా కేంద్ర విత్తన కమిటీలో ముందస్తు నమోదు చే సుకోవాలని 'కేంద్రవిత్తన చట్టం ముసాయిదా2025'లో పొందుపర్చిన సెక్షన్ 13లోని నిబంధనను సవరించాలని, ఈ స్థానంలో రాష్ట్ర విత్తన కమిటీకి, రాష్ట్రానికి ప్రత్యేకమైన రకాలను నమోదు చేసేందుకు అధికారం ఇ వ్వాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ సిఫారసు చేసింది. రైతుల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలకు విత్తన ధరలను నియంత్రించే అధికారాన్ని కల్పించాలని, రాష్ట్ర విత్తన కమిటీ విత్తన ధరలను సమీక్షించి, హేతుబద్ధమైన ధరల పరిమితిని సిఫార్సు చేయడానికి అనుమ తి ఇవ్వాలని కోరింది. 'కేంద్ర విత్తన చట్టం ముసాయిదా2025' అభ్యంతరాల గడువు బుధవారంతో ముగిసిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సిపార్సులతో కూడిన తుది నివేదికను సిద్ధం చేసింది. నకిలీ లేదా నాణ్యత లేని విత్తనాల వల్ల నష్టపోయే రైతులకు చట్టబద్ధమైన, కాలపరిమితితో కూడిన పరిహార విధానా న్ని ఏర్పాటు చేసేందుకు బిల్లులో ఒక ప్రత్యేక విభాగాన్నిఏర్పా టు చేయాలని, సాధారణ పరిస్థితుల్లో రైతు పొందగలిగే అత్యధిక దిగుబడి ఆధారంగా పరిహారం లె క్కించాలని సూచించింది. రైతులు ఫిర్యాదు చేసిన 60 రోజులలోపు క్లెయిమ్‌లను ప్రాసెస్ చేసి, వాటిని పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ సిఫారసు చేసింది.

#### ముసాయిదాలో పొందుపర్చాల్సిన ప్రతిపాదనలు ఇవే

- విత్తనోత్పత్తి చేసే రైతులను రక్షించేందుకు ముసాయిదా విత్తన బిల్లులో ఒక ప్రత్యేక విభాగాన్ని చేర్చాలి.
- విత్తనాలను సరసమైన ధరలలో రైతులకు అందించేందుకు విత్తన ధరల నియంత్రణ తప్పనిసరిగా చట్టబద్ధమైన నిబంధనగా ఉండాలి.
- సాంప్రదాయ విత్తనాలు , వారసత్వ విత్తన రకాలను లేదా వాటి డిజిటల్ సీక్వెన్స్ ఇన్ఫర్మేషన్)ను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు ఉండాలి.
- విత్తన కంపెనీలకు లైసెన్స్ లు జారీ చేసేందుకు ప్రత్యేకమైన మార్గదర్శకాలు రూపొందించాలి. అందులో లైసెన్సింగ్ కమిటీ కూర్పు, పరిశోధన అవసరాలు, విద్యార్హతలు, రకాల నమోదు కోసం బఫర్ వ్యవధి వంటి అంశాలను జోడించాలి. ముసాయిదాలో బయో సేఫ్టీ వారసత్వ విత్తనాలకు డిజిటల్ సీక్వెన్స్ ఇన్ఫర్మేషన్ చేర్చాలి.

# తెలంగాణ యువతకు తైవాన్‌లో ఉద్యోగాలు

- 20 ఇంజనీర్ కళాశాల విద్యార్థులకు తొలి దశ ఇంటర్వ్యూలు
- నైపుణ్యాలు పెంచుకుంటేనే భవిష్యత్తు..
- యువతకు ఉద్బోధన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భవిష్యత్ అవసరాలకు తగిన నైపుణ్యాలు పెంచుకోగలిగితేనే యువత తాము కోరుకున్న ఉద్యోగాలను పొందగలుగుతారని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. కాలానుగుణంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించిన వారే తమ వృత్తులో నిలదొక్కుకోగలుతారని అన్నారు. టీవర్క్స్ ప్రాంగణంలో బుధవారం 'పాత్ వే టు తైవాన్' పేరుతో జరిగిన తైవాన్‌లో ఉద్యోగాల కల్పనకు జరిగిన మొదటి రౌండ్ ఇంటర్వ్యూల కార్యక్రమాన్ని శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీవర్క్స్ సిఇఒ జోగిందర్ తనికెళ్ల, తైవాన్ ప్రభుత్వ సంస్థ టేలెంట్ తైవాన్ ప్రతినిధి ఈడెన్ లియెన్‌లు మంత్రి సమక్షంలో ఉద్యోగాల కల్పన, ఉన్నత విద్యా కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన ఒప్పందం( ఎంఒయు)పై సంతకాలు చేసారు. తైవాన్‌కు చెందిన రియల్ టెక్, లాజిటెక్, మీడియాటెక్, విస్ట్రాన్, హిమాక్స్, కౌపాంగ్, ఐటిఆర్ఐ దీని కోసం ముందుకొచ్చాయి. ఈ ప్రోగ్రాం ద్వారా ఇక్కడి విద్యార్థులను తైవాన్ కంపెనీలు మొదటి రౌండ్ ప్రాథమిక ఎంపిక ప్రక్రియ పూర్తి చేసుకుని తదుపరి దశలో తైవాన్‌ను ఆహ్వానిస్తాయి. మొదటి విడతగా 20 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు తొలిదశ ఇంటర్వ్యూల కోసం హాజరయ్యారు. తైవాన్ కంపెనీలు ప్రతిభావంతుల వేటలో దేశం మొత్తం మీద తెలంగాణాను ఎంపిక చేసుకున్నందుకు శ్రీధర్ బాబు ధన్యవాదాలు తెలిపారు. తొలిదశ ఇంటర్వ్యూలు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆరు నెలల పాటు ఇక్కడ (చైనీస్) మాండరిన్ భాషను నేర్చుకోవాల్సి ఉంటుంది. ఆతర్వాత మాండరిన్ భాష, సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. ఎంపికైన విద్యార్థులకు తైవాన్‌లో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని ఆయన తెలిపారు. దీని కోసం 8 తైవాన్ కంపెనీలు ఇక్కడికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్ చల్లవర్ తమ పరివర్తన్ ఫండ్ కింద టీ వర్క్స్ ఫౌండేషన్‌కు రూ.1.5 కోట్ల నిధులను సమకూర్చనున్నట్టు శ్రీధర్ బాబు సమక్షంలో ప్రకటించారు. దీనిని పర్యావరణ అనుకూల విధానాల్లో వస్తూత్పత్తి, ఆవిష్కరణలు చేసే అంకుర సంస్థలకు సహాయనిధిగా అందజేస్తారు. కేవలం 2.2 కోట్ల జనాభా ఉన్న తైవాన్ చిప్‌ల తయారీ, టెక్నాలజీ రంగాల్లో ప్రపంచమంతా ఆధారపడే స్థాయికి ఎదిగింది. భవిష్యత్తు టెక్నాలజీల గురించి తైవాన్ ముందు చూపు, శ్రమించే తత్వాన్ని తెలంగాణా యువత ఆదర్శంగా తీసుకోవాలని శ్రీధర్ బాబు సూచించారు. కార్యక్రమంలో తైవానీస్ యూనివర్సిటీలు తమ విద్యాసంస్థల ప్రాముఖ్యతను వివరించే స్టాళ్లను ఏర్పాటు చేసాయి. 12వ తరగతి, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులు తమ యూనివర్సిటీల్లో చేరితే వారికి ఉద్యోగావకాశాలు పెరుగుతాయని యూనివర్సిటీల ప్రతినిధులు వి వరించారు. కార్యక్రమంలో టీ హబ్ సీనియర్ వైస్ ప్రె సిడెంట్ లెఫ్టినెంట్ కల్నల్ టి.ఎం. ప్రవీణ్ కుమార్, తైవాన్ ప్రభుత్వ సంస్థ టేలెంట్ తైవాన్ సిఇఒ జోనాథన్ లియావో, ప్రతినిధులు టెర్రాలిన్, ఇడెన్ లియెన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూనే పారిశ్రామిక అభివృద్ధిని సమన్వయం చేసుకోవాలి


**సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ ప్రాంతాలకు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూనే ఇండస్ట్రియల్ అభివృద్ధిని సమన్వయం చేసుకోవాలని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, క్యాబినెట్ చురుకుగా పనిచేసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో దాదాపు రూ. 6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తుందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల పెట్టుబడికి మంచి వాతావరణం కలిగిన భూములు అందుబాటులో ఉంటాయని, అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా పారిశ్రామిక అభివృద్ధి చేపడితే రానున్న రోజుల్లో పరిశ్రమలు పెరుగుతాయని సూచించారు. భూములకు రెవెన్యూ శాఖ అనుమతులు ఇచ్చే క్రమంలో అవకతవకలు జరగకుండా అమలు చేయాలని నారాయణ సూచించారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సక్సెస్‌తో జోష్

- నాడు దావోస్‌లో రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు...
- నేడు తెలంగాణ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్లు పెట్టుబడుల రికార్డులను సృష్టించిన సమ్మిట్ ...
- లక్షలాది ఉద్యోగాలకు హామీ
- ప్రభుత్వ వర్గాల్లో హర్షం

ఇ. చంద్రశేఖర్



దావోస్‌లో ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సును తలదన్నే రీతిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడుల ఆకర్షణలో రికార్డులను సృష్టించింది. గత ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర బృందం దావోస్ ఆర్థిక సదస్సులో పాల్గొని ఆర్థిక, పారిశ్రామిక సంస్థల నుంచి సుమారు రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించి ఒప్పందాలు చేసుకోగా, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామిక వేత్తల భాగస్వామ్యంతో అసాధారణమైన రీతిలో దాదాపు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు చేసుకోవడం, తద్వారా రాష్ట్రంలోని యువతకు దాదాపు 1.40 లక్షల ఉగ్యోగావకాశాలు లభించనుండడం గమనార్హం. సదస్సు రాష్ట్ర భవిష్యత్తుపై కొత్త ఆశలను రేకెత్తించింది. ఇది నిజంగా ఆచరణ సాధ్యమైతే తెలంగాణ చరిత్రలోనే సరికొత్త రికార్డు అవుతుందని చెప్పవచ్చు. మరో వైపు తెలంగాణ ప్రభుత్వం దాదాపు 30 వేల ఎకరాలలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన 'హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ'ని షోకేస్ చేయడంలో సదస్సు సఫలీకృతమైంది. తెలంగాణను ప్రపంచ పటంలో నిలిపే ఉద్దేశ్యంతో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా రెండు రోజుల పాటు 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' అట్టహాసంగా జరిగింది. సమ్మిట్‌లో 44 దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు, వివిధ దేశాల రాయబారులు, ప్రపంచ బ్యాంక్, ఎడిబి వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు సహా సుమారు 1,600 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి, పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెర్రీ, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, కాలిఫోర్నియా ఎకనమిక్ ప్రొఫెసర్ కార్తిక్ మురళీధరన్, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి వంటి ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు. సదస్సు చివరి రోజు 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'తెలంగాణ రైజింగ్2047' విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సమ్మిట్‌లో మొదటి రోజు రూ.2.43 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు, అదే తరహాలో రెండవ రోజు దాదాపు రూ.3.3 లక్షల లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు మొత్తం రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు, ఎంఒయు జరిగాయి. పదుల సంఖ్యలో జరిగిన ఈ పె ట్టుబడుల ఒప్పందాలలో ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్ ఒక్కరే రూ.1 లక్ష కోట్ల (సుమారు 10 బిలియన్ డాలర్ల ) పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం సమ్మిట్‌లో అందరికీ ఆసక్తిని కలిగించింది.

**తెలంగాణపై అంతర్జాతీయ పెట్టుబడిదారుల విశ్వాసం**

సమ్మిట్‌లో మొత్తం 27 ప్యానెల్ చర్చా గోష్టులు జరిగాయి. వీటిలో ముఖ్యంగా తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హ బ్‌గా మార్చే లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ, ట్రాన్సిషన్ , పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ మొబిలిటీ 2047 కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, నాన్‌ఎమిషన్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, సరిహద్దు సాంకేతికతల అవకాశాల కోసం టెక్ తెలంగాణ 2047, వినోదం కోసం గ్లోబల్ ఎంటర్‌టెయిన్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్, కొత్త ఫిల్మ్ పాలసీ, ఏరోస్పేస్, డిఫెన్స్, కార్గో, ఎంఆర్‌ఓ, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల విస్తరణ, డేటా సెంటర్లు, పవర్, లైఫ్ సైన్సెస్ తదితర అంశాలపై చర్చలు జరిగాయి. ప్రపంచ బ్యాం క్, డబ్ల్యుహెచ్‌ఓ, ఏషియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి), వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో పా టు, అగ్రరాజ్యాల పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా అమెరికా నుండి 46 మంది హాజరుకావడం తెలంగాణపై అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఉన్న విశ్వాసాన్ని ఎత్తిచూపింది.

**ఆర్థిక వ్యవస్థ బలోపేతం... ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు పునాది**

ఈ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు గట్టి పునాది వేస్తుందని, తద్వారా రాష్ట్రాన్ని ప్రపంచపటంలో అగ్రగామిగా నిలుపుతాయని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో కుదిరిన పెట్టుబడుల ఒప్పందాలు రాష్ట్రంలోని విద్య, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాలకు గొప్ప ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారవర్గాల అంచనా వేస్తున్నాయి. 'ఇది కేవలం ఒక సమ్మిట్ కాదు. రాష్ట్ర భవిష్యత్తును రూపొందించే మైలురాయి. సమ్మిట్ తెలంగాణకు 'గేమ్ చేంజర్'. పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని, వ్యవస్థను బలోపేతం చేస్తాయి. టూరిజం, ఫార్మా, ఐటి, రెన్యూవబుల్ ఎనర్జీలో భారీ గ్రోత్ జరుగుతుంది' అని ప్రభుత్వ అధికార వర్గాలు ప్రకటిస్తున్నాయి. అయితే రాష్ట్రానికి ఇంత పెద్ద స్థాయిలో పెట్టుబడులు వచ్చినప్పుడు వాటికి అనుగుణంగా విద్యుత్, రహదారులు, నీటి సరఫరా తదితర వంటి మౌలిక సదుపాయాలను వేగంగా కల్పించడం రాష్ట్ర ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారనుందని ఆర్థిక, పారిశ్రామిక వర్గాల పరిశీలకులు భావిస్తున్నారు. ప్రభుత్వం అత్యంత భారీ ఖర్చుతో నిర్వహించిన ఈ అంతర్జాతీయ సమ్మిట్ ద్వారా తక్షణ, ప్రత్యక్ష ప్రయోజనాలు సామాన్య ప్రజలకు ఎంతవరకు అందుతాయనే విషయంపై కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడుల ఎంఓయులను ఎండిఎ (మాస్టర్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు) లుగా మార్చి, పెట్టుబడులను త్వరితగతిన కార్యరూపం దాల్చేలా చేయడం ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు.

# కాలుష్యరహిత నగరం కోసమే ఎలక్ట్రిక్ బస్సులు

రాణిగంజ్‌లో 65 బస్సులను జెండా ఊపి ప్రారంభించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరాన్ని కాలుష పర్యావరణ హిత మెట్రో ఎలక్ట్రిక్ బస్సులు బుధవారం హైదరాబాద్ రోడ్లపై పరుగులు పెట్టాయి. ఇవి ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణలో నడిచే 65 బస్సులను రాణిగంజ్ డిపోలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఆ తరువాత మంత్రి పొన్నం ప్రభాకర్ రాణిగంజ్ డిపో నుంచి తార్నాకలోని ఆర్‌టిసి ఆసుపత్రి వరకు బస్సులో ప్రయాణించారు. ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వై నాగిరెడ్డి హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, ఈవీ ట్రాన్స్ సిఈఓ సందీప్ రైజాడ , సెంట్రల్ జోన్ డిసిపి శిల్పవల్లి, నార్త్ జోన్ ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ పి.వి. మునిశేఖర్, సిహెచ్ వెంకన్న, ఎం.రాజశేఖర్, కార్పొరేటర్ సుచిత్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ తరుపున ఆర్‌టిసి రాణిగంజ్ డిపో నుండి 65 బస్సులు ప్రారంభించామన్నారు. ఢిల్లీలో రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యంతో ప్రజలు జీవించలేని పరిస్థితి, ఇక్కడ అలాంటి పరిస్థితి రాకుండా రవాణా శాఖ ఈవీ పాలసీ , స్క్రాప్ పాలసీ తీసుకొచ్చిందని తెలిపారు.. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు వివిధ పుణ్యక్షేత్రాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడుపుతున్నామని చెప్పారు. ఆర్‌టిసి ఎండి వై . నాగిరెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో వచ్చే రెండేళ్లలో 2800ల ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని తెలిపారు. ప్రతి బస్ ఒక రోజు ఒక టన్ కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గిస్తుంది అన్నారు. ఈవీ ట్రాన్స్ సిఇఒ సందీప్ రైజాదా మాట్లాడుతూ బుధవారం ప్రారంభించిన ఈ బస్సులతో దేశవ్యాప్తంగా మా బస్సులు నడిచే డిపోల సంఖ్య 69కి చేరిందని తెలిపారు.

# తెలంగాణ భవిష్యత్‌కు గ్లోబల్ సమ్మిట్ సరికొత్త దశ

అన్ని రంగాల హబ్‌గా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

సిఎల్‌పి 'చిట్‌చాట్'లో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్ఎల్‌సి మహేష్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ భవిష్యత్తుకు గ్లోబల్ సమ్మిట్ సరికొత్త దిశ అని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, సమ్మిట్‌తో రాష్ట్రానికి దేశ, విదేశీ కంపెనీల నుంచి పెట్టుబడులు వెల్లువెత్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి విజన్‌కు, దూరదృష్టికి గ్లోబల్ సమ్మిట్ నిదర్శనమని పేర్కొన్నారు. మంచి మెజారిటితో మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. భవిష్యత్తులో కాంగ్రెస్ నాయకత్వంలో తెలంగాణకు బిసి అభ్యర్థి ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. టిపిసిసి అధ్యక్ష పదవితో సంతృప్తిగా ఉన్నానని, సిఎంకు తనకు గ్యాప్ అసత్య ప్రచారమని తొసిపుచ్చారు. సిఎల్‌పి కార్యాలయంలో బుధవారం తనను కలిసిన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ దావోస్ వల్ల రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఫోర్త్ సిటీ నిర్మాణం చారిత్రాత్మకమని, ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ రెండు ఒకటేనని పేర్కొన్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూస్తుందని, అన్ని రంగాల హబ్‌గా ఫ్యూచర్ సిటీ నిర్మాణం ఉంటుందని తెలిపారు. గత పదేళ్ళలో బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే చేసిందని అన్నారు.

**బిఆర్‌ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం..**

బిఆర్‌ఎస్ పదేళ్లలో ఆర్థిక విధ్వంసం సృష్టించిందని, అభివృద్ధిని ఓర్వలేకనే హరీష్‌రావు విమర్శలు చేస్తున్నారని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. భవిష్యత్తులో బిఆర్‌ఎస్ అధికారంలోకి రావడం కలే అని, గతం తప్ప బిఆర్‌ఎస్‌కు భవిష్యత్తు లేదని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహాలు ఎవరు తీయలేరని, అధికారంలో ఉండి వాళ్లు పెట్టలేకపోయారని, అందుకే తాము పెట్టామని అన్నారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది కాబట్టి తెలంగాణకు నిజమైన తల్లి సోనియా గాంధీ అని చెప్పారు. లావాదేవీల్లో తేడాల వల్లే కవిత విమర్శలు చేస్తుందని, కవిత వలన బిఆర్‌ఎస్ నేతల లూటీలు బయటకు వస్తున్నాయన్నారు. కవిత చేసిన వ్యాఖ్యలపై సీఎం విచారణ జరపాలని కోరారు.

**ఈ నెలాఖరుకు కార్పొరేషన్ చైర్మన్లు, మిగిలిన చైర్మన్లు, బోర్డు పదవుల భర్తీ**

ఈ నెలాఖరుకు కార్పొరేషన్ చైర్మన్లు, మిగిలిన చైర్మన్లు , బోర్డు పదవులు, నూతన పిసిసి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రచార కమిటీలు భర్తీ చేస్తామని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా పోటీపై పార్టీ అధిష్టానానిదే తుది నిర్ణయామని అన్నారు. గ్రామ సర్పంచ్ ఏకగ్రీవ ఎన్నిక సాధారణ విషయం కాదని, స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. తన ప్రాంత అభివృద్ధి కోసం గతంలో 50 ఎకరాలు భూదానం చేశానని మహేష్‌కుమార్ గౌడ్ గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుగుతున్నాయని, ఇవిఎం కాంగ్రెస్ హయంలో ప్రవేశ పెట్టినప్పటికీ, ట్యాంపరింగ్ మాత్రం బిజెపి ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
GHMC ఆఫీస్ కాంప్లెక్స్, 4వ ఫ్లోర్, టాంక్ బండ్, హైదరాబాద్
ఆసక్తి వ్యక్తీకరణ (EOI) మరియు టెండర్ నోటీసు
NIT No. 3/SE/QCC/GHMC/EOI/2025-26 తేదీ 10-12-2025
విషయం : CRMP ఫేజ్ II రోడ్ల కోసం NSV, FWD & GPR ఉపయోగించి కాలినడకబాట పునరావాస (పేవ్‌మెంట్ రిహాబిలిటేషన్) అధ్యయనాలు మరియు నిర్మాణ మూల్యాంకనం కోసం కమిషనర్, GHMC, EOI/టెండర్ సూపరింటెండింగ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, GHMC తరపున ఆహ్వానిస్తున్నది.ఆసక్తి కలిగి ఉన్న ఏజెన్సీలు www.eprocurement.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న డాక్యుమెంట్ల రూపంలో సూచించిన ఫార్మాట్లలో పూర్తి వివరాలు సమర్పించవచ్చు. పైన పేర్కొన్న అన్ని ఇతర సమాచారంతో కూడిన పూర్తి డాక్యుమెంట్ ఫారమ్‌ను 18.12.2025న ఉదయం 11గంటల వరకు లేదా ఈ సమయంలోపు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక బిడ్‌లు అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు తెరవబడతాయి. ఏమైనా ప్రశ్నలు ఉన్నట్లయితే O/o సూపరింటెండింగ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, GHMC, 4వ ఫ్లోర్, హెడ్ ఆఫీస్, ట్యాంక్ బండ్, హైదరాబాద్‌ను సంప్రదించవచ్చు. ఎలాంటి మరింత సమాచారాన్ని అయినా సూపరింటెండింగ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, 4వ ఫ్లోర్, GHMC కాంప్లెక్స్, GHMC కార్యాలయం పనివేళల సమయంలో (7995009080) మొబైల్ ఫోన్‌కాల్ నుండి పొందవచ్చు.
Sd/-సూపరింటెండింగ్ ఇంజనీర్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, GHMC.
DIPR R.O.No.11908-PP/CL/ADVT/1/2025-26 Date: 10-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## 10వ తరగతి పరీక్షల షెడ్యూల్ పూర్తిగా అశాస్త్రీయం : కసిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యా శాఖ విడుదల చేసిన 10వ తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ పూర్తిగా అశాస్త్రీయంగా ఉందని, ఏడు పరీక్షల నిర్వహణను నెల రోజుల పాటు నిర్వహించడం సరికాదని, ఆ షెడ్యూల్ వెంటనే మార్చాలని ఎవిఎల్‌సి రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్టలక్ష్మణ్ జీ అన్నారు. ఒక్కో పరీక్షకు మధ్య రెండు రోజుల గడువు ఉంటే సరిపోతుందని, కానీ ఏడు పరీక్షలకు నెల రోజుల పరీక్షల షెడ్యూల్ విడుదల చేయడం వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతారని వారు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజులపాటు పరీక్షల నిర్వహణ అంటే ప్రశ్నాపత్రాల భద్రత, మూల్యాంకన ప్రక్రియపై కూడా ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే పదవ తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను సవరించి మరొక షెడ్యూల్‌ను విడుదల చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ జీ డిమాండ్ చేశారు.

## వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులకు అనుగుణంగా చట్టాలు రూపొందించాలి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ వ్యవస్థకు విత్తనోత్పత్తి కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. విత్తన చట్టం,1966, తదనంతరం ప్రభుత్వం తీసుకొచ్చిన 2004లో, ఆ తర్వాత ,2010 లో, 2019లో నాటి విత్తన బిల్లు ముసాయిదాలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను, హక్కులను పరిరక్షించడంలో ప్రభావవంతమైన చట్టాలు లేకపోవడంతో రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. మారుతున్న పరిస్థితులు, వ్యవసాయ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని కఠిన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తుమ్మల సూచించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విత్తన చట్టం ముసాయిదా2025'పై కేంద్ర ప్రభుత్వానికి పలు సవరణలను సూచిస్తూ సిఫార్సులతో కూడిన నివేదికను రాష్ట్ర వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. 'కేంద్ర విత్తన ముసాయిదా చట్టం 2025' పై డిసెంబర్ 11లోపు (గురువారం) అభ్యంతరాలను తెలియజేయాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. ఇందులో భాగంగానే ఇటీవల రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ రంగ నిపుణులతో జరిగిన చర్చలు, అధికారులతో జరిగిన సమీక్షలు, చర్చల సమయంలో వచ్చిన పలు అభిప్రాయాలను, సూచనలను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ పరిగణలోకి తీసుకుని పలు సిఫార్సులను చేసింది. కేంద్ర గడువు బుధవారంతో ముగియడంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ బి. గోపితోపాటు పలు వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విత్తన చట్టం ముసాయిదా అంశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వపరంగా తుది నివేదిక రూపకల్పనలో చేర్చాల్సిన అంశాలు, చట్టంలోని సవరణలపైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన రైతులు తరచూగా అధికారిక గుర్తింపు లేకపోవడం, లోపభూయిష్ఠ ఒప్పంద నిబంధనలు, సరైన పరిహారం అందకపోవడంతో ముఖ్యమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారని వివరించారు. గత వరుస కాలంలో విత్తనోత్పత్తి సమస్యలతో పాటు, ముఖ్యంగా పత్తి, మిరప, మొక్కజొన్న,కూరగాయలు పండించే రైతులు నకిలీ, నాసిరకం, అనువుగా లేని,అధిక ధర కలిగిన విత్తనాల వ్యాప్తి కారణంగా నష్టాలను చవిచూశారని గుర్తుచేశారు. నాణ్యత లేని హైబ్రిడ్,బిటి విత్తనాల లభ్యత, విత్తనాలు, ఇన్‌పుట్ ఖర్చులు బాగా పెరిగాయని, అలాగే సాగు ఖర్చు గణనీయంగా పెరగడంతో పాటు రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను మరింత తీవ్రతరమయ్యాయని అన్నారు. సాంప్రదాయమైన,స్వదేశీ రకాలు సహా అధిక నాణ్యత గల విత్తనాల సాగు, సంరక్షణలో వేలాది మంది రైతులు భాగస్వాములుగా ఉన్నారని తుమ్మల అన్నారు.

# రెండేళ్లలో రికార్డు స్థాయిలో సిఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సహాయం

### ప్రతి ఏడాదికి రూ.850 కోట్లు సాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్)గత రెండేళ్లలో కొత్త రికార్డులను నెలకొల్పింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సహాయాన్ని అందించడంలో ఈ నిధి మునుపెన్నడూ లేని విధంగా తన సేవలను విస్తరించింది. 2014–2024 మధ్య కాలంలో సిఎంఆర్‌ఎఫ్ ద్వారా సంవత్సరానికి సరాసరి రూ. 450 కోట్లు సాయం అందించగా, ఈ రెండేళ్లలో సుమారుగా సంవత్సరానికి రూ.లు 850 కోట్లు సాయం అందించింది.

### రెండు విధానాల్లో ఆర్థిక సాయం పొందవచ్చు

వైద్య చికిత్స కోసం పేద మధ్య తరగతి ప్రజలు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా రెండు విధానాల్లో ఆర్థిక సహాయం పొందవచ్చు.. ఇందులో లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఒసి) ద్వారా లబ్ధిదారుడు నిర్దిష్ట ప్రభుత్వ ఆసుపత్రులలో (నిమ్స్, ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్, ప్రభుత్వ ఈఎన్‌టి హాస్పిటల్ వంటివి) చికిత్స కోసం చెల్లింపుకు హామీ ఇస్తూ అధికారిక లేఖను అందజేస్తున్నారు. ఈ లేఖలో చూపిన మొత్తం మేరకు రోగి ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేకుండా చికిత్స పొందవచ్చు. అదేవిధంగా రీయింబర్స్‌మెంట్ (చెల్లింపు తర్వాత వాపసు) విధానం ద్వారా వ్యక్తి ఏదైనా ఆసుపత్రిలో (ప్రభుత్వ, ప్రైవేట్ లేదా కార్పొరేట్) చికిత్స పొంది, బిల్లులు చెల్లించిన తర్వాత, ఖర్చు చేసిన మొత్తంలో కొంత భాగాన్ని తిరిగి పొందేందుకు సిఎంఆర్‌ఎఫ్‌కు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం దరఖాస్తును పరిశీలించి, ఆమోదించిన మొత్తానికి చెక్కును జారీ చేస్తుంది. గత ప్రభుత్వం మునుపటి వార్షిక సగటు కంటే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హాయంలో రెట్టింపు నిధులను పంపిణీ చేసి, గణనీయమైన సహాయాన్ని అందించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పౌరులకు అందించే చికిత్సలకు అదనంగా సిఎంఆర్‌ఎఫ్ ద్వారా అదనంగా నిధులను అందిస్తున్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రులపై దృష్టి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి సారించింది. పేదలకు మెరుగైన వైద్యం అందడంతో పాటు ప్రభుత్వ దవాఖానాలు ఆర్థికంగా బలోపేతం చేసుందుకు సిఎంఆర్‌ఎఫ్ ద్వారా చర్యలు తీసుకుంటుంది.పేద, మధ్య తరగతి ప్రజలకు తక్షణమే ప్రత్యేక చికిత్సలందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ ప్రభుత్వ సంస్థలకు తక్షణమే అందిస్తున్నారు. దీంతో ప్రజలు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యాన్ని పొందగలుగుతున్నారు. నిజాం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్): 26,694 కేసులు, క్యాన్సర్‌కు రోగులకు సంబంధించి ఎంఎన్‌జె క్యాన్సర్ హాస్పిటల్‌లో 316 కేసులు, వినికిడి సమస్యలున్న పిల్లల కోసం, శస్త్రచికిత్సలు, పరికరాల అమరికతో సహా ప్రభుత్వ ఇఎన్‌టి హాస్పిటల్‌కు 196 కేసులకు సంబంధించి ఎల్‌ఓసిలను అందజేశారు.

### సహాయ నిధిని పొందే విధానం

సిఆర్‌ఎంపి ఆర్థిక సహాయానికి సంబంధించి గత ప్రభుత్వ హాయంలో దళారుల చేరి చేతి వాటం ప్రదర్శించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతను పెంచడానికి, దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లోకి మార్చింది.దీంతో ఎలాంటి మోసాలకు తావు లేకుండ ఆధార్ వెరిఫికేషన్ జరిపి, చెక్కుల మీద లబ్ధిదారుని పేరుతో పాటు బ్యాంక్ అకౌంట్ నెంబర్‌ను ప్రింట్ చేసి అందజేస్తున్నారు.

### దరఖాస్తు ప్రక్రియ ఇలా

- దరఖాస్తుదారుడు తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్ర నివాసి అయి ఉండాలి.
- సాధారణంగా వార్షిక కుటుంబ ఆదాయం రూ.1.60 లక్షలు ఉండి తెల్ల రేషన్ కార్డ్ ఉన్న వారే అర్హులు.
- అప్లికేషన్లు ఇప్పుడు ప్రధానంగా అధికారిక తెలంగాణ సిఎంఆర్‌ఎఫ్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు..
- స్థానిక ఎంఎల్‌ఎ, లేక ఎంఎల్‌సి , ఎంపిలు వీరిలో ఎవరో ఒక్కరి నుండి సిఫారసు లేఖ తప్పనిసరి.
- ప్రజాప్రతినిధి కార్యాలయం సిఎంఆర్‌ఎఫ్ వెబ్‌సైట్‌లోనే ఆన్లైన్ ఫారమ్ నింపాల్సి ఉంటుంది.
- దరఖాస్తుతో పాటు ఫోటో, ఆధార్ కార్డ్ , తెల్ల రేషన్ కార్డ్ లేక ఆదాయ ధృవీకరణ పత్రం, మొబైల్ నంబర్, ఆసుపత్రి అందించిన (ఎల్ ఒసి కోసం),
- రీయింబర్స్‌మెంట్‌కు కోసం అసలు బిల్లులు ,డిశ్చార్జ్ సమ్మరీ, బ్యాంక్ పాసుబుక్ మొదటి పేజీ.

### రెండేళ్లలో సిఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సహాయం

పంపిణీ చేసిన సహాయం
రూ.1,685.79 కోట్లు – రూ.3,76,373,
లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC)
రూ.533.69 కోట్లు – రూ. 27,421కోట్లు
రీయింబర్స్‌మెంట్ కేసులు
రూ.1,152.10కోట్లు – రూ.3,48,952

# అధునాతన సౌకర్యాలతో ఆర్‌టిసి ఉద్యోగుల పిల్లల స్కూల్ ఏర్పాటుకు కృషి

### విజన్ 2047లో భాగంగా ప్రజా రవాణాను మరింతగా మెరుగుపరచాలి: మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఆర్‌టిసి ఉద్యోగుల పిల్లలు చదువుకోవడానికి అధునాతన సౌకర్యాలతో ప్రత్యేకంగా ఆర్‌టిసి స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వంతో మాట్లాడతానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2047 విజన్‌లో ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రవాణా శాఖ కీలక పాత్ర పోషించాలని, దేశంలో అత్యున్నత సంస్థగా ఆర్‌టిసి ఎదగాలని ఆకాంక్షించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్ భవన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి అధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహాలక్ష్మి పథకం విజయవంతానికి నిరంతరం శ్రమిస్తున్న డ్రైవరు , కండక్టర్లు, శ్రామిక్ ఇతర సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రిగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎండి, ఈడిలు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఆర్‌టిసిని మరింత విస్తృత పర్చాలని, క్షేత్ర స్థాయిలో రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్‌టిసి కొత్త రూట్లను అన్వేషించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపించేలా కార్యాచరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్త రూట్లలో బస్సులు నడిపినప్పుడే విజన్ 2047లో మన లక్ష్యాలకు అనుగుణంగా, ఇప్పుడున్న 28 శాతం ప్రజా రవాణాను 70 శాతానికి పెంచుకోవడానికి సాధ్యం అవుతుందని సూచించారు.

### మహాలక్ష్మి పథకం ద్వారా లాభాల బాటలో ఆర్‌టిసి..

సంస్థ ప్రతినిధిగా ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తున్నానని ఆర్థిక పరమైన అంశాలు కూడా ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గత 10 సంవత్సరాలుగా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసి సంస్థ ఉనికికే ప్రశ్నార్థకంగా మారిందని, ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ద్వారా 90కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన డిపోలు కూడా లాభాల్లోకి వచ్చేలా పని చేయాలని ఆదేశించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే నూతనంగా పెద్దపల్లి, ములుగు జిల్లా ఏటూరు నాగారంలకు కొత్త డిపోలు ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో బస్ స్టేషన్‌ల అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే రెండు సంవత్సరాల్లో నగరంలో 2800 ఈవి బస్సులు నడుస్తున్నాయని, పూర్తి స్థాయిలో కాలుష్యాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ బస్సులు వస్తున్నాయని చెప్పారు. సెర్ప్ మహిళా శక్తి కింద మండల మహిళ సంఘాలకు 152 బస్సులు ఆర్‌టిసిలో ఉండగా, త్వరలోనే 448 బస్సులు మహిళా సమైక్య సంఘాల నుండి రానున్నాయని తెలిపారు. సమీక్షా సమావేశంలో ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, ఈడిలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్‌లో హైదరాబాద్ సర్కిల్ విజయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ టోర్నమెంట్ 2025–26 హైదరాబాద్, యూసుఫ్‌గూడలోని కొట్ల విజయభాస్కర రెడ్డి ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమానికి చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్)పొన్నంబలం మురుగన్, జనరల్ మేనేజర్లు రవికుమార్ వర్మ, సతీష్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియదర్శి పంకజ్, ఎఐఎస్‌బిఐఎస్‌ఎఫ్ జనరల్ సెక్రటరీ కె. చంద్రశేఖర్, ఎస్‌బిఐఒఎ హైదరాబాద్ సర్కిల్ అధ్యక్షులు హెచ్. శంకర్, జనరల్ మేనేజర్ కె. అంజనేయ ప్రసాద్,సిడబ్ల్యుసి సెక్రెటరీ కె.ఎస్. సందిల్య,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం బలం మురుగన్ మాట్లాడుతూ నిజమైన క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. ప్రారంభ మ్యాచ్ హైదరాబాద్ సర్కిల్, కోల్‌కతా సర్కిల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ సర్కిల్ జట్టు విజయం సాధించిందని తెలిపారు.

## విద్యార్థులను ఆకట్టుకున్న గ్లోబల్ సమ్మిట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :**రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను బుధవారం పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు సందర్శించారు. ఈనెల 8,9 తేదీలలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో తమ ఉత్పత్తులను ప్రయివేటు సంస్థలు ప్రదర్శించాయి. నగరంతో పాటు వివిధ జిల్లాల నుండి ప్రత్యేకంగా వచ్చిన ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రాధానంగా ఏరోస్పేస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్ టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీ స్టాళ్లను విద్యార్థులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో బుధవారం నుండి 13 వ తేదీ (శనివారం ) వరకు ప్లీనరీ సెషన్లనిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జరిగిన యూత్ ఎంటర్‌ఫ్యూనర్‌షిప్ అనే అంశంపై జరిగిన రెండు సదస్సులలో దాదాపు మూడు వేల మంది పాల్గొన్నారు. వీరిలో గురుకుల పాఠశాలల నుండి 1000 మంది, లార్డ్స్ కళాశాల నుండి 700 మంది, వివిధ డిగ్రీ కళాశాల నుండి 1200మంది, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులు 500 పాల్గొన్నారని నిర్వాహకులు వెల్లడించారు. ఉదయం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వి హబ్ సిఇఒ విద్యార్థులతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం సదస్సుకు ప్రముఖ సినీ నటుడు రానా దగ్గుబాటి విద్యార్థులతో ముచ్చటించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మనో జాగృతి సంస్థ కౌమార దశలో మానసిక పరిపక్వత అనే అంశంపై వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## ఎస్‌ఎస్‌సి పరీక్ష సమయాన్ని సవరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఎస్‌ఎస్‌సి పరీక్ష సమయాన్ని సవరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియుటిఎస్) అధ్యక్షుడు జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ అన్నారు. ఈమేరకు వారు పాఠశాల విద్యా సంచాలకులు నవీన్ ని కోలస్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న పరీక్షలకు భిన్నంగా ఈ సారి పరీక్షలు మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16,2026 వరకు మొత్తం 33 రోజుల పాటు నిర్వహిస్తున్నారని, తద్వారా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల్లో మానసిక భయాందోళనకు, ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ఏప్రిల్ నెలలో తీవ్ర ఉష్ణోగ్రతలు ఉం డడంతో విద్యార్థులు పరీక్షలు రాయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని, ప్ర శ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రత, మూల్యాంకన ప్రక్రియ, ఫలితాల వెల్లడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు. అందుకే విద్యార్థుల శ్రే యస్సును దృష్టిలో పెట్టుకుని ఎస్‌ఎస్‌సి పరీక్షలను పాత పద్ధతిలోనే నిర్వహించాలని వారు కోరారు.





ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నాయకులు శరద్ పవార్ నివాసంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపి ప్రియాంక గాంధీని మర్యాదపూర్వకంగా కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# పంచాయతీ ఎన్నికలకు బందోబస్తు సిద్ధం

### డిజిపి బి.శివధర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదారాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో గురువారం జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ నగరం మినహా రాష్ట్రవ్యాప్తంగా 3,800కు పైగా గ్రామ పంచాయతీలలోని సుమారు 37,000 వార్డులకు పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షించేందుకు 3,000కు పైగా గ్రామ పంచాయతీలలో వెబ్‌కాస్టింగ్ ద్వారా ప్రత్యక్ష నిఘా ఏర్పాటు చేసినట్లు డిజిపి పేర్కొన్నారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతమైన బందోబస్తు చర్యలు చేపట్టామని డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు సివిల్ పోలీసులు, ఆర్మ్‌డ్ రిజర్వ్, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టిజిఎస్‌పి) బలగాలతో పాటు, ఇతర ప్రభుత్వ శాఖలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పోలీసు సిబ్బందిని సైతం విధుల్లోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. సున్నితత్వం ఆధారంగా అన్ని పోలింగ్ కేంద్రాలను 'క్లిష్టమైన', 'సాధారణ' కేంద్రాలుగా వర్గీకరించి, ఆయా ప్రాంతాల భద్రతకు అనుగుణంగా పోలీసు బలగాలను మోహరించినట్లు డిజిపి వివరించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో, కౌంటింగ్ కేంద్రాల వద్ద కూడా పూర్తి భద్రతను ఏర్పాటు చేశామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఇప్పటి వరకు రూ.8.20 కోట్ల విలువైన నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర ప్రలోభకర వస్తువులను సీజ్ చేసినట్లు డిజిపి వెల్లడించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై మొత్తం 229 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కాగా, 1,053 నాన్‌బెయిలబుల్ వారెంట్లను అమలు చేసినట్లు తెలిపారు. ఎన్నికల భద్రతా నిబంధనల పరిధిలోకి వచ్చే వ్యక్తుల లైసెన్స్ పొందిన అన్ని ఆయుధాలను డిపాజిట్ చేయించినట్లు ఆయన వివరించారు. అక్రమ రవాణాను నియంత్రించేందుకు, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లతో ఉన్న రాష్ట్ర సరిహద్దుల్లో మొత్తం 54 అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. అలాగే, ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా 537 ఫ్లయింగ్ సాక్వడ బృందాలు మరియు 155 స్టాటిక్ నిఘా బృందాలు చురుకుగా పనిచేస్తున్నాయని డిజిపి తన ప్రకటనలో వివరించారు.

### డిజిపిని కలిసిన నూతన మినిస్ట్రీయల్ అసోసియేషన్ కార్యవర్గం



ఉద్యోగుల సంక్షేమం కోసం సమిష్టిగా , సమర్థవంతంగా పనిచేయాలని నూతనంగా ఎన్నికైన డిజిపి కార్యాలయ ఉద్యోగుల మినిస్టీరియల్ స్టాఫ్ కార్యవర్గాన్ని డిజిపి బి.శివధర్‌రెడ్డి సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన మినిస్టీరియల్ స్టాఫ్ అధ్యక్షులు సీనియర్ అసిస్టెంట్ ఆర్.ఉపేందర్‌రెడ్డితో పాటు కార్యవర్గ సభ్యులు బుధవారం డిజిపి శివధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిజిపి వారిని ఉద్దేశించి మాట్లాడుతూ..ఉద్యోగులకు ఏ కష్టనష్టమొచ్చిన నూతన కార్యవర్గ సభ్యులు సమీష్టిగా ఉండి పరిష్కరించుకోవాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఆర్. ఉపేందర్ రెడి,ఉపాధ్యక్షలుగా వైస్ ఎన్. రాజేందర్, ఎం.డి హాఫిసొద్దీన్, కార్యదర్శిగా టి.శివరంజని, జాయింట్ సెక్రటరీ కె .కవిత, బి. శ్యామ్ కుమార్,కోశాధికారిగా కె .సంకీర్త్ రెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శిగా కె .శివకుమార్, పబ్లిసిటీ కార్యదర్శిగా సుధీర్, క్రీడల కార్యదర్శిగా ముఖేష్, సాంస్కృతిక కార్యదర్శి గా పి.సతీష్, ఎగ్జిక్యూటీవ్ సభ్యులుగా పి. వెంకటేష్, ఎ .విక్రమ్ రాజ్, పి. నరేంద్ర కుమార్ లు ఉన్నారు.


## కెకె కమారుడు, కుమార్తెల స్థలాల క్రమబద్ధీకరణ తీరును తప్పుపట్టిన హైకోర్టు

### తప్పును సరిచేయాలని అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/హైదారాబాద్:** మాజీ ఎంపి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కుమారుడు కె.వెంకటేశ్వరరావు, కుమార్తె అయిన హైదరాబాద్ నగర మేయరు గద్వాల విజయలక్ష్మిలకు చెందిన బంజారాహిల్స్‌లోని స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ప్రత్యేకంగా జిఒ జారీ చేసిన తీరును హైకోర్టు తప్పుపట్టింది. గతంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 56 చట్టబద్ధంగా లేదంది. ఈ తప్పును సరిచేసుకునే దిశగా అధికారుల చర్యలు ఉండాలంది. లేనిపక్షంలో తామే ఆదేశమిూలిస్తామని హెచ్చరించింది. పొరపాటును సరిదిద్దాలంది. గత నిర్ణయాన్ని సమర్థించుకోవాలని భావిస్తే తాము చూస్తూ ఉండబోమని చెప్పింది. క్రమబద్ధీకరణ తీరు అందరికీ సమానంగా లేకపోవడాన్ని తప్పుపట్టింది. కెకె కుమారుడు, కుమార్తె స్థలాలను క్రమబద్ధీకరిస్తూ 2023 ఏడాది మే 23న గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జిఒ 56 చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరుతూ సిద్ధిపేట జిల్లా కొండపాకకు చెందిన జి.రఘువీర్‌రెడ్డి అదే ఏడాదిలో పిల్ దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్లతో కూడిన బెంచ్ విచారించింది. బంజారాహిల్స్ మురికివాడ ప్రాంతంలో వెంకటేశ్వరరావుకు చెందిన 1161 చదరపు గజాల స్థలాన్ని, విజయలక్ష్మికి చెందిన 425 గజాల స్థలాలను 1998 నాటి మార్కెట్ విలువ చదరపు గజం రూ.2500, రూ.350 చొప్పున క్రమబద్ధీకరణ వల్ల ప్రభుత్వ ఖజానాకు తీరని నష్టమని పిటిషనర్ వాదన. అప్పటికే అక్కడి స్థలాల రేట్లు 60 వేలకుపైగా గజం స్థలం ఉందన్నారు. ఇప్పుడు కోట్లరూపాయల విలువైన స్థలాలన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్ణయం తీసుకుని ఇచ్చిన జిఒలని చెప్పారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, స్లమ్స్‌లో 50 నుంచి 100 గజాలను మాత్రమే క్రమబద్ధీకరణకు వీలుందని చెప్పింది. మార్కెట్ ధరకాకుండా 1998నాటి దరఖాస్తు తేదీ ధరను పరిగణనలోకి తీసుకోవడం అన్యాయమని పేర్కొంది. ప్రభుత్వం ప్రతిష్టను వీడి సానుకూల నిర్ణయం తీసుకోవాలంది. విచారణను జనవరి 7కి వాయిదా వేసింది.

## ఐఎఎస్‌లకు నోటీసులు

**ప్రజాపక్షం/హైదారాబాద్:** సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన అప్పీ్లు తగిన నిర్ణయం తీసుకోవాలన్న గత ఉత్తర్వులను అమలు చేయని ఇద్దరు ఐఎఎస్ అధికారులకు హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చింది. జనవరి 9వ తేదీ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని, ఒకవేళ కౌంటర్ దాఖలు చేయకపోతే వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అంతే కాకుండా కౌంటర్ దాఖలు చేయని కారణంగా కోర్టు ఖర్చుల కింద రూ.10 వేలను హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్)కు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మాజీ కమిషనర్ కె.ఇలంబర్తిలకు జస్టిస్ నగేష్ భీమపాక ఉత్తర్వులను జారీ చేశారు. సిటీలోని శేరిలింగంపల్లి మండలంలో సిటీప్లానర్లు జారీ చేసిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లకు సమాచార హక్కు చట్టం కింద సంబంధించి రికార్డుల పరిశీలన నిమిత్తం అనుమతించకపోవడంతో సికింద్రాబాద్ వాసి వి.శ్యాం పిటిషన్వేశారు. అప్పీళ్లను నెల రోజుల్లోగా పరిష్కరించాలన్న ఆదేశాల్ని అధికారులు అమలు చేయలేదంటూ శ్యాం వేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లో ఈ ఆదేశాలను వెలువరించారు. విచారణను జనవరి 9కి వాయిదా వేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## టెక్స్‌టైల్ మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం

20కి పైగా దుకాణాలు దగ్ధం



**సూరత్ :** టెక్స్‌టైల్ మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఏకంగా ఆ టెక్స్‌టైల్ దుకాణ సముదాయంలోని 20కి పైగా షాపులకు మంటలు అంటుకున్నాయి. గుజరాత్ రాష్ట్రం సూరత్ నగరంలోని పర్వత్ పటియా ఏరియా లోగల రాజ్ టెక్స్‌టైల్ మార్కెట్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఏడంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భవనం మొదటి అంతస్తు లిఫ్టులో చెలరేగిన మంటలు వేగంగా ఏడో అంతస్తు వరకు వ్యాపించాయని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఫైరింజన్‌ల సాయంతో ఏకంగా నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

## మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో 15 మంది

# మావోయిస్టులు లొంగుబాటు

**గడ్చిరోలి/కాంకర్ :** ఇటీవలి కాలంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. తాజాగా ఇరు రాష్ట్రాల్లో కలిపి 15 మంది నక్సల్స్ సరెండర్ అయ్యారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం 11 మంది సీనియర్ నక్సలైట్లు డిజిపి రష్మి శుక్లా ఎదుట లొంగిపోయారని అధికారులు తెలిపారు. వారిపై తలలపై సమష్టిగా రూ.82 లక్షల రివార్డు ఉందన్నారు. డిజిపి ముందు మావోయిస్టులు ఆయుధాలు వీడుతున్నప్పుడు వారిలో నలుగురు 'యూనిఫాంలో ఉన్నారని వారు తెలిపారు. పౌరులపై జరుగుతున్న బుద్ధిహీన హింసతో విసుగు చెంది, 2005 నుండి మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు కమ్ పునరావాస విధానానికి ఆకర్షితులవుతున్నట్లు, బోలు మావోయిస్టు భావజాలం పట్ల పెద్ద సంఖ్యలో కేడర్లు భ్రమపడిపోయారని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గడ్చిరోలి పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సమష్టి ప్రయత్నాల కారణంగా, ఈ సంవత్సరం జిల్లాలో 112 మంది మావోయిస్టు కేడర్లు లొంగిపోయారని పేర్కొన్నారు. బుధవారం లొంగిపోయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యులు గడ్చిరోలి నివాసి రమేష్ లేకామి (57), భీమ కోవాసి (35), ప్లాట్‌ఫామ్ పార్టీ కమిటీ సభ్యులు పోరియే గోటా (41), రతన్ ఓయం (32), కమల్ వెలాడి (30) ఉన్నారు. వీరందరూ ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారేనని పోలీసులు ఆ ప్రకటనలో వెల్లడించారు. ఆయుధాలు విడిచిపెట్టిన ఇతర వ్యక్తులలో ఏరియా కమిటీ సభ్యులు పోరియే వెలాడి (36), రామాజీ పుంగటి (35), ప్లాటూన్ సభ్యులు సోను కటో (19), ప్రకాష్ పుంగటి (22), సీతా పల్లో (22), సాయినాథ్ మాడే (23) ఉన్నారు. మావోయిస్టుల బృందం లొంగిపోతే, వారి పునరావాసం కోసం కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి సహాయంగా మొత్తం రూ.10 లక్షల బహుమతిని ప్రకటించాయని పోలీసు శాఖ తెలిపింది. గడ్చిరోలి పోలీసులు నిర్వహించిన మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేయడం, మావోయిస్టులు లొంగిపోయి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి ప్రభుత్వం అందించిన అవకాశం కారణంగా, 2022 నుండి జిల్లాలో 146 మంది హార్డ్‌కోర్ నక్సలైట్లు తమ ఆయుధాలను విడిచిపెట్టారని, ఇందులో ఈ సంవత్సరం 112 మంది ఉన్నారని అది తెలిపింది.

**ఛత్తీస్‌గఢ్‌లో నలుగురు...**

2009లో మదన్వాడ–కోర్కోటి దాడిలో 29 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలను బలిగొన్న దాడిలో పాల్గొన్న నలుగురు నక్సలైట్లు బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో లొంగిపోయారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఇద్దరు మహిళలు సహా ఈ కేడర్లపై సమిమష్టిగా రూ.23 లక్షల రివార్డు ఉందని ఆయన చెప్పారు. 'పూనా మార్గెమ్ (పునరావాసం నుండి సామాజిక పునరేకీకరణ వరకు)' చొరవ కింద వారు సీనియర్ పోలీసు, సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) అధికారుల ముందు లొంగిపోయారని కాంకర్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎకె ఎలెసెలా తెలిపారు. బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన ఈ చొరవ, కాంకర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి, గౌరవం, సమగ్ర పురోగతిని నెలకొల్పడానికి ఒక పరివర్తనాత్మక చొరవగా అభివృద్ధి చెందుతోందని ఆయన అన్నారు. లొంగిపోయిన కార్యకర్తలలో, గడ్చిరోల్ (మహారాష్ట్ర) మావోయిస్టుల విభాగంలో సభ్య కంపెనీ నంబర్ 10గా క్రియాశీలకంగా ఉన్న కాజల్ అలియాస్ రజితా వేదాడ (19)కు రూ.8 లక్షల రివార్డు ఉందని ఆయన చెప్పారు. మరో ముగ్గురు మంజుల అలియాస్ లక్ష్మీ పోటై (37), విలాస్ అలియాస్ చైతు ఉసేండి (42), రామ్‌సాయి అలియాస్ లఖన్ మర్రాపి (42) ఒక్కొక్కరికి రూ.5 లక్షల రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. 2006–2025 మధ్య, పశ్చిమ బస్తర్ డివిజన్ సాంకేతిక బృందం సభ్యుడు పోటై 16 సంఘటనలలో పాల్గొన్నాడు. 2009 మదన్వాడ–కోర్కోటి ఆకస్మిక దాడిలో అప్పటి రాజ్‌నంద్‌గావ్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) వినోద్ చౌబే, 28 మంది ఇతర భద్రతా సిబ్బంది మరణించారని ఆయన అన్నారు. అదేవిధంగా, 2004 నుండి 2025 వరకు, ఏరియా కమిటీ సభ్యుడు అయిన మర్రాపి 42కి పైగా మావోయిస్టు సంఘటనలలో పాల్గొన్నాడు. వాటిలో 2008 గుమ్డిదీకొండ ఆకస్మిక దాడిలో ఆరుగురు భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని, 2019 మహ్లా ఆకస్మిక దాడిలో నలుగురు జవాన్లు మరణించారని ఆయన చెప్పారు. పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ. 50,000 తక్షణ సహాయం అందించబడిందని ఆయన చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పునరావాస విధానం మావోయిస్టులను ఆకర్షిస్తోంది. లొంగిపోతున్న వారి కుటుంబాలు కూడా వారు సాధారణ జీవితాలను గడపాలని, సమాజంతో చేయి చేయి కలిపి ముందుకు సాగాలని కోరుకుంటున్నాయి అని ఎలెసెలా అన్నారు. గత రెండేళ్లలో ఛత్తీస్‌గఢ్‌లో అగ్రశ్రేణి క్యాడర్‌లతో సహా 2,380 మందికి పైగా నక్సలైట్లు లొంగిపోయారని తెలిపారు.



**లొంగిపోయిన నక్సలైట్లపై కేసుల సమీక్షకు కేబినెట్ సబ్ కమిటీ**

లొంగిపోయిన నక్సలైట్లపై నమోదైన క్రిమినల్ కేసులను సమీక్షించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బుధవారం ఒక క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఉపసంహరణకు అర్హత ఉన్న కేసులను సబ్ కమిటీ ప్రభుత్వం సిఫార్సు చేసిందని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి అధ్యక్షతన తన అధికారిక నివాసంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రకటన తెలిపింది. పోలీసుల ప్రకారం.... గత రెండేళ్లలో రాష్ట్రంలో 2,380 మందికిపైగా నక్సలైట్లు లొంగిపోయారు. 'లొంగిపోయిన నక్సలైట్లపై నమోదైన క్రిమినల్ కేసులను పరిష్కరించే/ఉపసంహరించుకునే ప్రక్రియను మంత్రివర్గం ఆమోదించింది. లొంగిపోయిన నక్సలైట్లపై నమోదైన కేసులను సమీక్షించి పరిశీలించడానికి క్యాబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. వీటిని కోర్టుల నుండి ఉపసంహరించుకోవచ్చు. తుది నిర్ణయం కోసం కమిటీ ఈ కేసులను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం కోసం క్యాబినెట్ ముందు సమర్పిస్తుంది' ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఛత్తీస్‌గఢ్ నక్సలైట్ సరెండర్/బాధితుల ఉపశమనం, పునరావాస విధానం2025 నిబంధనల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నామని, ఇది లొంగిపోయిన కేడర్లపై నమోదైన కేసులను పరిష్కరించడాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని, వారి సత్ప్రవర్తన, నక్సలిజం నిర్మూలనకు వారి సహకారాన్ని పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపింది. జిల్లా స్థాయి కమిటీ మొదట లొంగిపోయిన ప్రతి కేడర్ పెండింగ్ క్రిమినల్ కేసులను పరిశీలించి, తన నివేదికను పోలీసు ప్రధాన కార్యాలయానికి సమర్పిస్తుంది, ఇది తన అభిప్రాయంతో పాటు ప్రతిపాదనను పంపుతుంది. ప్రభుత్వం న్యాయ శాఖ అభిప్రాయాన్ని పొందుతుంది. తరువాత కేసులను క్యాబినెట్ సబ్‌కమిటీకి సమర్పిస్తుంది, ఇది తుది నిర్ణయం కోసం క్యాబినెట్‌కు సిఫార్సులను పంపుతుంది అని తెలిపింది.



## మోదీ తన సమయంలో సగం దేశం వెలుపలే...

రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనపై ఎందుకు ప్రశ్నిస్తున్నారు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ నిలదీత

**న్యూఢిల్లీ :** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ వచ్చే వారం జర్మనీలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పర్యటనపై బిజెపి విమర్శలకు చేసింది. దీంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాషాయ పార్టీ విమర్శలకు దీటైన జవాబిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దాదాపు సగం పని సమయాన్ని దేశం వెలుపల గడుపుతుండగా, ప్రతిపక్ష నాయకుడిపై వారు ఎందుకు ప్రశ్నలు లేవనెత్తుతున్నారని నిలదీశారు. డిసెంబర్ 15 నుండి 20 వరకు రాహుల్ గాంధీ జర్మనీలో పర్యటిస్తారని, ఆ సమయంలో ఆయన భారతీయ దయాస్పోరాతో సంభాషిస్తారని, జర్మన్ మంత్రులను కలుస్తారని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ తెలిపింది. కాగా, రాహుల్ ఎల్ఒపి – పర్యటన్ నాయకుడు అని బిజెపి గాంధీ పర్యటనపై విమర్శించింది. గాంధీపై బిజెపి విమర్శలు గురించి ప్రశ్నించగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విలేకరులతో మాట్లాడుతూ 'మోదీ జీ తన పని సమయంలో దాదాపు సగం దేశం వెలుపల గడుపుతారు... ప్రతిపక్ష నాయకుడు (లోక్‌సభలో) ప్రయాణంపై వారు ఎందుకు ప్రశ్నలు లేవనెత్తుతున్నారన్నారు. అంతకుముందు, జర్మనీలోని ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ మాట్లాడుతూ 'పార్లమెంటు సభ్యుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిసెంబర్ 15 నుండి 20 వరకు జర్మనీలో పర్యటిస్తారు. ఆయనతో పాటు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్‌పర్సన్ సామ్ పిట్రోడా కూడా ఉంటారు అని అన్నారు.



## ఓట్ చోరీకి ఇసిని బిజెపి అస్త్రంగా మార్చుకుంటోంది

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు

**న్యూఢిల్లీ :** 'ఓట్ చోరీ'కి సంబంధించి బిజెపి, ఎన్నికల కమిషన్‌పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఓట్ చోరీకి ఎన్నికల కమిషన్‌ను బిజెపి ఒక అస్త్రంగా మార్చుకుందని తాజాగా మండిపడ్డారు. మంగళవారం ఎన్నికల సంస్కరణపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో తాను చేసిన ప్రసంగం క్లిప్‌ను రాహుల్ ఎక్స్‌లో పంచుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భారతదేశ ప్రజలు సిజెఐని ఇసిని ఎంపిక ప్యానెల్ నుండి ఎందుకు తొలగించారు? 2024 ఎన్నికలకు ముందు ఇసికి దాదాపు పూర్తి చట్టపరమైన రోగనిరోధక శక్తి ఎందుకు ఇవ్వబడింది? 45 రోజుల్లోపు సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేయడానికి ఎందుకు తొందర పడ్డారు? వంటి మూడు ముఖ్యమైన, ప్రత్యక్ష ప్రశ్నలను అడుగుతున్నారన్నారు. ఎన్నికల సంఘాన్ని బిజెపి ఓటు చోరీ కోసం సాధనంగా మారుస్తోందని ఆరోపించారు. మంగళవారం ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్‌గాంధీ బిజెపి, ఎన్నికల సంఘం భారతదేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి, ప్రజల గొంతును అణచివేసేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలకు ఒక నెల ముందు అన్ని పార్టీలకు మెషిన్ రీడబుల్ ఓటరు జాబితాను అందించాలని, 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజ్‌లను నాశనం చేయడానికి అనుమతించే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఇవిఎంలను యాక్సెస్ చేయడానికి అనుమతి ఇవ్వాలని, ఎన్నికల కమిషనర్లు వారు ఏమి చేయాలనుకున్నా తప్పించుకోవడానికి అనుమతించే చట్టాన్ని మార్చాలని గాంధీ సభలో పలు సూచనలు చేశారు.

## రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్



**న్యూఢిల్లీ :** దేశంలో ఫోరెన్సిక్ సామర్థ్యాలను పెంపొందించడంపై హోంమంత్రి అమిత్ షాకు బిజెపి ఎంపి పోస్టు చేసిన ప్రశ్నను ఎలాంటి వివరణ లేకుండా ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు బుధవారం రాజ్యసభలో వాకౌట్ చేశాయి. బిజెపి ఎంపి ఆదియా ప్రసాద్ హోంమంత్రికి ఒక ప్రశ్న వేశారు. దీనిని స్టార్‌డ్ ప్రశ్నగా అంగీకరించారు. దీనికి మంత్రులు మౌఖికంగా సమాధానం ఇవ్వా లి. రాజ్యసభ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న ప్రశ్నల జాబితా ప్రకారం బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రసాద్ ప్రశ్న నం.2గా ఉంది. అయితే, ఒక దిద్దుబాటు నోట్‌లో ప్రశ్నను ఉపసంహరించబడినట్లు పరిగణించవచ్చని పేర్కొంది. చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ప్రశ్నను దాటవేసి తదుపరి ప్రశ్నకు వెళ్ళినప్పుడు, కాంగ్రెస్ నాయకుడు ఎస్ జైరాం రమేష్, ఇతరులు ప్రశ్నను ఎందుకు ఉపసంహరించుకున్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. 'మీకు నియమాలు తెలుసు. రూల్ 53 సభ్యుడు తనకు నచ్చిన విధంగా ఏదైనా ప్రశ్నను ఉపసంహరించుకోవడానికి అనుమతిస్తుంది' అని చైర్మన్ అన్నారు. మీరు కోరుకుంటే మీరు కూడా ఉపసంహరించుకోవచ్చని, సభ్యుల హక్కులలో జోక్యం చేసుకోలేన్నారు. ప్రతిపక్ష ఎంపిలు ఒత్తిడి చేయడంతో రాధాకృష్ణన్ వారికి దానిని లేవనెత్తే హక్కు లేదన్నారు. సంబంధిత సభ్యుడిని ప్రశ్న అడగమని వారు చేసిన విజ్ఞప్తిని కూడా రాధాకృష్ణన్ తిరస్కరించారు. 'నేను ఎందు కు చెప్పాలి? నాకు చెప్పే హక్కు లేదు. అది ఆయన ఇష్టం. మీరు రేపు కొన్ని ప్రశ్నలను ఉపసంహరించుకోవచ్చు. అందులో నేను జోక్యం చేసుకోను' అని ఆయన అన్నారు, ఈ అంశంపై ప్రతిపక్ష ఎంపిలు చెప్పేది ఏదీ రికార్డులో ఉండకూడదని ఆదేశించారు. ప్రశ్నోత్తరాల సమయానికి అంతరాయం కలిగించవద్దని ఆయన వారిని కోరుతూ, ఎజెండాలో పేర్కొన్న ప్రశ్నలతో ఆయన ముందుకు సాగారు. చైర్మన్ జవాబుతో సంతృప్తి చెందని ప్రతిపక్ష ఎంపిలు సభలో వాకౌట్ చేశారు.

## అసలు 'ఇండిగో సంక్షోభం' ఎందుకు తలెత్తింది?

కేంద్రాన్ని ప్రశ్నించిన ఢిల్లీ హైకోర్టు

సంక్షోభ సమయంలోనూ టికెట్ ధర అమాంతం రూ.40 వేలకు పెరగడమా? అని బెంచ్ విస్మయం

జనవరి 22 నాటికి సీల్డ్ కవర్‌లో ఒక నివేదికను సమర్పించాలని కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** ఇండిగో అనేక విమాన సర్వీసులను రద్దు చేయాల్సిన పరిస్థితి ఎందుకు తలెత్తిందని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిని ఒక 'సంక్షోభం' అని వ్యాఖ్యానించింది. ఇండిగో సంక్షోభంపై బుధవారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. విమాన టికెట్ ధరలు ఇలాంటి సమయంలోనే అమాంతం ఎందుకు పెరిగిపోయాయని అడిగింది. చిక్కుకుపోయిన ప్రయాణికులకు కలిగిన కష్టాలు, వేధింపులతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు సంభవించిన నష్టాల గురించి కూడా ప్రశ్న ఒకటి ఉందని హైకోర్టు పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావు గెదెలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ ఈ సంక్షోభ పరిస్థితిని ఇతర విమానయాన సంస్థలు ఒక ప్రయోజనంగా మలుచుకుని ప్రయాణికుల నుంచి టికెట్ల కోసం ఎంత పెద్ద మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తాయని ప్రశ్నించింది. రూ.5,000కు లభించే టికెట్ ధరలు, రూ.30,000 నుండి రూ.35,000కు ఎలా పెరిగాయి?. సంక్షోభం ఉంటే ఇతర విమానయాన సంస్థలు ఎలా ప్రయోజనం పొందగలవు?. అది (టికెట్ ధర) ఎలా రూ.35,000 మరియు రూ.39,000ల వరకు ఎలా పెరుగుతుంది?. ఇతర విమానయాన సంస్థలు టికెట్ ధరలు పెంచడం ఎలా ప్రారంభించగలవు?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ విషయమై గంటన్నరకు పైగా విచారణ జరిగింది. కమిటీ ప్రారంభించిన దర్యాప్తు పూర్తి అయితే తదుపరి విచారణ తేదీ అయిన జనవరి 22నాటికి ఒక సీల్డ్ కవర్‌లో కోర్టుకు ఒక నివేదిక సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. 'పౌరవిమానయాన శాఖ, డిజిసిఏ తీసుకున్న చర్యలను ధర్మాసనం అభినందించింది. కానీ దేశంలోని విమానాశ్రయాలలో లక్షలాది మంది చిక్కుకుపోవడానికి దారితీసిన అటువంటి పరిస్థితులు ఎలా ఏర్పడటానికి ఎలా అనుమతించబడిందనేది మమ్మల్ని బాధపెడుతోంది. ఇది ప్రయాణికులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను కూడా ప్రభావితం చేసింది. ఎందుకంటే ప్రస్తుత కాలంలో ఆర్థికవ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయాణికుల ప్రయాణం వేగంగా ఉండాలనేది ఒక ముఖ్యమైన అంశం' అని ధర్మాసనం చెప్పింది. కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఏ) తరపు న్యాయవాది కోర్టుకు తన వాదనలు వినిపించారు. 'చట్టబద్ధమైన యంత్రాంగం పూర్తిగా యథాతథంగా ఉంది. ఇండిగోకు షోకాజ్ జారీ చేయబడింది. వారు క్షమాపణలు చెప్పారు. విమాన సిబ్బందికి విమాన విదుల వేళలతో సహా అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసిన మార్గదర్శకాలను పాటించకపోవడం వల్ల సంక్షోభం తలెత్తింది' అని ప్రభుత్వ న్యాయవాది వివరించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ పెరుగుదలను నియంత్రించి, పరిమితం చేశామని, ఇది గతంలో ఎప్పుడూ జరగలేదని అది తెలియజేసింది. విచారణ సందర్భంగా, ఎటువంటి పరిశోధన, డాక్యుమెంటేషన్ లేకుండా పిటిషన్ దాఖలు చేసిన తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఊహించని సమస్యలు సహా అనేక కారణాల వల్ల సంక్షోభం ఏర్పడిందని ఇండిగో తరపు న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. విమాన సర్వీసు రద్దుకు మాత్రమే కాకుండా, వారికి కలిగిన ఇతర ఇబ్బందులకు కూడా పరిహారం చెల్లించడానికి ఏర్పాట్లు చేయాలని కోర్టు విమానయాన సంస్థను ఆదేశించింది. ఈ పరిస్థితి త్వరలోనే సమసిపోయేలా చూడాలని, అన్ని విమానయాన సంస్థలు తగినంత సంఖ్యలో పైలట్లను నియమించుకోవాలని కూడా ఢిల్లీ హైకోర్టు అధికారులను ఆదేశించింది.

## స్థానిక ఎన్నికల్లో కేంద్రమంత్రి ఎలా ఓటు వేస్తారు?

సిపిఐ నాయకుడు వివిఎస్ అనిల్ కుమార్ నిలదీత

**తిరువనంతపురం :** కేంద్రమంత్రి సురేష్ గోపి తిరువనంతపురం నుండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలా ఓటు వేయగలరో తెలియజేయాలని సిపిఐ నాయకుడు వివిఎస్ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నుండి తన ప్రత్యర్థిగా ఉన్న సునీల్ కుమార్ ఫేస్‌బుక్ పోస్ట్‌లో, గోపి, కుటుంబం గత లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్‌లోని నెట్టిస్సేరీ నుండి ఓటు వేశారని, తాను అక్కడ శాశ్వత నివాసి అని చెప్పుకున్నారని చెప్పారు. మంగళవారం కేరళలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల మొదటి దశలో గోపి తన కుటుంబ సభ్యులతో కలిసి తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లోని శాస్తమంగళం వార్డులో ఓటు వేశారు. ఇది ఎలా జరుగుతుందని ప్రశ్నిస్తూ ఎన్నికల కమిషన్, కేంద్రమంత్రి సమాధానం ఇవ్వావని సిపిఐ నేత తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నుండి సురేష్ గోపి చేతిలో సునీల్ కుమార్ దాదాపు 75,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ మూడవ స్థానంలో నిలిచింది.

## 'సర్' అంటే దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు చేయడమే: ఒవైసీ

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమీక్ష (సర్) అంటే దొడ్డిదారిన ఎన్.ఆర్.సి (ఎంపిక చేసిన జాతీయ పౌరుల జాబితా) అమలు చేయడం తప్ప మరొకటి కాదని లోక్‌సభలో ఎఐఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. లోక్‌సభలో బుధవారం ఎన్నికల సంస్కరణలపై కొనసాగిన చర్చలో ఒవైసి పాల్గొన్నారు. మతం ప్రాతిపదికపై ప్రజలను ఎంపికచేసి మిగిలినవారిని ఓటింగ్‌లో పాల్గొనకుండా చేసేందుకు మోసపూరితంగా అధికారాలను దుర్వినియోగం చేయడమే ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణలోని అంతరార్థమని ఒవైసి విమర్శించారు. ఓటు హక్కును ఒక ప్రాథమిక హక్కుగా చేయాలని, ఎన్నికల సంస్కరణలపై ఒక ఏకాభిప్రాయాన్ని నిర్మించాలని పిలుపు ఇచ్చారు. ''ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం పార్లమెంటు ద్వారా చేసిన శాసనాలను ఉల్లంఘించిందని మొట్టమొదట నేను చెప్పదలచుకున్నా, పార్లమెంటు నిర్దేశించిన హక్కులను 'సర్' ఉల్లంఘించింది, ఈ దేశంలో ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు కంటే, పార్లమెంటు కంటే గొప్పదికాదు, ప్రతి పౌరుడూ ఫారమ్–6 లో పేర్కొన్న ఆరు పత్రాలలో ఏదో ఒక పత్రాన్ని సాక్ష్యంగా సమర్పించడం ద్వారా భారత పౌరుడుగా స్వీయ నిర్ధారణ చేసుకునే ప్రాతిపదికపై ఓటర్ల జాబితాలను తీర్చిదిద్దాలి. ఈ సాక్ష్యాలతో ఓటర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలి, ప్రజాప్రాతినిధ్య చట్టంలో పేర్కొన్న ఈ విషయాన్ని నేను ఈ లోక్‌సభ దృష్టికి తీసుకు వస్తున్నా, పార్లమెంటు ఆమోదించిన చట్టం ఇదే, ఈ చట్టం ప్రకారమే ఓటర్ల జాబితాలు రూపొందాలి, ఒకసారి ఒక వ్యక్తి ఓటర్ల జాబితాలో చేరిన తర్వాత వారిని ఓటర్ల జాబితా నుండి తొలగించకూడదు, అంటే వారి పౌరసత్వం చెల్లుబాటుపై ఎలాంటి విచారణ జరపకుండా తొలగించకూడదు, ఏ సందేహం కారణంగా వారిని ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారనే విషయాన్ని తెలియజేయాలి, వారిని వారు నిరూపించుకోవడానికి ఒక అవకాశం ఇవ్వాలి లాల్ బాబు హుస్సేన్ కేసులో తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకే ఒక తీర్పు ప్రకటించింది, ఈ మార్గదర్శకాలను పాటించాలి'' అని ఒవైసి లోక్‌సభ దృష్టికి తెచ్చారు. కానీ ఇప్పుడు ఎన్నికల సంఘం సాక్ష్యం తెచ్చుకోవాలంటూ ఒక పెద్ద భారాన్ని ఓటర్లమీద పడేసిందని అఖిల భారత మజ్లిస్–ఎ–ఇత్తెహదుల్ ముస్లిమీన్ నాయకుడు అన్నారు. ఇదంతా పార్లమెంటు చేసిన ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమని తోసిపుచ్చారు. 2003 నాటి ఓటర్ల జాబితాను ఏకపక్షంగా ఒక మూలాధారంగా నిర్ధారించారని, హోంమంత్రిత్వశాఖ తరహాలో పౌరసత్వానికి సంబంధించిన నిర్ధారణలు చేసే అధికారం ఎన్నికల సంఘానికి లేదని ఒవైసి అన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ద్వారా 2.66 లక్షలమంది ఓటర్లను జాబితాల నుండి ఎన్నికల సంఘం తొలగించినప్పుడు ఈ ప్రభుత్వం ఒక కొత్త వలస, విదేశీ చట్టాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిన తర్వాత ప్రభుత్వం విదేశీ మినహాయింపు ఉత్తర్వు ఇచ్చిందని, ఎందుకంటే ఈ తొలగించిన ఓటర్లలో ముస్లింమేతరులు కూడా ఉంటారని వారిని రక్షించాలని ప్రభుత్వం భావించిందని, అందువల్లనే తాను ఈ 'సర్' వ్యవహారమంతా దొడ్డిదారిన అర్హులైన జాతీయ పౌరసత్వ జాబితా విన్యాసంగా భావించి దీనిని వ్యతిరేకిస్తున్నానన్నారు.



**మీరు గొంతు చించుకున్నాగానీ బెంగాల్ ప్రజలు మమత పక్షమే**

ఎంతో గౌరవప్రదమైన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)ను ప్రభుత్వం భయంకరమైన 'గబ్బర్‌సింగ్' లాంటి వ్యక్తిలాగా మార్చేసిందని లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు శతాబ్దిరాయ్ విమర్శించారు. ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ఆమె పాల్గొంటూ, బిజెపి నాయకులు ఎంత గట్టిగా 'సర్', 'సర్', 'సర్' అని అరచినాగానీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రజలు 'మేడమ్'' పక్షానే (ముఖ్యమంత్రి మమతా బెనర్జీ) నిలబడతారని అన్నారు. దేశంలోని 12 రాష్ట్రాలలో కేంద్ర పాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ''వీళ్ళకి (బిజెపి నాయకులకు) పశ్చిమ బెంగాల్ గురించి ఏమీ తెలియదు, వాళ్ళంతా ఎన్నికల సమయంలో రోజువారీ ప్రయాణికుల్లాగా వస్తూ ఉంటారు, తర్వాత పరాజయాన్ని మూటగట్టుకుని తిరిగి వెళ్ళిపోతారు, ఈసారి ఎన్నికల్లో కూడా అంతకంటే ఏమీ తేడాఉండదు, మీరు బీహార్ అసెంబ్లీని గెలుచుకుని ఉండవచ్చు, కానీ పశ్చిమ బెంగాల్‌ను మాత్రం గెలుచుకోలేరు'' అని శతాబ్ది రాయ్ హెచ్చరించారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి డింపుల్ యాదవ్ మాట్లాడుతూ, దేశ ఎన్నికల వ్యవస్థలో ఇవిఎంల స్థానంలో తిరిగి పేపర్ బ్యాలెట్ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కానీ ఎన్నికల సంఘం దేశంలో కేంద్ర ప్రభుత్వం ఆడించినట్టే ఆడుతోందని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర ఎన్నికల కమిషనర్‌లను ఎంపిక చేసుకునే కమిటీలోకి దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తిరిగి సభ్యుడుగా చేర్చుకోవాలని కోరారు. డిఎంకె నాయకుడు టి.ఎం.సెల్వగణపతి మాట్లాడుతూ, ఎన్నికల సంఘాన్ని, ఇతర స్వతంత్ర వ్యవస్థలను కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకుని ఆడించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 'సర్' ప్రక్రియ అక్రమం, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కాగా కేంద్రమంత్రి, అప్నాదళ్ (ఎస్) నాయకుడు అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, వరుసగా ఎన్నికల్లో పరాజయాలు పొందడంవల్లనే విసుగెత్తిపోయిన ప్రతిపక్షాలు ఎన్నికల సంఘాన్ని, 'సర్'ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నాయన్నారు.

## సెక్స్ వర్కర్ల కోసం 'సర్' శిబిరాలు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ సిఇఒ కార్యాలయం బుధవారం కోల్‌కతాలోని అనేక రెడ్‌లైట్ ప్రాంతాలలో శిబిరాలను నిర్వహించింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓచపు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా లైంగిక కార్మికులు గణన ఫారాలను నింపడంలో ఇది సహాయపడుతుందని ఒక అధికారి తెలిపారు. నగరంలోని కిద్దెర్‌పూర్, కాళిఘాట్, చెట్ల ప్రాంతాలలోని రెడ్‌లైట్ జోన్‌లలో ఈ శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తూర్పు మహానగరంలోని ఆసియాలోనే అతిపెద్ద రెడ్ లైట్ జిల్లా అయిన సోనాగాచిలో ఇలాంటి సహాయ శిబిరాలు నిర్వహించిన మరుసటి రోజు ఈ చర్య తీసుకోవడం గమనార్హం. 'కిద్దెర్‌పూర్‌లోని మున్షిగంజ్ రోడ్‌లోని ఫైవ్‌స్టార్ క్లబ్‌లో, అలాగే 148 కాళిఘాట్ రోడ్‌లో, చెట్లాలోని 29/ఎ రఖల్‌దాస్ అధ్యా రోడ్‌లో శిబిరాలు జరుగుతున్నాయి' అని ఎన్నికల కమిషన్ అధికారి తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాలు ఉదయం 11 గంటల నుండి పనిచేయడం ప్రారంభించాయని ఆయన అన్నారు. 'గణన ఫారాలను నింపడంలో సెక్స్ వర్కర్లకు సహాయం అందుతుందని, శిబిరం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. కిద్దర్‌పూర్‌లో కనీసం 70 మంది సెక్స్ వర్కర్లు ఉండగా, ఈ సంఖ్య కాళిఘాట్‌లో దాదాపు 100 ఉంది. చెట్లాలో దాదాపు 60 మంది ఉన్నారని అధికారి పిటిఐకి తెలిపారు. సెక్స్ వర్కర్లు, వారి పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న అనేక సంస్థలు లేవనెత్తిన ఆందోళనలకు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నారు. ఆందోళనలను పరిష్కరించడానికి, సమాజానికి మద్దతు ఇవ్వడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయని సిఇఒ కార్యాలయం హామీ ఇచ్చింది. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా మినహాయించబడరని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ అగర్వాల్ చెప్పినప్పటికీ, సోనాగాచి నుండి వందలాది మంది సెక్స్ వర్కర్లు మంగళవారం ఇసి సహాయ శిబిరాలకు ఆందోళనతో తరలివచ్చారు. ఉత్తర కోల్‌కతాలోని వార్డ్ నంబర్ 18లోని ఇరుకైన లేన్‌లు, రద్దీగా ఉండే 'కోఠీ'లలో సంవత్సరాలుగా నివసిస్తున్న చాలా మంది మహిళలు, తమ పేర్లు ఓటర్ల జాబితా నుండి తొలగించబడతాయేమోనని ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. ఎందుకంటే వారికి పూర్వీకుల రుజువు లేకపోవడం లేదా దశాబ్దాల క్రితం అక్రమ రవాణా, వదిలివేయబడిన లేదా ఇంటికి పారిపోయిన తర్వాత చాలా కాలంగా వారి జన్మించిన కుటుంబాలతో సంబంధాలు కోల్పోయారు.

ప్రజాపక్షం
గురువారం, 11 డిసెంబరు

## 'దీపావళి'కి గుర్తింపు ప్రమాదమా? ప్రమోదమా?

దీపావళి పండుగకు ఐక్యరాజ్య సమితి విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) గుర్తింపు హర్షణీయం. ఆహ్వానించదగిన పరిణామం. కానీ, దీని వెంటే వెనుక పొంచి ఉన్న ప్రమాదాలను కూడా గుర్తించాలి. జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే, ఆనందం విషాదంగా మారడానికి ఎంతోకాలం పట్టదు. యునెస్కో గుర్తింపు తర్వాత 'దీపావళి' ఒక పండుగ కంటే వ్యాపారోత్సవంగా మారే అవకాశం ఉంది. సంప్రదాయ దీపాల స్థానంలో భారీ లైట్లు, బ్రాండెడ్ ఉత్పత్తుల ప్రాధాన్యం పెరుగుతుంది. మత, సాంస్కృతిక భావాల కంటే మార్కెటింగ్ ప్రచారాలు పెరుగుతాయి. పండుగ స్ఫూర్తి నీరుగారుతుంది. దీపావళిని కేవలం వెలుగుల ఉత్సవంగా చూపించి, ధర్మం, సత్ప్రవర్తన, సుపరిపాలన వంటి లోతైన భావనలను విస్మరించే ప్రమాదం ఉంది. భవిష్యత్ తరాలు దీపావళి తాత్విక అర్థాన్ని మరచిపోయినా ఆశ్చర్యం లేదు. ఇక్కడ, పర్యావరణ సమస్యలను గుర్తించాలి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో ఢిల్లీ చేరింది. అక్కడి వాయుకాలుష్యం దీపావళి తర్వాత మరింత ఆందోళనకరంగా మారడాన్ని చూస్తునే ఉన్నాం. ఈ పండుగకు గ్లోబల్ గుర్తింపు కారణంగా, ఇకపై వేడుకలు పెద్దస్థాయిలో జరుగుతాయి. బాణాసంచా పేలుళ్లు భారీగా పెరుగుతాయి. శబ్ద, వాయు కాలుష్యాలకు అవధులు ఉండవు. ఇలాంటి పరిణామాలు, దీపావళి పండుగ ఇచ్చే సందేశమైన శాంతి, శుభ్రత, సమతుల్యతలకు ప్రతికూలం. యునెస్కో హోదా లక్షల చేతుల కృషిని గుర్తించినా, స్థానిక కళాకారులు, సంప్రదాయ కార్మికులకు నష్టం తప్పదు. యంత్ర ఆధారిత ఉత్పత్తులు పెరిగితే, చిన్న కుమ్మరులు, చేతివృత్తి కళాకారులు పోటీ తట్టుకోలేకపోవచ్చు. ఫలితంగా, వారి జీవనోపాధి ప్రమాదంలో పడుతుంది. అంతేకాదు, మారిన సాంస్కృతికీకరణ రాజకీయ రంగు దాల్చే అవకాశాలు లేకపోలేదు. దీపావళి లాంటి పండుగకు అంతర్జాతీయ గుర్తింపు రావడం వల్ల దానిని రాజకీయ ప్రచారాల కోసమే వాడుకునే ప్రమాదం కూడా ఉంది. అది పండుగ ఏకత్వ సందేశాన్ని దెబ్బతీస్తుంది. యునెస్కో హెరిటేజ్ అంటే, ఒక సంప్రదాయం మారుతూనే, ఉనికిని కాపాడుకోవడం. కానీ, ఒక నిర్దిష్ట రూపం, మార్పులేని విధానాలే అసలైన వారసత్వమని భ్రమిస్తే, అది ప్రాంతీయ వైవిధ్యం, కాలానుగుణ మార్పులకు అడ్డంకిగా మారుతుంది. అంతేగాక, ఇకపై ప్రపంచం దీపావళిని యునెస్కో ప్రమాణాల కంటితో చూసే అవకాశం ఉంది. అలాంటి సందర్భాల్లో చిన్న మార్పులే తీవ్ర విమర్శలకు దారితీస్తాయి. వారసత్వం స్థానంలో మత వాదం తిష్ఠవేస్తుంది. సమవాదం క్షీణిస్తుంది. సామ్యవాదం కనుమరుగవుతుంది. ఒకే పండుగను దేశంలోని భిన్న ప్రాంతాల్లో, భిన్న వర్గాల్లో వేరువేరు విధానాల్లో జరుపుకోవడం ఇప్పటి వరకూ కొనసాగుతున్న ఆనవాయితీ. భవిష్యత్తులో దీపావళి తన స్థానిక పరిమళాన్ని కోల్పోవచ్చు. స్థానిక ఆచారాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితులు ఉత్పన్నం కావచ్చు. ఇది మన సాంస్కృతిక స్వేచ్ఛకు విఘాతం కలిగించవచ్చు. రెండంచుల కత్తిగా మారే యునెస్కో గుర్తింపు కేవలం ఒక గౌరవం మాత్రమే కాదు... గురుతర బాధ్యత కూడా. భవిష్యత్తులో అసలైన ప్రమాదం బాణాసంచా లేదా వేడుకల పరిమాణంతోనేగాక, దీపావళి స్ఫూర్తి, విలువలు, భావజాలం కోల్పోయే వాతావరణం వల్ల కూడా ఎదురుకావచ్చు. ఇప్పటికే, దీపావళి సందర్భంగా పేల్చే బాణాసంచాపై సుప్రీం కోర్టు పరిమితులు విధించడాన్ని వాతావరణ పరిరక్షణ అంశంగా కాకుండా, మత విశ్వాసాల సమస్యగా చిత్రీకరించడంలో కొన్ని రాజకీయ పార్టీలు, గ్రూపులు నిమగ్నమయ్యాయి. కావాల్సినంత విషాన్ని నూరిపోస్తున్నాయి. మత భావనల స్థానంలో విషబీజాలు నాటుతున్నాయి. ఇలాంటి శక్తుల విచ్ఛిన్నకర విధానాలు.. అవాంఛనీయ కార్యకలాపాల విశృంఖలత్వం రానున్నకాలంలో మరింత పెరగవచ్చు. మతవాదం వికృతరూపం దాల్చవచ్చు. ఈ భవిష్యత్ ప్రమాదాలను నిలువరించే బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. దీపావళి నిజంగా సజీవ వారసత్వంగా ఉండాలంటే, సంప్రదాయానికి ఆధునికతకు మధ్య సమతుల్యత అవసరం. పర్యావరణ సున్నితత్వాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. దీనిని భూగోళం ఎదుర్కొంటున్న సమస్యగా గుర్తించాలే తప్ప, మత కోణంలో చూస్తూ, విద్వేషాలు పెంచకూడదు. వెలుగు నుంచి చీకటిలోకి కాదు.. చీకటి నుంచి వెలుగులోకి రావడమే నిజమైన మార్పు. సిసలైన అభివృద్ధి. రాజకీయ ప్రయోజనాల కోసమో లేక మత పునాదుల మీద దేశాన్ని నిలబట్టేందుకు ప్రయత్నించడం కోసమో దీపావళికి లభించిన యునెస్కో గుర్తింపును వాడుకుంటే దేశం ప్రమాదంలో పడుతుంది. భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. వాయు కాలుష్యం కాటేస్తుంది. యునెస్కో గుర్తింపుతో సంబరాలు చేసుకోవచ్చు... అదే సమయంలో రాబోయే సమస్యలను కూడా గుర్తించాలి. పరిష్కార మార్గాలను అన్వేషించాలి. స్థిరమైన నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడే యునెస్కో గుర్తింపుకు సార్థకత.

# 'వందేమాతరం'పై ప్రమాదకరమైన మోదీ భాష్యాలు

**గ్యాన్‌పాథక్**

భారత స్వాతంత్ర్యోద్యమంలో ఎంతో ఉత్తేజకారకంగా పనిచేసిన 'వందేమాతరం' పాట జాతీయ గేయంగా ప్రకటించబడింది. జనగణ మనను జాతీయగీతంగా రాజ్యాంగ సభ గుర్తించింది. 'వందేమాతరం' (అమ్మా నీకు వందనం) చారిత్రక పాత్ర దృష్ట్యా ఆ గేయం రచన 150వ వార్షికోత్సవాన్ని భారతదేశం స్మరించుకుంటూ వేడుక చేసుకోవాలనుకుంది. అది గేయంగానే కాదు, జాతీయోద్యమ పోరాట నినాదంగా ప్రాచుర్యం పొందింది. అయితే అది జాతీయగేయంగా పరివర్తన చెందిన చరిత్రను ఉపయోగించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్లమెంటులో గావించిన వాక్చాతుర్య ప్రసంగం, ఆ గేయం వేడుక స్థానంలో తీవ్రమైన కోపతాపాలను సృష్టించింది.

'వందేమాతరం'పై పూర్వపు కాంగ్రెస్ నాయకులను మోదీ విమర్శించటం చరిత్ర జ్ఞానలోపం అయినా అయి ఉండాలి లేదా భారత దేశ చరిత్రను తాము ఎంచుకున్న మార్గంలో తిరగరాసే ప్రయత్నమైనా అయి ఉండాలి. అంటే దేశ లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగ జాతీయ వాదానికి విరుద్ధంగా స్థూలంగా ఆర్ఎస్ఎస్ హిందూ జాతీయవాదానికి అనుగుణంగా చరిత్రను తిరగరాయటం అన్నమాట. ఆయన కథనం రాజకీయంగా బలంగా ఉన్నప్పటికీ, అది చారిత్రకంగా బలహీనంగా ఉంది, రాజ్యాంగరీత్యా ప్రమాదకరమైంది. ఆయన బహుళత్వంతో కూడిన జాతీయోద్యమ చరిత్రను మత తత్వ నైతికతతో కూడిన గాథగా కుదించారు. దాన్ని అన్యాయంగా ప్రస్తుత కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉపయోగించారు.

దేశం ఆయన ప్రసంగం విన్నది. లౌకిక రాజ్యాంగ సమతూకాన్ని ఆయన ఎలా బుజ్జగింపు వ్యవహారంగా ముద్రవేశారో, మత తటస్థతను హిందూ వ్యతిరేక పక్షపాతంగా ఎలా చిత్రించారో, ఐచ్ఛిక జాతీయ వాదం స్థానంలో ఎలా ప్రదర్శనాపూరిత జాతీయవాదాన్ని ప్రవేశపెట్టారో, మైనారిటీ హక్కులను మెజారిటీకి అవమానంగా ఎలా చిత్రించారో చూశాం. గతకాలపు కాంగ్రెస్ నాయకులు ముస్లింలను బుజ్జగించే విధానం ఆచరించారని, హిందూ వ్యతిరేక పక్షపాతం కలిగి ఉన్నారని ప్రధాని మోదీ వారిపై పదేపదే దాడి చేశారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలపు చరిత్ర గూర్చి, ముఖ్యంగా వందేమాతరం ప్రస్తావనగూర్చి ఇది ఏ మాత్రం తటస్థ అవగాహన కానేకాదు. అందువల్ల ఆయన ప్రసంగాన్ని బేసబబైనది, తప్పుత్రోవ పట్టించేందిగా చరిత్రకారులు, రాజ్యాంగ పండితులు పరిగణించవచ్చు.

వందేమాతరం గేయంతో వాస్తవంగా కాంగ్రెస్ ఎలా వ్యవహరించింది? కాంగ్రెస్‌కు నిజమైన సమస్య ఎదురైనట్లు చారిత్రక వాస్తవికత సూచిస్తున్నది. 1930–40 దశకాల నాటికి ముస్లిం నాయకులు వందేమాతరం గేయంలో రెండు చరణాల తదుపరి చరణాలకు అభ్యంతరం చెప్పారు. వాటిలో దేవతా చిత్రణ స్పష్టంగా ఉంది. దాని తప్పనిసరిగా పాడటం జాతీయ విధేయతకు – మత ఆరాధనకు మధ్యనున్న విభజన రేఖను మరుగుపరుస్తుందని వారు భయపడ్డారు. ఇది కృత్రిమమైన సమస్య కాదు, దేశ విభజన రాజకీయాల గాయం నుంచి ఉద్భవించింది. భవిష్యత్ స్వతంత్ర భారత్‌లో మెజారిటీ–మైనారిటీ అధికారం గూర్చి గాఢమైన ఆందోళనలు వ్యక్తమైనాయి.

అందువల్ల, రాజ్యాంగ నిర్ణాయక సభ తొలి రెండు చరణాలను మాత్రమే (అవి కేవలం భూమి, నదులు, భూసారం గూర్చి ప్రశంసలతో ఉంటాయి)జాతీయ పాటగా ఉంటాయని నిర్ణయించింది. 'జనగణ మన'ను జాతీయ గీతంగా అంగీకరించింది ఈ రెంటిలో దేనిని పాడాలని ఏ పౌరుణ్ణీ బలవంతం చేయకూడదని కూడా నిర్ణయించింది. రాజ్యాంగ సంబంధమైన రాజీ ''బుజ్జగింపు'' కాజాలదు. అది వాస్తవానికి, మత వివాదాన్ని నిరోధించటానికి రాజ్యాంగపరంగా సర్దుబాటు. ఆ నిర్ణయం లౌకిక ప్రజాస్వామ్యానికి అనుగుణమైనది తప్ప ''బుజ్జగింపు'' కాదు.

రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, ఇంకా అనేకమంది ముఖ్య నాయకులు ఈ తులనాత్మక దృక్పథాన్ని ఆమోదించారు. ప్రధాన నరేంద్రమోదీ బిజెపికి అనుకూలంగా హిందూ ఓట్ల సమీకరణ కోసం దాన్ని ''హిందూ–వ్యతిరేకం''గా, ముస్లింల ''బుజ్జగింపు''గా ఎలా చిత్రిస్తున్నారో ఇప్పుడు చూదాం.

ప్రధాని మోదీ సర్వసాధారణంగా (నేరుగా లేదా భావార్థంలో) ఇలా అంటూ ఉంటారుః కాంగ్రెస్ నాయకులు ''హిందూ గుర్తింపు''ను చెప్పుకోవటానికి సిగ్గుపడుతుంటారు; ముస్లింలను బుజ్జగించటానికై హిందూ ప్రతీకలను చిన్నచూపు చూస్తారు; ''మైనారిటీ ఒత్తిడి'' వల్ల వందేమాతరాన్ని వారు బలహీనపరిచారు. ఈ చిత్రణలో మూడు వక్రీకరణలున్నాయి : లౌకికవాదాన్ని ''హిందూ వ్యతిరేకమైనదిగా'' మార్చటం; ముస్లింల ఆందోళనలను అన్యాయమైనవిగా చిత్రించటం;



ఆ రాజీకి హిందువుల తోడ్పాటును చెరిపివేయటం. వాస్తవానికి కాంగ్రెస్ ఏమి చేసింది? రెండు విషయాలు ప్రత్యేకించి పేర్కొన్నతగినవి : రాజ్యాన్ని మత తటస్థంగా పరిగణించారు; రాజ్యం బలవంతం లేకుండా తమ విశ్వాసాన్ని ఉంచుకునేందుకు అన్ని సముదాయాలు అనుమతించబడినాయి.

తన విమర్శకు దీన్ని ప్రాతిపదికగా చేసుకుని ప్రధాని మోదీ ఏమన్నారంటే, రాజ్యం హిందూ ప్రతీకలను బహిరంగంగా గౌరవించకపోతే అది ''హిందూ వ్యతిరేకి'' అవుతుంది. ఇది లౌకికవాదాన్ని తలక్రిందులుగా నిలబెడుతున్నది. తటస్థతను శత్రుత్వంగా వక్రంగా చిత్రీకరించారు.

మోదీ తమ వాక్చాతుర్యంలో, ముస్లిం అభ్యంతరాలను ''డిమాండ్లుగా'' ''ఒత్తిడిగా'', ''ఓటు బ్యాంక్ బ్లాక్‌మెయిల్‌గా'' అభివర్ణించారు. అయితే చారిత్రకంగా రాజ్యాంగ సభ ఈ అభ్యంతరాలను బహిరంగంగా చర్చించింది. ఒక మత చర్యను ఏ పౌరునిపైనా బలవంతంగా విధించటం ద్వారా దేశ నిర్మాణం జరగదని హిందూ నాయకులు తమంత తాము అంగీకరించారు. అందువల్ల, కాంగ్రెస్‌లో గాని, రాజ్యాంగ సభలోగానీ కుదిరిన ఏకాభిప్రాయం, ''స్థూల ఏకాభిప్రాయంపై ఆధారపడిన రాజ్యాంగ ఏర్పాటు'' అనేది స్పష్టం. దాన్ని ''ముస్లింల బుజ్జగింపు'' అనటానికి వీల్లేదు.

ప్రధాని నరేంద్ర మోదీ చేసిన మూడవ వక్రీకరణ – కాంగ్రెస్ వారి రాజీకి గాను ఆ పార్టీ హిందువుల తోడ్పాటు కోల్పోయింది. ''కాంగ్రెస్ హిందూ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ముస్లింల వైపు మొగ్గింది'' అనేది మోదీ కథనం. అయితే చారిత్రక వాస్తవం ఏమంటే, రాజేంద్రప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, రాధాకృష్ణన్ ఇంకా అనేకమంది, మత స్వేచ్ఛను పరిరక్షిస్తూ, వందేమాతరం గేయాన్ని దాని తొలి రెండు చరణాలకు పరిమితం చేస్తూ అంగీకారం తెలిపారు. అందువల్ల ఆ నిర్ణయం మత సంబంధమైన ఇచ్చిపుచ్చుకోవటం కాదని, జాతీయ వివాద పరిష్కారమన్నది స్పష్టం. మోదీ వాక్చాతుర్యం చారిత్రక అవగాహనకు వ్యతిరేకమైంది. అది వివాదాలను పరిష్కరించకపోగా, హిందువుల ఓట్ల సమీకరణ కోసం కొత్త సమస్యలు సృష్టించేదిగా ఉంది.

అయితే ప్రధాని నరేంద్రమోదీ చిత్రణ ఆయనకు, ఆర్ఎస్ఎస్‌కు, బిజెపికి రాజకీయంగా ఉపయుక్తంగా ఉంది. ఆయన కథనం నాలుగు ప్రధాన రాజకీయ ధ్యేయాలకు ఉపకరిస్తున్నది: హిందువు లు బాధితులన్న కథనం సృష్టించటం; బిజెపిని 'చారిత్రక తప్పిదాలను సరిదిద్దే' పార్టీగా చిత్రించటం; బహుళత్వాన్ని ద్రోహంగా మార్చటం; దేశం – మతం మధ్యనున్న రేఖను మసకబార్చటం.

కాంగ్రెస్ ''హిందూ ప్రతీకలను అణచివేసిందని'', తాము ''రెండవ తరగతి'' వారమన్న భావనను హిందువుల్లో కలిగించిందని చెప్పటం ద్వారా ప్రధాన మంత్రి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా హిందువుల్లో ఒక చారిత్రక ఫిర్యాదును సృష్టించటానికి ప్రయత్నించారు. అది కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సమీకరణ ను, సాంస్కృతిక ఆగ్రహాన్ని కలుగజేసే ప్రయత్నం. ''కాంగ్రెస్ నిరాకరించిన దానిని పునరుద్ధరించే'' వ్యక్తిగా తననుతాను ప్రదర్శించుకునేందుకు మోదీ ప్రయత్నించారు. వందేమాతరం పాడటం, ఆల య రాజకీయాలు, మతంతో రాజ్యం మమేకతను బహిరంగంగా చాటటాన్ని భావజాలం మార్పుగా కాకుండా ''జాతీయ దిద్దుబాటు''గా ప్రదర్శిస్తున్నారు.

''ఐచ్ఛిక దేశభక్తి'', ''మత స్వేచ్ఛ'', ''మత ప్రతీకతపై రాజ్యాంగం విధించిన పరిమితులు'' గూర్చి ఎవరైనా మాట్లాడితే వారికి ''కాంగ్రెస్ ఆలోచనా ధోరణి'' కలిగినవారుగా, ''దేశద్రోహులుగా'', ''బుజ్జగింపుదారు''గా ముద్రవేస్తున్నారు. ఇది భిన్నాభిప్రాయ ఆవరణను కుదిస్తుంది కాబట్టి ప్రమాదకరమైనది.

ఈ కథనం ప్రకారం దేశం అంటే అర్థం హిందూ సాంస్కృతిక వక్రీకరణగా కనిపిస్తున్నది. ఈ కథనంతో ఏకీభవించకపోవటం అవిధేయత అవుతుందన్న మాట. స్వాతంత్ర్య పోరాట కాలంలోను, రాజ్యాంగ సభ చర్చల్లోనూ దేశం అంటే అర్థం విశ్వాసాలకు అతీతంగా ప్రజలందరి రాజకీయ గమ్యం, విభేదించటం ప్రజాస్వామిక హక్కు.

మోదీ విమర్శలో ప్రధానమైన బేసబుతనం : లౌకిక రాజీని ముస్లింల బుజ్జగింపుగా, మనఃసాక్షిని కాపాడుకోవటాన్ని హిందు మతాన్ని అవమానించటంగా, ఐచ్ఛిక దేశభక్తిని బలవంతపు ప్రతీక వాదంగా, రాజ్య మత తటస్థతను నకిలీ లౌకికవాదంగా, వివాద నిరోధనను బలహీనమైన నాయకత్వంగా చిత్రించటం. ఆయన వాగాడంబరం చరిత్రకు సంబంధించి విశ్లేషణ కాదు, బిజెపికి అనుకూలంగా ప్రజా సమీకరణ నిమిత్తం ఒక రాజకీయ పునర్మదింపు.

కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగ అసెంబ్లీ – వందేమాతరం పాటను ప్రజలను ఐక్యపరిచే సాంస్కృతిక ప్రతీకగా మలిచాయి. లీగల్ వేధింపు లేకుండా స్వేచ్ఛ కలిగించాయి. చిత్రమేమంటే, మెజారిటీ వాద రాజకీయాల నిమిత్తం మోదీ దాన్ని కాంగ్రెస్, ముస్లింలకు వ్యతిరేకంగా, ముస్లింల్లో గణనీయమైన మద్దతు కలిగిన అన్ని ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. జాతీయ వేడుకను వీధి స్థాయి పోరాటం దశకు దిగజార్చటం మంచిది కాదు.

# ఉగాది పచ్చడిలా.. రెండేళ్ల ప్రజా పాలన



యాసాని కరుణాకర్ రెడ్డి
రాష్ట్ర స్థానిక కార్యదర్శి
తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (STUTS)
9866103202

కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డిగారి రెండేళ్ల ప్రజా పాలన కొంత తీపి, కొంత చేదు, మరి కొంత ఘాటు ఇలా కొంత ఆశాజనకంగా, మరికొంత నిరాశాజనకంగా సాగుతుందని ప్రజల అభిప్రాయం.

**విద్యారంగం:** రెండేళ్ల ప్రజా పాలనలో విద్యా, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలియజేయడం అభినందనీయం. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలు, బదిలీలు, పదోన్నతులు,అన్ని పాఠశాలలకు ఉచిత కరెంటు, మధ్యాహ్న భోజనంలో కొంత నాణ్యత పెంచడం,పాఠశాలల్లో మౌలిక వసతులకు కొంత నిధులను కేటాయించడం, ఉచిత పాఠ్య పుస్తకాలు,ఉచిత ఏకరూప దుస్తులను సకాలంలో అందించడం, విశ్వవిద్యాలయలకు వైస్ చాన్సలర్‌లను నియమించి, అధ్యాపక నియామకాలు చేయడం,స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయడం అభినందనీయం. కానీ ప్రైవేటు విద్యా వ్యవస్థ పై నియంత్రణ లేకపోవడం, ఫీజు రెగ్యులేటరీ కమిటీని ఏర్పాటు చేసిన అది సత్వర నిర్ణయాలు తీసుకోలేకపోవడం, నూతన జాతీయ విద్యా విధానం–2020పై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మరియు దానిపై మేధావులు యొక్క అభిప్రాయ సేకరణ చేయకపోవడం, దానివల్ల కేంద్రం నుండి విద్యారంగాని కి రావాల్సిన నిధులు ఆశించిన స్థాయిలో రాకపోవడం, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకుండా, పరిశీలించకుండా ఎసి గదులలో ఉండి ఆచరణకు అమలుగాని నిర్ణయాలు, సంస్కరణలు చేయడం వలన విద్యావ్యవస్థలో కొంత నిరాసక్తత కొనసాగుతున్నది. దీనిని సరి చేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

**వైద్యరంగం:** స్వతంత్ర భారతదేశంలో నేడు అతి ఖరీదైన అంశం వైద్యం మాత్రమే. నేటికీ మన రాష్ట్రంలో పేద, మధ్య తరగతితో పాటు ధనికులు కూడా అనుకోని ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ఖరీదైన వైద్యం అందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి కొనసాగుతూనే ఉంది. మారుమూల ప్రాంతాలలో నేటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోవడం బాధాకరం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న ప్రాంతాలలో వైద్య నియామకాలు జరగడం లేదు. దానితో ఆవాస, గిరిజన, గ్రామీణ ప్రాంతాల ప్రజలు చిన్న జబ్బు చేసినా పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. నేడు వైద్యం కార్పోరేట్ స్థాయికి చేరి ఎవరికీ అందనంత ఎత్తులో ఉంది. ప్రజలకు ఉచిత ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసినా ప్రైవేటు హాస్పిటల్స్ వారికి ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు రాకపోవడం వల్ల వారు ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగించలేకపోతున్నారు. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వం వారి నిఘా లేకపోవడం వలన ఆసుపత్రుల యాజమాన్యం అవినీతి అనకొండలా మారిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా హెల్త్ కార్డులు అనేవి నేటికి ప్రభుత్వం అందించలేకపోవడం వలన వైద్యరంగం మాత్రం ప్రజాపాలనలో ఆశించిన స్థాయిలో లేదనేది వాస్తవం.

**వ్యవసాయ రంగం:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలు అధికం. ఆ గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవనాధారం పూర్తిగా వ్యవసాయ రంగం, వ్యవసాయాధారిత పనులు మాత్రమే. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మన రాష్ట్రంలో నిర్మించిన పెద్ద ప్రాజెక్టు నాగార్జునసాగర్ మాత్రమే. ఆ ప్రాజెక్టు నుండి వేల ఎకరాల సాగు ను కొనసాగిస్తున్నారు. ఆ తర్వాత శ్రీరాంసాగర్, పోచంపాడు ఇలా కొన్ని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు నిర్మించడం వల్ల వ్యవసాయానికి కొంత ఉపయోగపడుతున్నాయి. వర్షాధార పంటలు, వ్యాపార పంటలు, పండ్లతోటలు, కూరగాయల సాగువంటి వ్యవసాయ పంటలను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పించలేకపోతున్నారు. అందుకే రైతులు నేటికీ వరి, పత్తి తప్ప వేరే పంటలు పండించలేకపోతున్నారు. అందుకే ప్రజా పాలనలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రాజెక్టులతోపాటు నిర్మాణం, పండ్లతోటలు, కూరగాయల పెంపకంపై అవగాహన కల్పించి పండించిన పంటలు రైతుల అమ్ముకోవడానికి మార్కెట్ వ్యవస్థను అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**పారిశ్రామిక, ఉత్పత్తి రంగం:** ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలో ఒకప్పుడు అనేక పారిశ్రామిక వాడలు వెలిసినవి. అజామాబాద్, ఉప్పల్, నాచారం, సనత్ నగర్, బాల నగర్, జీడిమెట్ల అలాగే నిజామాబాద్, మిర్యాలగూడలో రైస్ మిల్లులు, బోధనలో షుగర్ ఫ్యాక్టరీ, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, బెల్లంపల్లి వంటి పట్టణాలలో బొగ్గు ఉత్పత్తి కేంద్రాలు ఇలా అనేక ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడం వల్ల వేల మంది కార్మికులకు ఆనాడు అందులో ఉపాధి దొరికింది. కానీ నేడు అనేక పరిశ్రమలు ప్రభుత్వాల ప్రోత్సాహం లేక అవి మూతబడి అందులో పనిచేసిన కార్మికులు రోడ్డునపడి నేడు వేరు వేరు వృత్తులలో కొనసాగుతున్నారు. నేడు ప్రభుత్వాలు కేవలం సాఫ్ట్‌వేర్ రంగాన్ని మాత్రమే ప్రోత్సహించడం వల్ల కొద్దిమందికి మాత్రమే ఉపాధి దొరకడం, ఉత్పత్తిరంగం పూర్తిగా దెబ్బతినడం, అందులో పనిచేసే అసంఘటిత రంగ కార్మికులకు ఉపాధి లేక నిరుత్సాహ స్థితిలో జీవిస్తున్నారు. అందుకే పారిశ్రామిక, ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**సంక్షేమ పథకాలు :** సంక్షేమ పథకాలలో రైతు రుణమాఫీ, రైతులకు ఉచిత విద్యుత్తు, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, మహిళలకు వడ్డీలేని రుణాలు, ఈ పథకాలు అన్ని ప్రజల సంక్షేమానికి అవసరమైన పథకాలు కావున అవి ప్రజాపాలనలో ఆశించిన స్థాయిలోనే కొనసాగుతున్నాయని ప్రజల అభిప్రాయం.రెండేళ్ల పాలన ముగించుకొని మూడవ సంవత్సరంలోకి అడిగిడుతున్న రేవంత్ రెడ్డి గారి ప్రజాప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 స్ఫూర్తితో రాష్ట్రం విద్య, వైద్యం ఉపాధి, పారిశ్రామిక రంగాలు, ఇతరత్రా అన్ని రంగాలలో అభివృద్ధిపథం వైపు అడుగులు వేస్తూ 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అనే విధంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ రెండేళ్ల పాలనకు అభినందనలు.

# పన్నుల పెనుభారం కింద సామాన్యుడు..
# 'వికాస భారాలు' ఎవరికోసం?

సామాజిక మాధ్యమాలలో విపరీతంగా చర్చకు దారి తీసిన ఈ వ్యంగ్య చిత్రం (కార్టూన్), భారతదేశంలో ప్రస్తుత పరిపాలనా వైఖరి, ఆర్థిక వాస్తవాల మధ్య ఉన్న పెద్ద అంతరాన్ని సూచిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యాన ముద్రలో, నవ్వుతూ, సమస్యల శిఖరంపై ప్రశాంతంగా కూర్చుని ఉన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థ తమ నియంత్రణలో ఉందని, స్థిరంగా ఉందని ప్రభుత్వ అగ్ర నాయకత్వం ఇస్తున్న సంకేతాన్ని సూచిస్తుంది. అయితే, ఆ కొండరాళ్ల క్రింద, పెట్రోల్ ధర పెరుగుదల, రూపాయి పతనం, భారీ పన్నుల (TAX) భారంతో నలిగిపోతున్న సామాన్య పౌరుడి నిస్సత్తువైన రూపం, క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత, నష్టాల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ సంస్థలను (PSUs) ప్రైవేటీకరించడం లేదా వ్యూహాత్మక విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచడం ముఖ్య ఆర్థిక లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం ప్రభుత్వానికి మేలు చేసినప్పటికీ, సామాన్యుడిపై కొన్ని భారాలను మోపిందనేది ఈ చిత్రం యొక్క ప్రధాన విమర్శ.




**పెట్రోల్ ధరలు, పన్నుల భారం**

చిత్రంలో కనిపించే భారీ పెట్రోల్ పంపు నాజిల్ మరియు 'TAX' అని ఉన్న పెట్టె... ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణ విధానాన్ని ఎత్తిచూపుతాయి. ఇంధన రంగం నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయమే అత్యంత ముఖ్యమైన ఆర్థిక వనరుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న అధిక ఎక్సైజ్ సుంకాలు (Excise Duty), రోడ్డు సెస్సులు వంటి పన్నుల కారణంగా వినియోగదారులకు ధరల ఉపశమనం లభించడం లేదు. ప్రభుత్వం ఈ అధిక పన్నుల రాబడిని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం నిధులు సమకూర్చడానికి ఉపయోగిస్తున్నప్పటికీ, ద్రవ్యోల్బణం (Inflation) పెరుగుదలకు, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడానికి ఇది ప్రధాన కారణంగా మారుతోంది. ఈ విధంగా, దేశ నిర్మాణానికి అయ్యే భారాన్ని సామాన్యుడి జేబుపై అధిక పన్నుల రూపంలో మోపుతున్నారు అనే వాదనకు ఈ అంశాలు బలం చేకూరుస్తున్నాయి. ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వాన్ని పైన అనుభవిస్తుంటే, ఆ భారం కింద ఉన్న సామాన్యుడిపై పడుతోంది.

**రూపాయి విలువ క్షీణత.. ఆర్థిక అనిశ్చితి**

విరిగిపోయిన రూపాయి నాణెంపై ఉన్న 'Rupee fall' అనే అక్షరాలు దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధాన సవాలును సూచిస్తాయి. భారత రూపాయి విలువ నిరంతరం క్షీణించడం వలన దిగుమతులు (ముఖ్యంగా ముడిచమురు, ఎలక్ట్రానిక్స్, రక్షణ పరికరాలు) ఖరీదైనవిగా మారుతున్నా యి. దీని ప్రభావం దేశీయంగా ధరల పెరుగుదలకు దారితీసి, సామాన్య ప్రజల దైనందిన ఖర్చులను పెంచుతుంది. ఈ ఆర్థిక అనిశ్చితి, ప్రపంచ పరిణామాల కారణంగా వచ్చినప్పటికీ, సామాన్యుడికి మాత్రం నిస్సత్తువను, భయాన్ని కలిగిస్తుంది. అధికారంపై ఉన్నవారు అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి స్థిరత్వాన్ని కొనసాగించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈ ప్రయత్నాల ప్రభావం సామాన్యుడికి దక్కకపోవడం ఈ చిత్రంలోని ప్రధాన విమర్శాంశం.

**కార్పొరేట్ అభివృద్ధి, ప్రభుత్వరంగ సంస్థల నష్టాలు :** చిత్రంలో ఇండిగో విమానం మరియు సంచార్ సాథి వంటి అంశాలు ప్రభుత్వంలోని కీలకరంగాల విధివిధానాలను సూచిస్తా యి.

మోదీ ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద ప్రైవేటీకరణ చర్యలలో ఎయిర్ ఇండియాను టాటా గ్రూప్‌కు విక్రయించడం ఒకటి. దశాబ్దాలుగా ప్రభుత్వానికి వేల కోట్ల నష్టాలను, భారీ రుణ భారాన్ని మిగిల్చిన ఈ సంస్థను విక్రయించడం వ్యూహాత్మకంఽగా సరైన నిర్ణయం అయినప్పటికీ, నష్టాల భారాన్ని ప్రభుత్వ మే భరించాల్సి వచ్చింది. టెలికాం రంగం లో ప్రభుత్వరంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్ (BSNL)వంటివి ప్రైవేట్ పోటీని తట్టుకోలేక భారీ నష్టాల్లో కూరుకుపోయాయి. ప్రభుత్వం వీటిని ప్రైవేటీకరించకుండా, వేలకోట్ల రూపాయల పునరుద్ధరణ ప్యాకేజీలను అందిస్తోంది. బ్యాంకింగ్ రంగం.. ప్రభుత్వం కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులను కూడా ప్రైవేటీకరించనున్నట్లు ప్రకటించింది, ఎందుకంటే అవి నిరర్థక ఆస్తులు (NPAs) కారణంగా నష్టాలను చవిచూస్తున్నాయి. ప్రైవేటీకరణ ద్వారా బ్యాం కింగ్ సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం వాదిస్తున్నప్పటికీ, ఈ నష్టాల భారం మొత్తాన్ని చివరికి ప్రభుత్వ ఖజానా, పరోక్షంగా ప్రజలు మోయాల్సి వస్తోంది.


**నలిగిపోతున్న సామాన్య పౌరుడి ఆవేదన :** సామాన్య పౌరుడు, ప్రభుత్వ విధానాల వల్ల కలిగే ప్రయోజనాలు, భారాల పంపిణీలో ఉన్న అసమానతను సూచిస్తున్నాడు. ఈ వ్యంగ్య చిత్రం యొక్క ప్రధాన సందేశం ఏమిటంటే, దేశ నాయకత్వం అభివృద్ధి, స్థిరత్వం సంకేతాలతో ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ, అధిక ఇంధన ధరలు, అధిక పన్ను లు, ద్రవ్యోల్బణం వంటి ఆర్థిక భారాలు సామాన్య ప్రజానీకాన్ని రోజువారీ జీవితంలో కుంగదీస్తున్నాయి. ఈ పరిస్థితి, ప్రభుత్వ విధానాలు కేవలం అగ్రస్థాయిలో ఉన్నవారికి మాత్రమే అనుకూలంగా ఉన్నాయనే సామాజిక విమర్శకు బలం చేకూరుస్తుంది.

వెంకగారి భూమయ్య, 9848559863

డిసెంబర్ 11న 78వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్న యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్ ఎమర్జన్సీ ఫండ్ ఫౌండేషన్ డే లేదా యూనిసెఫ్ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను ప్రపంచ బాలలు ఘనంగా నిర్వహించుకోవడం సముచితంగా ఉంది. 1953 నుంచి ఈ సంస్థను యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ అని నామకరణం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1946లో తాత్కాలికంగా ఏర్పడిన యూనిసెఫ్ తదనంతర కాలం 1953లో శాశ్వత ఐరాస అంగంగా గుర్తించబడింది. యూనిసెఫ్ వ్యవస్థాపక దినోత్స వం–2025 ఇతివృత్తంగా నా రోజు, నా హక్కులు (మై డే, మై రైట్స్) అనే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 34 నేషనల్ కమిటీలు, ఏడు ప్రాంతీయ కార్యాలయాలు, పరిశోధనాలయం, సరఫరా కేంద్రం, పలు సేవల కేంద్రాలతో నడుస్తున్న యూనిసెఫ్ సిబ్బంది 85శాతం క్షేత్రస్థాయిలోనే సేవలు అందించడం విశేషం.

**యూనిసెఫ్ ప్రధాన విధులు:** ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణయే ఏకైక లక్ష్యంగా యూనిసెఫ్ సేవలు అందిస్తున్నది. ప్రపంచవ్యాప్త బాలల ఆరోగ్యం, విద్య నైపుణ్యాల వృద్ధి, మాతాశిశు సంరక్షణ, పోషకాహార కల్పన, వ్యాధుల నివారణకు టీకాలు ఇప్పించడం, లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం, అత్యవసర సేవలు అందించడం, బాల కార్మిక వ్యవస్థలను ఛేదించడం, బాలల కనీస అవసరాలు తీర్చడం, సురక్షిత నీరు పారిశుద్ధ్య కల్పన, విపత్తు ప్రాంతాల్లో పిల్లల సంరక్షణ బాధ్యతలు చేపట్టడం, బాలికల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయడం, బాలల శక్తి దుర్వినియోగానికి వ్యతిరేకంగా కృషి చేసుకోవడం, అక్రమ రవాణాను అరికట్టడం, శిశు మరణాల రేటును తగ్గించడం లాంటి పలు సమకాలీన బాలల సమస్యలకు సరైన పరిష్కారాలు వెతుకుతూ, చిన్నారుల ఉజ్వల భవితకు గొడుగులు పడుతూ ముందుకు సాగుతోంది ఐరాసలో ఒక ప్రధాన భాగమైన యూనిసెఫ్ సంస్థ.

## విశ్వ బాలల స్వేచ్ఛా ప్రదాత యూనిసెఫ్ !




**బాలల ఆత్మీయ నేస్తాలు:** మానవీయ దృక్పథంతో ప్రపంచ అభాగ్య బాలలను అన్ని రకాలుగా ఆదుకోవడమనే ఏకైక లక్ష్యంతో 1946లో ఏర్పడిన యూనిసెఫ్ సంస్థ 190కి పైగా దేశాల్లో తమ లక్ష్య సాధనకు కృషి చేస్తున్నది. 1965లో నోబెల్ శాంతి బహుమతిని సైతం దక్కించుకున్న యూనిసెఫ్ సంస్థ నిరంతరం ప్రపంచవ్యాప్త చిన్నారులకు మేనమామగా మారి అక్కున చేర్చుకుంటూ వారి ముఖాల్లో నవ్వుల పువ్వులు వికసించే విధంగా చేయూతను అందిస్తున్నది. న్యూయార్క్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన యూనిసెఫ్‌ను 1946లో లుడ్విక్ రజ్‌మెన్ స్థాపించడం జరిగింది. ఐరాస సభ్య దేశాల్లో అమెరికా లాంటి అగ్ర దేశాలు అధికంగా నిధులను అందించడం కొనసాగుతున్నది. నేటి బాలల రేపటి ఉజ్వల భవితకు నేడే పెట్టుబడి పెట్టాలనే ధ్యేయంతో యూనిసెఫ్ ముందుకు సాగుతున్నది. పిల్లల భావనలకు పట్టం కట్టడం, వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఊతం ఇవ్వడం గత 78 ఏండ్లుగా కొనసాగుతున్నది. నేటి వరకు ప్రపంచవ్యాప్తంగా 760 మిలియన్ల బాలలను యూనిసెఫ్ ఆదుకోవడం సంతోషదాయకం. రేపటి తర నిర్మాణానికి నేడే మనం త్యాగాలు చేయడం, యునిసెఫ్ చేతులకు దండం పెట్టడం మన కనీస కర్తవ్యం. ఆపదలోకి చిన్నారులకు అమ్మ, భయం గుప్పిట ఉన్న చిన్నారులకు నాన్న, చిరునవ్వుల చిన్నారులకు ఆత్మీయ నేస్తంగా పలు భూమికలు నిర్వహిస్తున్న యూనిసెఫ్ అమూల్య సేవలను కొనియాడుతూ, నేటి యువతకు దాని విజయ చరిత్రలు అవగాహన పరుచుదాం.

లాంగ్ లివ్ యూనిసెఫ్ హెల్పింగ్ హాండ్
డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## ఘనంగా పాఠశాల సిల్వర్ జూబ్లీ



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో సెంటిస్ట్ పాఠశాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు పాఠశాల సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత 25 సంవత్సరాలుగా పట్టణంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ప్రయోజనాలు చేశామని పాఠశాల యజమానులు పేర్కొన్నారు. అదేవిధంగా నిరుపేదల విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ బాల భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎంఇఒ మంజుల, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రత

ఎస్పీ సునీతరెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి:** బుధవారం జిల్లా కేంద్రంలోని నాగవరం ఇందూ గార్డెన్ ఫంక్షన్ హాలులో ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ సునీతరెడ్డి దిశా నిర్దేశం చేశారు. మొదటి విడత స్థానిక సర్పంచ్ ఎన్నికలు గురువారం రోజు వనపర్తి జిల్లాలో పెద్ద మందడి, ఖిల్లాఘనపూర్, గోపాల్‌పేట్, రేవల్లి, ఏదుల మండలాలలో మొత్తం 87 గ్రామ పంచాయితీలకు గాను 5 ఏకగ్రీవం కాగా, 82 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరగనున్నాయని, 1050 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరా రెడ్డి, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డీఎస్పీ, బాలాజీ నాయక్, వనపర్తి సిఐ కృష్ణయ్య, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, సీసీఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను దహనం చేసిన గుర్తు తెలియని దుండగులు

**ప్రజాపక్షం/పెబ్బేరు:** పెబ్బేరు మండల పరిధిలోని చిన్న గుమ్మడం గ్రామానికి చెందిన కావలి మద్దిలేటి బైకును గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి దహనం చేశారు. కుటుంబ సభ్యులు బయటికి రాకుండా ప్రధాన ద్వారం బయట నుండి గొళ్ళెం వేశారు. దుండగుల చర్యతో బైక్ పూర్తిగా కాలిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి సంఘటన జరగడం గ్రామస్తులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. బాధితుడు సంఘటనపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో నేర నియంత్రణకు, భద్రత చర్యలో భాగంగా ప్రతి గ్రామంలో క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలను ఏర్పాటు తీసుకోవాలని పోలీస్ సిబ్బంది సూచించారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు అధికారికి షోకాజ్ నోటీస్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన గండీడ్ మండలం లో జోనల్ అధికారికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గండీడ్ మండలంలో విశ్వ భారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించి పోలింగ్ బృందాలకు సామాగ్రి పంపిణీ పర్యవేక్షించారు. కలెక్టర్ ఉదయం 10.30 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించిన సమయంలో జోనల్ అధికారిగా నియమించిన పంచాయితీ రాజ్, ఏఈ గండీడ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు రాకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం కారణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఎన్నికల విధుల్లో నియమించిన అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జోరుగా ఇంటింటి ప్రచారం




**ప్రజాపక్షం/మల్దకల్:** సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇంటింటి ప్రచారం జోరుగా సాగుతుంది. మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామంలో ఆత్మూర్ రామకృష్ణ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి ఉంగరం గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈ సందర్భం గా సర్పంచు అభ్యర్థి ఆత్మూర్ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి నీటి సదుపాయాలు, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థల మెరుగు తదితర కార్యక్రమాలు చేపట్టి పలు సంక్షేమ కార్యక్రమాల చేపడతామన్నారు. ప్రజలు తనకు మద్దతు ఇచ్చి సర్పంచుగా నన్ను గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలేటికి ప్రజా మద్దతు



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలంలో పంచాయితీ ఎన్నికల సందడి రోజు రోజుకు వేడెక్కుతోంది. ముఖ్యంగా పుల్గర్ చెర్ల గ్రామంలో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థి గురుక మద్దిలేటి విజయ దిశగా ప్రజల మద్దతును సమీకరిస్తున్నారు. గ్రామస్తులు, స్థానిక నాయకులు పోటాపోటీ ప్రచారంతో ఎన్నికల రంగం రసవత్తరంగా మారింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్ల రఘునాథ్‌రెడ్డి, మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆశీస్సులు, సహకారం గ్రామాభివృద్ధికి మరింత బలం చేకూరుస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాభివృద్ధికి దోహదం అయ్యే విధంగా పలుకుబడి పెరిగిందని, మంత్రి జూపల్లి పర్యవేక్షణలో పుల్గర్ చెర్లకు అనేక నిధులు సమకూర్చుకునే అవకాశం లభించిందని గుర్తు చేశారు. గ్రామాభివృద్ధి దిశగా ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పలు పనులు పూర్తి చేసినట్టు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి నిలిచిపోయి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే పరిస్థితి నెలకన్నదని రఘునాథ్ రెడ్డి విమర్శించారు.

## గ్రామ అభివృద్ధికి సహకరించండి



**ప్రజాపక్షం/దామరగిద్ద:** మండలం గడిమున్కపల్లి గ్రామంలో బిఆర్‌ఎస్ సర్పంచ్ అభ్యర్థి నాగమణి గోపాల్‌కి మద్దతుగా ప్రచారం చేయడం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ సర్పంచు అభ్యర్థి అయినటువంటి నాగమణి గోపాల్‌కి ఓటు వేసి గెలిపించాలని గత పది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తెలంగాణని నెంబర్ 1 స్థానానికి తీస్కెళ్లిన ఘనత కేసీఆర్‌ది అని చెప్పారు. మాజీ ఎంపీపీ బక్క నర్సప్ప, నాగమణికి ఓటు వేసి గెలిపించి మీయొక్క గ్రామ అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. అలాగే బాపన్‌పల్లి గ్రామ ఏకగ్రీవ సర్పంచు ఎన్నుకోబడ్డ గవినోళ్ల శ్రీనివాస్‌కి సన్మానం చేశారు. ఇందులో భాగంగా గోపాల్, నాగమణి, జి.సుభాష్, ఎక్స్ సర్పంచు, మల్లికార్జున్, మొగులప్ప, ఎక్స్ సర్పంచు రామచందర్, ఎక్స్ ఎంపిటిసి, పిల్లి శ్రీనివాస్, ఎక్స్ ఎంపిటిసి, జి.నర్సింలు, డిసి కిష్టప్ప, గ్రామ పెద్దలు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్రాబాద్‌లో 12 పంచాయతీలకు పోలింగ్

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అమ్రాబాద్ మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉండగా మూడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవంకావడంతోపాటు 12గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఐదు గ్రామపంచాయతీలకు రిజర్వేషన్‌కు సంబంధించిన అభ్యర్థులు లేకపోవడంతో ఐదు గ్రామ పంచాయతీలు నిలిచిపోయాయి. మండలంలో 182 వార్డుసభ్యులు ఉండగా 86 వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా, 96వార్డుసభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి, వేంకటేశ్వర్ల బావి, అమ్రాబాద్ గ్రామపంచాయతీలు ఏకగ్రీవంగా బరిలో నిలిచాయి. మిగతా 12 గ్రామపంచాయతీల్లో 36మంది సభ్యులు పోటిపడుతున్నారు. మండలంలో మిగిలిన 96వార్డుసభ్యులకు 260మంది సభ్యులు పోటీపడుతున్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/కొత్తపల్లి/మద్దూర్ :** గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం బుధవారం జిల్లా ఎన్నికల అధికారి ,కలెక్టర్ సిక్తా పట్నాయక్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని పోలింగ్‌కు అవసరమైన సామాగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో తీసుకున్నా సిబ్బంది ఒకటికి రెండుసార్లు సామాగ్రిని సిబ్బంది సరి చూసుకోవాలని సూచించారు. బ్యాలెట్ పత్రాలు, బాక్సులు చెక్ చేసి ప్యాక్ చేసుకోవాలని, పోటి చేసే అభ్యర్థులకు సమానంగా గుర్తులు ఉన్నాయా లేదా అని నిశితంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి భోజనం వసతి కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో విద్యుత్ అంతారాయం లేకుండా 24 గంటలు సరఫరా ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌లలో సిబ్బందికి తాగునిటి, వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి ,షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయగా, పిఓ,ఓపిఓలతో కూడిన బృందాలన్ని హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ సామగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తేవాలని ఆర్‌ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డిఆర్డిఓ మొగులప్ప, ఆయా మండల తహసీల్దార్లు మహెష్ గౌడ్, జమరాములు, ఎంపిడిఓలు కృష్ణారావు, రామన్నా రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి కృషి చేసి అండగా ఉంటానని జడ్చర్ల ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బుధవారం నాడు ఆయన అయ్యప్ప స్వాములతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయానికి సంబంధించిన రోడ్లు ఇతర మౌలిక సదుపాయాల గురించి మాట్లాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి దేవాలయ అభివృద్ధికి తను ముందు ఉంటానని ఇలాంటి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ఖచ్చితంగా పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. అదే విధంగా ఇటీవలే దేవాలయానికి వెళ్లే దారిలో రోడ్డు ఇబ్బందికరంగా ఉందని తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి రోడ్డు వేయించడం జరిగిందని ఆయన తెలిపారు. రాజకీయాలకు అతీతంగా దేవాలయాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎందుకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సుఖదాదేవి ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సేవలు**

మున్సిపాలిటీ పరిధిలో కార్పొరేట్ తరహాలో సుఖదాదేవి ఆస్పత్రిలో వైద్య సేవలు అందించేలా ఏర్పాటు చేశారని స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అభినందించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి బుధవారం పట్టణంలోని సుఖదాదేవి ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మొట్టమొదటిగా గైనకాలజిస్ట్ ఆస్పత్రి ప్రారంభించిన అనేక సేవలు అందించిన డా|| విజయలక్ష్మి నేతృత్వంలో నేడు అత్యాధునిక పరికరాలతో కార్పొరేట్ తరహాలో బెడ్లు ఏర్పాటు చేయడం బాగుందన్నారు. ఆస్పత్రి ప్రారంభం సందర్భంగా నిర్వహక్కులు బాదిమి సుఖదాదేవి, బాధిమి శివకుమార్, బి. రవిశంకర్, డాక్టర్లు బాదీమి సూర్య, సంకీర్తన, గౌతమి, ధ్రువలతోపాటు కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమానికి జెపిఎన్‌సి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవ ముదిరాజ్, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ తో పాటు జిల్లా, పట్టణంలోని ప్రముఖ వైద్యులు హాజరయ్యారు.

## ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



**ప్రజాపక్షం/పెబ్బేరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం పెబ్బేరు మండల పరిధిలోని గుమ్మడం క్రాస్ రోడ్‌లో డిప్యూటీ తాసిల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గుమ్మడం క్రాస్ రోడ్‌లో డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గుమ్మడం క్రాస్ రోడ్ దగ్గర విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నిబంధన ప్రకారం రూ.50,000 కంటే ఎవరు కూడా ఎక్కువ తీసుకెళ్లరాదని, విలువైన బంగారు వస్తువులు, ఓటర్లను ప్రభావితం చేసే ఇతర వస్తువులను ప్రమాణం చేయరాదని, ఎలక్షన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృంద నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు పోలింగ్‌కు సర్వం సిద్ధం




**ప్రజాపక్షం/వంగూర్ :** నేడు గ్రామపంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు ఎంపిడిఓ బ్రహ్మచారి పేర్కొన్నారు. 27 గ్రామపంచాయతీలకుగాను కొండారెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఏకగ్రీవం కాగా, 26 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. 192మంది సర్పంచ్ అభ్యర్థులు, 500లమంది వార్డు సభ్యులుబరిలో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో 201 పోలింగ్ కేంద్రాలకు 652మంది సిబ్బంది 9రూట్లు, జోనల్ ఆఫీసర్లు ఐదు మంది ఆర్‌ఓలు, 9మందితోపాటు కొంతమంది సిబ్బందిని రిజర్వులో ఉంచడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రైవేట్‌స్కూల్ బస్సులద్వారా సిబ్బందిని పంపించడం జరిగిందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మహేష్ పేర్కొన్నారు. ఎంపిడిఓ, తహసీల్దార్, పోలీసు అధికారుల పర్యవేక్షణలో అన్ని పోలింగ్‌స్టేషన్లకు ప్రైవేట్‌స్కూల్స్ బస్సులలో పోలింగ్ సిబ్బందిని పంపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళిమోహన్, డిప్యూటి తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆర్ఐ శేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల ఆరాధ్య దైవం పండుగ సాయన్న



**ప్రజాపక్షం/మక్తల్ :** పేద ప్రజల ఆరాధ్య దైవం పండుగ సాయన్న అని సమాజంలో అట్టడుగు వర్గాల కోసం కృషి చేసిన మహనీయుడు పండుగ సాయన్న అని మక్తల్ మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు కోళ్ల వెంకటేష్ అన్నారు. అందుగ సాయన్న వర్ధంతి పురస్కరించుకొని బుధవారం రోజు మక్తల్ పట్టణంలోని మత్స్య పారిశ్రామిక భవనంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకటేష్, గుంతల శివకుమార్, చీరాల నరసింహ మూర్తి, కున్ని నాగేందర్, కావలి రాజేందర్, వాకిటి హన్మంతు, కావలి బుజ్జప్ప, సాయిలు బుజ్జప్ప, మామిళ్ల పృథ్వీరాజ్, కల్లూరి గోవర్ధన్ పాల్గొన్నారు.

పండుగల సాయన్న పోరాట ప్రతిమతో విద్యా ఉద్యోగ రాజకీయంలో 42 శాతం రిజర్వేషన్లను సాధించుకుందాం అని జ్యోతిరావు పూలే బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసరి శ్రావణ్ కుమార్, పాలమూరు యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాయప్ప అన్నారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా వారి చరిత్రను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. బీసీ సంఘం నాయకులు మక్తల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి భాస్కర్, గుంతలి ఆంజనేయులు, టింగిలి నరేష్, కురవ అంజి, నరసింహులు, ఈసరి బాల్ రాజ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వచ్చాక ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు

**ప్రజాపక్షం/కొత్తకోట:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కొత్తకోట మండలం కనిమెట్ట, పాలెం, అమడబాకుల, సత్యహళ్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు కనిమెట్ట అభ్యర్థి చిన్న పుల్లయ్యల పెంటన్న (కత్తెర గుర్తు) పాలెం అభ్యర్థి మిద్దె నీరజ (ఉంగరం గుర్తు) అకడబాకుల అభ్యర్థి గౌనికాడి పదమ్మ (కత్తెర గుర్తు)లపై ఓటు వేసి, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా తమ గ్రామాలకు విచ్చేసిన ఎమ్మెల్యే జియంఆర్‌కి బాణసంచా పేలుస్తూ, డప్పు, వాయిద్యాలతో పెద్ద ఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు, అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ గ్రామాలలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసామని, సకాలంలో వారికి బిల్లులు, వారి అకౌంట్‌లలో పడుతున్నాయని, ఏప్రిల్‌లో రెండో విడత ఇండ్లకు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని, తద్వారా గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటున అందించాలని ఆయా గ్రామ ప్రజలను కోరారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆశీర్వదించాలని, గ్రామాల అభివృద్ధిలో మీరు సైతం భాగస్వాములై, కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించి, గెలిపించాలని గ్రామస్తులను కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్ తదనంతరం ఆయా గ్రామాల్లో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యే జిఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



## బిసిలు రాజకీయంగా నష్టపోతున్నారు

బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ డాక్టర్ యుగంధర్ గౌడ్



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించి బీసీల రాజకీయ చైతన్యాన్ని చాటి చెప్పాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యగంధర్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు 5380 సర్పంచ్ స్థానాలు దక్కేవని, బీసీ రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించడంతో బీసీలు రాజకీయంగా చాలా నష్టపోతున్నారని, అందుకే జనరల్ స్థానాలలో నిలబడిన బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించి సర్పంచ్ ఎన్నికలలో బీసీల సత్తాను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, కొత్తకోట మండల అధ్యక్షుల అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, చెలిమిల్ల రామన్ గౌడ్, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాల్లో ఎస్పీ డి.జానకి సందర్శన



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలు నేపథ్యంలో బాలికలు జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఎన్నికల సామగ్రి పంపిణీ సిబ్బంది హాజరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి బుధవారం పంపిణీ సమయంలో, నేడు జరిగే పోలింగ్ రోజున పాటించాల్సిన విధుల గురించి వివరంగా సూచనలు ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి సిబ్బంది తమపై అధికారి ఆదేశాలు వచ్చే వరకు విధుల్లో నిష్టగా, శ్రద్ధగా ఉండాలని అని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సమస్యలేమి లేకుండా జరగేందుకు పోలీసు శాఖ అన్ని ఏర్పాటు పూర్తి చేసిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పరమేశ్వర్ గౌడ్, రూరల్ సబ్ ఇన్స్‌పెక్టర్ విజయ్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సజావుగా ఏర్పాట్లు

ఉదయం 7నుంచి ఒంటి గంట వరకు పోలింగ్

137 పంచాయతీల్లో ఎన్నికలకు సర్వం సిద్ధం

కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్/కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటివిడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటివిడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి సంసిద్ధంగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని నాగర్‌కర్నూల్ ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటివిడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటివిడత ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగంపరంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మొదటివిడత ఎన్నికల కోసం 6వేలమందికిపైగా ఎన్నికల అధికారులు తొలివిడత ఎన్నికల్లో వివిధ హోదాల్లో విధుల్లో పాల్గొంటున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో 151 గ్రామ పంచాయతీలు ఉండగా, 14 గ్రామపంచాయతీల సర్పంచులు ఏకగ్రీవమయ్యాయని, మిగిలిన 137 గ్రామపంచాయతీలకుగాను 447 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటిలో ఉన్నారన్నారు. 1326 వార్డులకుగాను, 208 వార్డులు ఏకగ్రీవమయ్యాయని, 1118 వార్డులకుగాను 2774 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారన్నారు. కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెలకపల్లి ఆరు మండలాలకుగాను 1118 పోలింగ్ కేంద్రాలు, 1118 పిఓటు, 3వేల ఓపిఓలు, 151మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు.

**ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవా**

నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటివిడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే తొలివిడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయా మండలాలవారిగా ఓటర్లు నేడు ఉదయం 7గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంటవరకు జరిగే పోలింగ్ ప్రక్రియలో ఓటర్లు స్వచ్ఛందంగా భాగస్వామ్యంకావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధంవంటిదని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకావొద్దని సూచించారు.

**ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామాగ్రిని కేంద్రాలవారీగా వేరుచేసి సిద్ధంగా ఉంచాలి**

ప్రతిపోలింగ్ కేంద్రానికి అవసరమైన సామాగ్రిని కేంద్రాలవారిగా వేరుచేసి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం మొదటివిడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కల్వకుర్తి, ఊర్కొండ మండలాల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందిచే తరలించే ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్‌సింగ్‌జిపాటిల్ పరిశీలించారు. కల్వకుర్తి ఊర్కొండ మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా జిల్లా కలెక్టర్ బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించి పిఓ, ఓపిఓలతో కూడిన బృందాలన్ని హాజరయ్యారా లేదా అనే అంశాన్ని సమీక్షించారు. పోలింగ్ అధికారులకు అందజేస్తున్న పోలింగ్ మెటిరియల్‌ను స్వయంగా చెక్ చేసి, పంపిణీ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ సామాగ్రి, ముఖ్యంగా బ్యాలెట్‌పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో బందోబస్తు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, లైటింగ్, పార్కింగ్, మార్గ సౌకర్యాలు సమగ్రంగా ఉండేలా చూడాలని ఏవైనా లోపాలు కనిపించిన వెంటనే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



## హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు వెంటనే చెల్లించాలి : జాజుల



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బుధవారం హైద్రాబాద్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. మెస్ బకాయిలు నెలలు గడుస్తున్నా విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు సరైన పోషకాహారం అందడం లేదని 8నెలల నుంచి బకాయిలు చెల్లించకపోవడం సరికాదన్నారు. వెంటనే బకాయిలను చెల్లించడంతోపాటు వర్కర్లను, వార్డెన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## సిపిఐ సర్పంచ్ అభ్యర్థి సుజాతను అత్యధిక మెజారిటీతో గెలిపించండి



ప్రజాపక్షం/మర్రిగూడ: కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కుదాబక్షపల్లి సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ఎరజాల సుజాతని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఐ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి మేతరి యాదయ్య కుదాబక్షపెల్లి ఎంపీటీసీ వరప్రసాద్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సురేష్, నవీన్ ఉన్నారు.

## ప్రాజెక్టు శంకుస్థాపన నేటితో 70 వసంతాలు పూర్తి..

### నాగార్జునసాగర్ ప్రాజెక్టు దేశానికే గర్వకారణం
### ప్రాజెక్ట్ ఎస్ఇ మల్లికార్జున్



ప్రజాపక్షం/నందికొండ: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాగార్జునసాగర్ ప్రా జెక్టు శంకుస్థాపన జరిగి డిసెంబర్ 10 మంగళవారంతో 70 వసంతాలు పూర్తి తీసుకొని 71వ వసంతంలోకి అడుగు పెట్టింది. నాగార్జున సాగర్ డ్యాం శంకుస్థాపన దినోత్సవం సందర్భంగా డ్యాం సూపరింటెండ్ ఆఫ్ ఇంజనీర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు సిబ్బంది తో కలసి శంకుస్థాపన పిల్లర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్మిక స్మారక స్తూపం, సాగర్ ప్రాజెక్టు తొలి సీఈ జాఫర్ అలీ, కేఎల్ఎన్ రావు విగ్రహాల వద్ద ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు దేశానికే గర్వకారణంగా నిలిచిందని, దానిని కాపాడుట అందరి బాధ్యత అని అన్నారు. ఈ ప్రాజెక్టుకు కార్యరూపం అనేది 1902 నుంచే ప్రారంభమైందని అప్పటినుండి స్థల విషయంలో ప్రాజెక్టు నిర్మాణ విషయంలో అనేక విధాలుగా వాయిదా పడుతూ చివరికి 1955 డిసెంబర్ 10న ఒక కొలిక్కి వచ్చి ప్రాజెక్టు ప్రారంభానికి తొలి బీజం పడిందని ఇంత గొప్ప చరిత్ర కలిగిన ప్రాజెక్టులో ఉద్యోగ బాధ్యతను నిర్వర్తించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ నాగేశ్వరరావు, డి ఈ లు శ్రీనివాస్, ఆండాలు, ఎఇఇ లు నరసింహ మూర్తి, రమేష్, సాయి శ్రీ, శ్రీకాంత్, విజయ్ కుమార్జే,ఇ అజయ్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకులు జంగయ్య, డ్యాం భద్రతాధికారి జి శ్రీనివాసరావు ప్రాజెక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

# నేడు తొలి విడత 'పంచాయతీ' షురూ

### పంచాయతీ 'తొలిపోరు'కు సర్వం సిద్ధం
### నేడు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్
### సాయంత్రంలోగా ఫలితాలు వెల్లడి



ప్రజాపక్షం/సూర్యాపేట : గ్రామ పంచాయతీ తొలిపోరుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 8 మండలాల పరిధిలో 159 గ్రామ పంచాయితీలకు 1442 వార్డులకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా ఇప్పటికే 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 152 గ్రామ సర్పంచ్, 1244 వార్డులకు గురువారం (నేడు) ఎన్నికలు జరగనున్నాయి. సూర్యాపేట జిల్లాలో మొదటి విడత ఎన్నికలు తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట రూరల్ మండలాల్లోని 159 గ్రామ పంచాయితీలకు సర్పంచ్, 1442 వార్డు మెంబర్ల ఎన్నికకు పోలింగ్ జరుగాల్సి ఉండగా ఇప్పటికే 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డులకు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీటిని మినహాయించగా 152 గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, 1244 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ మొదలై మధ్యాహ్నం ఒంటి గంట వరకు ముగియనుంది. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. సాయంత్రం లోపు ఆయా గ్రామాల్లో గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యుల పేర్లను అధికారులు అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం స్టేజ్ 1 ఆర్ఓలుగా 52 మంది, స్టేజ్ 2 ఆర్ఓలుగా 178 మంది, 16 ఎఫ్ఎస్‌టి బృందాలు, 28 మంది జోనల్ అధికారులు, 65 రూట్లు 1686 మంది ప్రిసైడింగ్, 2260 మంది ఇతర ప్రెసిడెంట్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ 18 గుర్తింపు కార్డులకు అనుమతి ఇచ్చింది. ఇందులో ఓటర్ గుర్తింపుకార్డుతో పాటు రేషన్, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర కార్డులను ఓటర్లు తమ వెంట తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి తీసుకపోవల్సి ఉంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఎన్నికలు జరిగే 8 మండలాల పరిధిలో బుధవారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

**ఐదు అంచెల పోలీస్ భద్రత...**
**264 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తింపు**

తొలి విడత పోలింగ్ జరుగుతున్న ఎనిమిది మండలాల పరిధిలో ఐదు అంచెల భద్రతను పోలీసులు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూతుల వద్ద, పోలింగ్ లొకేషన్‌ల వద్ద, 100 మీటర్ల పరిధి, 200 మీటర్ల పరిధిలో, స్ట్రైకింగ్ ఫోర్సు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, ఎన్నికల నియమావళి అమలు టీమ్స్, రూట్ మొబైల్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 264 సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసు అధికారులు గుర్తించారు. ఈ ఎన్నికల్లో ఇద్దరు అదనపు ఎస్పిలు, ఏనిమిది మంది డిఎస్పిలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 50 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, హోంగార్డులు కలిపి మొత్తం 1500 మందితో భారీబందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఆన్‌లైన్ వెబ్‌కాస్టింగ్ ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా ఈ కేంద్రాలలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, సిసి కెమెరాలు, కెమెరాలతో ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు.

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14మండలాలలో 296 సర్పంచ్‌లు.. 2,491వార్డులు

ప్రజాపక్షం/నల్లగొండ: గ్రామ పంచాయతీ తొలి విడత పోలింగ్ తొలి తీర్పు గురువారం వెలువడనున్నది. పంచాయతీల్లో మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. జిల్లాలోని నల్లగొండ, చండూరు డివిజన్ లోని 14 మండలలో చండూరు, చిట్యాల, గట్టుప్పల్, కనగల్, కట్టంగూరు, కేతేపల్లి, మర్రిగూడ, మునుగోడు, నకిరేకల్, నల్లగొండ, నాంపల్లి, నార్కెట్ పల్లి, శాలిగౌరారం,తిప్పర్తి మండలాలలోని 318 పంచాయతీల్లో సర్పంచు లకు,వార్డు సభ్యులకు 2870 పోలింగ్ కేంద్రాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.ఇప్పటికే నామినేషన్ ఉపసవరణ గడువు రోజు 22 సర్పంచి పదవులు, 375 వార్డు సభ్యుల పదవులు ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది మిగిలిన 296 పంచాయతీలకు, 2491 వార్డు సభ్యులకు ఎన్నిక జరగనుంది. సర్పంచి పదవులకు 966 మంది, వార్డు సభ్యులకు 5,934 మంది పోటీ పడుతున్నారు.ఇందుకు గాను పిఓ ఓపిఓ లు రెండవ ఓ పి ఓ మొత్తం కలుపుకొని 7892 మందిని విధులు నిర్వహించే విధంగా రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో పిఓలు 3444,ఓపిఓలు 4448 మంది ఈ ర్యాండమైజేషన్ లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు.

### ఉదయం పోలింగ్..మధ్యాహ్నం లెక్కింపు

గురువారం ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగుతుంది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

## పారదర్శకంగా రెండవ విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా రెండవ విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత రెండో రోజు ఎన్నికలు జరుగుతున్న భువనగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భువనగిరి మండలంలో ఎంత మందికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయని, ఇప్పటివరకు ఎంత మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ రోజుతో రెండవ విడత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో, పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లను గుర్తించి వారికి బ్యాలెట్ పేపర్ ఇవ్వాలని తిరిగి సదరు ఓటరు తన ఓటు తన ఓటు బ్యాలెట్ బాక్సులో వేసే వరకు సంబంధిత అధికారులు గమనించాలన్నారు.

## పోలీసు పాత్ర కీలకమైంది : ఎస్‌పి



ప్రజాపక్షం/సూర్యాపేట : ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎస్పి కె నరసింహ తెలిపారు. డిసెంబర్ 11న జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల సందర్భంగా సూర్యాపేట మండల పరిధి ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్న సిబ్బందికి పట్టణంలోని సూర్యాపేట ఫంక్షన్ హాల్ నందు విధుల నిర్వహణపై ఆయన సలహాలు, సూచనలు ఇచ్చారు. బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని స్పష్టం చేశారు. విధులు పూర్తయ్యే వరకు కేటాయించిన విధులు, ప్రాంతాలు వదలవద్దని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో ఉంచాలని, అనుమతిలేని వ్యక్తులను ఓటరు కానీ వారిని పరిసరాల్లో రానివ్వవద్దన్నారు. 100 మీటర్ల పరిధిలో ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఓటర్లు సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు ఏమైనా వెంట తెస్తున్నారా అనే దానిపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమిష్టి బాధ్యత అన్నారు. దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తం

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నేడు జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల జరగనున్న నేపథ్యం లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో, నిస్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. బుధవారం నల్లగొండ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే పోలీసు అధికారులు,సిబ్బంది అందరూ ఎన్నికల సంఘం నియంత్రణ,పర్యవేక్షణ క్రమశిక్షణకు లోబడి పని చేయాలని సూచించారు. ఎలక్షన్స్ సమయంలో పోలీసు అధికారులు ఎలక్షన్ రోజు,ఎలక్షన్ తర్వాత కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పై పూర్తిగా అవగాహన కలిగి ఉండి, పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు, పోలింగ్ కేంద్రాల దగ్గరా పాటించాల్సిన నియమాలను తెలియజేశారు. పోలింగ్ రోజు పోలింగ్ స్టేషన్ల దగ్గర 163 బి.యన్.ఎస్.ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందని, పోలింగ్ కేంద్రాల 100 మీటర్ల లోపల ఎవ్వరినీ రానివ్వకూడదని ఓటు హక్కు వినియోగించుకోనే వారు పోలింగ్ కేంద్రాల కు ఎట్టి పరిస్థితిలో సెల్ ఫోన్లు, ఇంక్ బాటిల్స్,ఇతర హాని కలిగించే వస్తువులు తీసుకురాకుండా జాగ్రత్తగా తనిఖీ చేయాలన్నారు.

## హత్య కేసులో 8 మంది నిందితుల అరెస్టు

### ఎఎస్‌పి రవీందర్ రెడ్డి వివరాలు వెల్లడి



ప్రజాపక్షం/నూతనకల్ : మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉప్పల మల్లయ్య హత్య కేసులో 8 మంది నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎఎస్‌పి రవీందర్ రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. లింగంపల్లి గ్రామానికి చెందిన ఉప్పల మల్లయ్య కోడలు శైలజ 4వ వార్డు సభ్యురాలిగా పోటీలో ఉండి ప్రచారం నిర్వహిస్తుందన్నారు. ఆమెకు పోటీగా అదే వార్డు నుండి ఆకుల రజిత వర్గానికి చెందిన వారు వార్డుమెంబర్‌గా పోటీ చేశారు. ఇరు వర్గాలు ప్రచారంలో భాగంగా ఎదురుపడి జువ్వాడ వెంకటేశ్వర్లు ఇంటి సమీపంలో కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్ళతో మల్లయ్యపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలిస్తుండగా వనస్థలిపురం సమీపంలో మృతి చెందినట్లు తెలిపారు. దాడిచేసిన వారిలో ఏ1గా ఉప్పల సతీష్, ఏ2గా కొరివి గంగయ్య, ఏ3గా వీరబోయిన సతీష్, ఏ4గా ఉప్పల గంగయ్య, ఏ5గా ఉప్పల యలమంచి, ఏ6గా వీరబోయిన లింగయ్య, ఏ7గా కారింగుల వెంకటేశ్వర్లు, ఏ8గా దేశపంగు అవిలయ్యను గుర్తించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుండి రెండు కర్రలు, ఒక మంచం అడ్డపట్టే కర్ర, మూడు రాళ్ళు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, తుంగతుర్తి సిఐ ఏ నరసింహారావు, నూతనకల్ ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.



## ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/నూతనకల్ : గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సిబ్బంది నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని ఎలాంటి ప్రలోభాలకు గురైనా, విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం స్టేజీ 2 ఆఫీసర్లతో పాటు పోలింగ్ నిర్వహణ సిబ్బందికి అవగాహన కల్పించి వారికి కేటాయించిన గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సిబ్బందికి కేటాయించినటువంటి పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల నియమావళి ప్రకారము ఎన్నికల సమయము పూర్తయ్యే వరకు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులకు గురైన ఎన్నికల ప్రత్యేక అధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని, సిసి కెమెరాలతో పాటు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఓ సునీత, మండల విద్యాధికారి రాములు నాయక్ పాల్గొన్నారు.

# ప్రతి పనికీ 'ఓ రేటు'!

### పైసలు ఇవ్వనిదే ఫైల్ కదలదు...
### సూర్యాపేట మున్సిపల్ రెవెన్యూ విభాగంలో అవినీతి తాండవం



ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటిలోని రెవెన్యూ విభాగంలో అవినీతి కంపు కొడుతుంది. వివిధ పనుల కోసం వచ్చే వారి వద్ద ప్రతి పనికి ఒక రేటు ఖరారు చేసి అధికారులు అక్రమంగా డబ్బులు దండుకుంటున్నారు. వారికి పైసలు ముందుగా ఇస్తే తప్ప ఫైల్ కదలని పరిస్థితి. వీరి అవినీతి, అక్రమాలపై ప్రజలు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఆదర్శ మున్సిపాలిటిగా గుర్తింపు పొందిన సూర్యాపేట గ్రేడ్ 1 మున్సిపాలిటీ ప్రతిష్ట కొంతమంది అవినీతి అధికారులతో మసకబారుతుంది. మున్సిపాలిటీలోని ప్రతి విభాగంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ విభాగంలో ఇది మరింత ఎక్కువగా ఉంది. ఈ విభాగంలో ఒక రెవెన్యూ అధికారితో పాటు, నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, 16 మంది బిల్ కలెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరు కాకుండా మరికొంత మంది కార్యాలయ సిబ్బంది కూడా ఉన్నారు. రెవెన్యూకు సంబంధించి కీలకంగా రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లే చూసుకోవడం జరుగుతుంది. మున్సిపాలిటికి ప్రజల నుండి రావల్సిన ప్రతి పైసా వీరి నుండే సమకూరుతుంది. వివిధ పనుల కోసం తమ దగ్గరికి వచ్చే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సిన వారు ప్రతి పనికి ఒక రేట్ ఖరారు చేసి వారి నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారు. నూతనంగా నిర్మించిన ఇండ్లకు ఇంటి నెంబర్లు, ఆస్థి మార్పిడి, ఇంటి పన్ను ఖరారు చేయడం లాంటి కీలక పనులు వీరు చేయాల్సి ఉంది. ఇంటి నెంబర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుండి అక్రమంగా రూ.3 వేల నుండి రూ.5వేల వరకు, ఆస్థి మార్పిడి కోసం రూ.20వేల నుండి రూ. 25వేలు, ఇంటి పన్ను ఖరారు చేసే సమయంలో కొలతలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం నిర్ణయించాల్సి ఉన్నా అలా చేయకుండా తక్కువ చూపుతూ గృహ యజమానుల వద్ద బేరసారాలు ఆడి రూ. లక్షల్లో దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కొన్ని ఖాళీ స్థలాలకు ఇల్లు నిర్మించినట్లుగా ఇంటి నెంబర్లు ఇచ్చి భారీ మొత్తంలో డబ్బులు దండుకున్న సందర్భాలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఇందిరమ్మ కాలనీ ఏరియా పరిధిలో పని చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అవినీతి, అక్రమాలకు పాల్పడగా అవి బయటపడడంతో కొన్ని రోజులు అతనిని విధులకు దూరంగా పక్కకు పెట్టారు. కొద్ది రోజుల తరువాత అతడిని తిరిగి అధికారులు తీసుకవచ్చి అదే స్థానంలో కూర్చోబెట్టడం గమనార్హం. దీంతో అతగాడు మరింతగా రెచ్చిలపోయి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే కుడకుడ ప్రాంతంలో విధులు నిర్వహించే ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గత రెండు నెలల క్రితం పదోన్నతిపై మిర్యాలగూడ మున్సిపాలిటికి బదిలీపై వెళ్ళారు. అతడి బాధ్యతలను చూస్తున్న మరొక అధికారి వివిధ పనుల కోసం తమ విభాగానికి వచ్చే వారి నుండి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేస్తున్నారని బహిరంగంగానే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ మాజీ పోలీస్ అధికారి ఓ భవనాన్ని కొనుగోలు చేసి పేరుమార్పిడి కోసం గత కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటిలో దరఖాస్తు చేసుకున్నారు. ఆ ఆస్థి కొనుగోలు చేసినప్పుడే రిజిస్ట్రేషన్ అధికారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజు కూడా తీసుకోవడం జరిగిందని చెప్పారు. ఆ ఫైల్ నేరుగా మున్సిపాలిటిలోని రెవెన్యూ విభాగానికి చేరగానే వారం రోజుల లోపు అమ్మిన వారి పేరు మీద నుండి కొనుగొలు చేసిన తన పేరు మీదికి అధికారులు మార్చాల్సిన బాధ్యత ఉందని వాపోయారు. కానీ పేరు మార్పిడి కోసం రెవెన్యూ విభాగం చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే మీరేమిస్తారో చెప్పండంటూ కిందిస్థాయి ఉద్యోగుల ద్వారా బేరసారాలు ఆడుతున్నారని చెప్పారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి.

**వచ్చింది అందరికి పంచాల్సిందే...**

రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కిందిస్థాయి ఉద్యోగులను ప్రశ్నిస్తే తమకు వచ్చిందంతా అందరికి పంచాల్సిందేనని అదిపోగా తమకు మిగిలేది కొంతేనని బహిరంగంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారులకు ఒక్కొక్క పర్సెంటేజ్ చొప్పున ఇచ్చిన తర్వాతే ఫైల్స్‌పై సంతకాలు పెడుతున్నారని వాపోతున్నారు. ఇలా తాము వారికి ప్రతినిత్యం వేలాది రూపాయలు ఇస్తున్నామని, ఇచ్చేవి కూడా నగదు రూపంలోనైతేనే తీసుకుంటున్నారని ఓ ఉద్యోగి చెప్పకనే చెప్పారు.

**ఆరోపణలలో వాస్తవం లేదు...**
**రెవెన్యూ అధికారి కళ్యాణి**

రెవెన్యూ విభాగంలో అవినీతి, అక్రమాలకు తావు లేదని, తమపై వస్తున్న ఆరోపణలలో ఏ మాత్రం వాస్తవంలేదని సూర్యాపేట మున్సిపాలిటి రెవెన్యూ అధికారి కళ్యాణి అ న్నారు. అవినీతి, అక్రమాలపై ఆమెను ప్రజాపక్షం వివరణ కోరగా కొంతమంది గిట్టనివారు పని కట్టుకొని ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. వివిధ పనుల కోసం వచ్చే వారి పనులను త్వరితగతిన పూర్తి చేసి తమ వద్ద ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా చూసుకుంటున్నామని చెప్పారు.

## జిల్లాలో ఊపందుకున్న ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు

### 6 రోజుల్లో 6 శాతం నుండి 28 కిచేరుకున్నదరఖాస్తులు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లాలోని పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకుగాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. జిల్లాలో మండలాల వారిగా 13,194 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాల్సి ఉండగా, గత వారం వరకు కేవలం 6 మాత్రమే ఉన్న ఉపకార వేతనాల దరఖాస్తులు 6 రోజుల్లో 28 శాతానికి పెరిగాయి. ఇందుకు జిల్లా కలెక్టర్ వారంలో రెండుసార్లు ఉపకార వేతనాలపై విద్యాశాఖ అధికారులు, సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల అప్ లోడ్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ప్రత్యేకించి పీఏ పల్లి మండలంలో 90 శాతం దరఖాస్తుల స్వీకరణను పూర్తి చేసి ముందు వరుసలో నిలిచింది. అనంతరం తిరుమలగిరి సాగర్, ఇతర మండలాలు దరఖాస్తుల స్వీకరణ లో ముందున్నాయి. ఇప్పటివరకు 13194 గాను, 3711 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్నారని, తక్కిన వారి చేత దరఖాస్తులను సమర్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ప్రకటనలో కోరారు. ఇందుకు విద్యాశాఖ అధికారులతో పాటు, సంక్షేమ శాఖ అధికారులు ,బ్యాంక్ అధికారులు సహకరించాలని, తహసీల్దారులు సైతం విద్యార్థులకు అవసరమైన కుల ధ్రువపత్రాలను జాప్యం లేకుండా జారీ చేయాలని చెప్పారు.

## పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

### ఎన్నికల డిఆర్‌సి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/మునుగోడు: గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల ఎన్నికల అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఏర్పాటుచేసిన డిఆర్‌సి కేంద్రాన్ని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ,స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.పోలింగ్ సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేసే సమయంలో స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ పేపర్ల ప్రాధాన్యతను తెలియజేయాలని, అలాగే ప్రతి పోలింగ్ టీం వారికి సంబంధించిన జోనల్ అధికారి, రూట్ అధికారుల ఫోన్ నెంబర్లు కలిగి ఉండాలని తెలిపారు.ప్రిసైడింగ్ అధికారులు పి ఓ డైరీ నిర్వహణ,టెండర్,ఛాలెంజ్ ఓట్ల విషయంలో తీసుకొనే జాగ్రత్తలు మరోసారి తెలియజేయాలని చెప్పారు.

# క్రీడ

# తగ్గేదేలే..

## అందువల్లే మైదానంలో అడుగు పెట్టగలిగా..




సానుకూల దృక్పథమే తనను తిరిగి మైదానంలో అడుగుపెట్టేలా చేసిందని టీమ్ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అన్నాడు. దీనివల్లే గాయం తర్వాత తాను మరింత దృఢంగా పునరాగమనం చేశానని అతడు వివరించాడు. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన హార్దిక్ దాదాపు రెండు నెలల తర్వాత కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి టీ20లో కనిపించాడు. ఇటు బ్యాట్‌తోనూ, అటు బంతితోనూ రాణించాడు. ముఖ్యంగా బ్యాటింగ్‌లో ధనాధన్ ఇన్నింగ్స్‌తో టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 175 పరుగులు చేయడంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో అతడు 28 బంతుల్లో 59* పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. బౌలింగ్‌లో రెండు ఓవర్లు వేసి 16 పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. టీమ్ఇండియా ఈ మ్యాచ్‌లో 101 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

'గాయం తర్వాత నేను మరింత దృఢంగా, మిన్నగా తిరిగి వచ్చాను. గాయాలు మనల్ని మానసికంగా పరీక్షిస్తాయి. స్ట్రాంగ్‌గా నిలబడటం వల్లే నాలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. నా మీద నాకు చాలా నమ్మకం ఉంది. నిజానికి మనల్ని మనం కచ్చితంగా నమ్మాలి. మనమీద మనకే విశ్వాసం లేనప్పుడు ఇతరులు మనల్ని ఎలా నమ్ముతారు' అని హార్దిక్ పాండ్య అన్నాడు. 'అలాగే మైదానంలోకి దిగిన తర్వాత ప్రతి క్షణం.. ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా. జనాన్ని ఆకట్టుకునేలా ఆడాలనుకోవడమే నాకు అసలైన ప్రేరణ. అలాగే నేను రాణించడానికి నా భాగస్వామి కూడా ఓ కారణం. ఆమె నా జీవితంలోకి వచ్చిన తర్వాత చాలా మంచి విషయాలు జరిగాయి' అని హార్దిక్ పాండ్య తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మ గురించి తెలిపాడు. ముంబయిలో కొందరు ఫొటోగ్రాఫర్లు అత్యుత్సాహంతో మహికా శర్మ ఫొటోలు తీసిన విషయాన్ని మంగళవారం ఇన్‌స్టా స్టోరీలో హార్దిక్ పాండ్య ప్రస్తావించిన విషయం తెలిసిందే. 'మహికా శర్మ.. బాంద్రాలో ఓ రెస్టరంట్ దగ్గర నడుచుకుంటూ వెళ్తోంది. అప్పుడు ఓ ఫొటోగ్రాఫర్.. ఆమె ఫొటోలను తీశాడు. అయితే ఆడవాళ్లు ఇబ్బందిపడేలా ఉన్న కోణంలో వాటిని తీశాడు. సెన్సేషనలిజం కోసం వ్యక్తిగత గోప్యతకు గౌరవం ఇవ్వడం లేదు. ఆడవాళ్లకు మనం కనీస మర్యాద ఇవ్వాలి. ప్రతి ఒక్కరికీ హద్దులుంటాయి' అని హార్దిక్ అసహనం వ్యక్తం చేశాడు.

## ర్యాంకింగ్స్‌లో రో–కో రూలింగ్

### రోహిత్‌కు అగ్రస్థానం.. రెండో స్థానంలో కోహ్లీ

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆధిపత్యం కొనసాగించారు. ఐసిసి బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లీ రెండో స్థానానికి చేరుకున్నారు. ఇప్పటికే నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా కొనసాగుతున్న రోహిత్ శర్మ.. తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో విరాట్ కోహ్లీ అద్భుతంగా బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. దాంతో రన్ మిషన్ ర్యాంకు గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం నెంబర్ వన్ ప్లేస్‌ను చేరుకునేందుకు విరాట్ కోహ్లీ.. అగ్రస్థానానికి చేరుకునేందుకు కేవలం ఎనిమిది రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచుల్లో 302 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నది. సిరీస్‌లోని చివరి వన్డేలో కోహ్లీ అజేయంగా 65 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దాంతో ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో రెండుస్థానాలు మెరుగుపరుచుకొని రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో స్థిరంగా రాణిస్తూ తన నెంబర్ వన్ ప్లేస్‌ను నిలబెట్టుకున్నాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో 146 పరుగులు చేశాడు. కోహ్లీ, రోహిత్ ఇద్దరు ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్2 ప్లేసుల్లో నిలిచారు. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో ఉన్నాడు. మరో బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్ ఒక ర్యాంకు దిగజారి 10వ స్థానానికి చేరుకున్నాడు.



**ఐసిసి తాజాగా ప్రకటించిన వన్డే బ్యాటర్ల ర్యాంక్‌లు**

1. రోహిత్ శర్మ (భారత్)– 781
2. విరాట్ కోహ్లీ (భారత్)– 773
3. డెరిల్ మిచెల్ (న్యూజిలాండ్)– 766
4. ఇబ్రహీం జద్రాన్ (అఫ్గానిస్థాన్)– 764
5. శుభ్‌మన్ గిల్ (భారత్)– 723
6. బాబర్ అజామ్ (పాకిస్థాన్)– 722
7. హ్యారీ టెక్టర్ (ఐర్లాండ్)– 708
8. షాయ్ హోప్ (వెస్టిండీస్)– 701
9. చరిత్ అసలంక (శ్రీలంక)– 690
10. శ్రేయస్ అయ్యర్ (భారత్)– 679

కేఎల్ రాహుల్ రెండు స్థానాలను మెరుగుపరుచుకొని 12వ ప్లేస్‌కు చేరాడు. ఇక బౌలింగ్ ర్యాంకుల్లో కుల్దీప్ యాదవ్ మూడు ర్యాంకులు మెరుగుపరుచుకొని మూడోస్థానంలో నిలిచాడు. టెస్ట్ ర్యాంకుల్లో టీమిండియా బ్యాట్స్‌మెన్ యశస్వీ జైస్వాల్ మాత్రమే ఎనిమిది స్థానంలో నిలువగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 11వ స్థానం, రిషబ్ పంత్ 13వ స్థానాలకు చేరుకున్నారు. టెస్ట్ బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ ప్లేస్‌ని నిలబెట్టుకున్నాడు. ఆ తర్వాత మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ ఒక్కో స్థానాన్ని మెరుగుపరుచుకొని వరుసగా 12వ, 13వ, 14వ స్థానాల్లో నిలిచారు. అదే సమయంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు క్వింటన్ డి కాక్, ఐడెన్ మార్క్‌రమ్, టెంబా బావుమా సైతం తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు. అదే సమయంలో యాషెస్‌లో రెండు మ్యాచ్‌ల్లో 18 వికెట్లు తీసిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడోస్థానానికి ఎగబాకాడు. పేలవమైన బ్యాటింగ్ కారణంగా హ్యారీ బ్రూక్ నాల్గో ప్లేస్‌కు పడిపోయాడు. కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్ ఒక్కొక్క స్థానం మెరుగుపరుచుకున్నారు.

# ఫోకస్




సుమారు 50,000 నుంచి 70,000 సంవత్సరాలకు పూర్వం, మనిషి అభివృద్ధిలో ఒక విప్లవాత్మక ఘట్టం చోటు చేసుకుంది. అనేక తరాల పాటు హోమో సేపియస్లు (హోమో సేపియన్స్) ఆఫ్రికా ఖండంలోనే నివసించారు.



## 'రొజెట్టా'కు చారిత్రక ప్రాధాన్యం..

రొజెట్టా శిల పురావస్తు ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యమైన ఆవిష్కరణలలో ఒకటిగా నిలుస్తుంది. 1799 జులై 19న ఫ్రెంచ్ ఇంజినీరింగ్ బృందం ఈజిప్టులోని రొజెట్టా (నేటి రషీద్) అనే ప్రాంతంలోని ఫోర్ట్ జూలియన్ కోటలో తవ్వకాలు నిర్వహిస్తున్నప్పుడు లెఫ్టినెంట్ పియర్‌ఫ్రాన్స్వా బుషార్ ఈ శిలను కనుగొన్నారు. సైనికులు తవ్వినప్పుడు అందులో పాలిష్ చేసిన రాతిబండపై మూడు భాషల్లో శాసనాలు కనిపించాయి. ప్రాచీన ఈజిప్టు హైరోగ్లిఫిక్, డెమొటిక్, ప్రాచీన గ్రీకు. ఈ త్రిభాషా శాసనం క్రీస్తుపూర్వం 196 నాటిదని అంచనా. మూడు భాషల్లో ఒకే విషయాన్ని రాయడం వలన శాస్త్రవేత్తల దృష్టి దీనిపైన పడింది. గ్రీకు భాష అప్పటికే తెలిసినది కావడంతో, పరిశోధకులు గ్రీకు వచనాన్ని మిగతా రెండు అన్యభాషా లిపులతో పోల్చి అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. జోహన్ డేవిడ్ ఆకర్‌బ్లాడ ఆంవోన్‌ఈసాక్ సిల్వెస్ట్ర్ డి సేసీ వంటి పండితులు మొదటిసారిగా విలువైన సూచనలు అందించారు. ఆ తరువాత థామస్ యంగ్ కొన్ని ధ్వని చిహ్నాలను గుర్తించి కొత్త దారిని చూపించాడు. చివరికి జీన్ ఫ్రాన్స్వా షాంపోలియన్ 1822 సెప్టెంబర్ 27న హైరోగ్లిఫిక్ లిపి యొక్క తుది అర్థాన్ని విజయవంతంగా ప్రకటించాడు. ఇది ఈజిప్టు భాషా రహస్యాల పరిష్కారానికి కీలక ఘట్టమైంది. ఫ్రాన్స్ పరాజయం తరువాత 1801లో అలెగ్జాండ్రియా ఒప్పందం ప్రకారం ఫ్రెంచ్ బృందం కనుగొన్న అనేక పురావస్తు వస్తువులు బ్రిటిష్ పాలకుల అధీనంలోకి వచ్చాయి. ఆ ఒప్పందంతోనే రొజెట్టా శిలను కూడా ఇంగ్లాండ్‌కు తరలించారు. 1802 ఫిబ్రవరిలో అది పోర్ట్స్‌మౌత్‌కు చేరి, ఆ ఏడాది జూలైలో బ్రిటిష్ మ్యూజియానికి అప్పగించారు. అప్పటి నుంచి ప్రజలు దానిని చూడగలుగుతున్నారు. ఈ రాతిబండ గ్రానోడియోరైట్ రాతితో తయారైనది. దీని ఎత్తు సుమారు 112 సెం.మీ., వెడల్పు 75 సెం.మీ., బరువు సుమారు 760 కిలోలుంటుంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ శాసనం మొదట ఒక ఆలయంలో ప్రతిష్ఠించారు. తర్వాత ఫోర్ట్ జూలియన్ నిర్మాణ సమయంలో దానిని గోడల నిర్మాణానికి పునర్వినియోగించారు. ఈ రాతిబండ ఈజిప్టు నుండి లండన్ వరకు చేరిన ప్రయాణం, అలాగే ప్రాచీన ఈజిప్టు లిపి రహస్యాలను విప్పడంలో దాని పాత్ర, యుద్ధ సమయాల్లో సాంస్కృతిక వస్తువుల బదిలీ, వాటి తిరిగి వచ్చే హక్కుల గురించి జరిగే చర్చల్లో రొజెట్టా శిలను ప్రతీకాత్మక చిహ్నంగా నిలబెట్టాయి.



## హోమో సేపియన్స్ వలస..

నేటి కాలానికి తెలియని కారణాల వల్ల అక్కడి నుంచి చిన్న చిన్న సమూహాలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లాయి. ఈ సమూహాల్లోని వారంతా అత్యంత ధైర్యవంతులు, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల సమర్థులు కాబట్టి, వారి వలసలు ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త నాగరికతలకు పునాదలు వేశాయి. అయితే, వారంతా తన జన్మభూమిని ఎందుకు వదిలి వెళ్లారు? అనేది ప్రశ్న. దీనికి శాస్త్రవేత్తలు రకరకాల కారణాలు చెప్పారు. పర్యావరణ మార్పులు, నీటి వనరుల కొరత, వివిధ వంశాల మధ్య పోరు, ప్రకృతి వనరుల వేట వంటి అనేక కారణాలను శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. కొన్ని వందల సంవత్సరాల పాటు మారే వాతావరణ పరిస్థితులకు అవారు తట్టుకుని, లక్షల సంవత్సరాల అనుభవంతో ఈ సమూహాల తరాలు అడుగులు ముందుకు వేశాయి. 70,000 సంవత్సరాల క్రితం, ఆఫ్రికాలోని మానవులు అనేక విభిన్న పరిసరాలను, రెన్జ్‌లను ఉపయోగించడంలో ప్రత్యేక అధ్యయనం సాధించారు. అడవులు, ఎడారులు, నదీ ప్రదేశాలు, పచ్చని తీరాలు అన్నీ అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నారు. ధైర్యం, ఆసక్తి, కొత్త వనరుల శోధనతో పాటు, సంభావ్యతను, భయాన్ని అధిగమించడం, అన్వేషణ దాహం, సమస్యలకో పరిష్కారం తదితర లక్షణాలను పుణికిపుచ్చుకున్నారు. ఇవన్నీ మానవుల అసలు స్వభావంలో ఒక్కడో ఒక చోట ఇప్పటికీ కనిపిస్తాయి. ఇదింతా ఆత్మవిశ్వాసమా లేక జీవన పోరాటంలో భాగమా అనే ప్రశ్నపై లోతైన అధ్యయనాలు జరుగుతున్నాయి. అదే సమయంలో జన్యుపరమైన అంశాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇవి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మొత్తానికి ఆఫ్రికా ప్రాంతాన్ని విడిచి, కొత్త ప్రాంతాలు.. అక్కడి భూములు చేరుకున్న నాటి సమూహాల దృఢ సంకల్పం, మనిషి విప్లవాత్మకమైన నైపుణ్యాలను, ఆలోచనలను, యాసలు, సాంకేతిక నిర్మాణాలను ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ ప్రయాణాల వలన, భిన్న జాతులు, భద్రమైన భవిష్యత్తు, వినూత్న సంస్కృతుల ఉద్భవం సాధ్యమయ్యాయి, మానవ అభివృద్ధి దృక్పథం పూర్తిగా మార్చిపోయింది.

# వనరుల వినియోగంతో అభివృద్ధి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**



**ప్రజాపక్షం/చిగురుమామిడి :** సమగ్ర అభివృద్ధి జరగాలంటే వనరులన్నింటినీ ఉపయోగించుకోవాలని సిపిఐ కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సిపిఐ మండల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చాడ మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడుస్తుందని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సిపిఐ మొదటి నుంచి పోరాడుతుందన్నారు. తెలంగాణలో మొదటినుంచి భూసమస్య ఉన్నదన్నారు. సమగ్ర అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలోని వనరులన్నింటినీ ప్రజల కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందని సిపిఐ మొదటినుంచి చెబుతుందన్నారు. రైజింగ్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయాలను ప్రస్తావించడం హర్షణీయమన్నారు.. జల్–జంగల్–జమీన్, కొమరం భీం ప్రస్తావన చేయడం, భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది అమరత్వం పొందారని సిఎం మాటల్లో చెప్పడం అభినందనీయ మన్నారు. గత పరిపాలకులలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఇలా మాట్లాడలేదన్నారు. సామాజిక అంశాలపై సిఎం లోతుగా అధ్యయనం చేశారని, విద్య, వైద్యంపై సంపూర్ణ అవగాహన కలిగి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గ్లోబల్ సమ్మిట్ ఉండాలని ముందు చూపుతో వ్యవహరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుండి రావాల్సిన నిధులు విడుదల కాలేదని, వాటిని తెప్పించుకోవలసిన అవసరం ఉందన్నారు. కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేసి గ్రామసీమల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడుతున్న సిపిఐ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని సమావేశంలో చాడ వెంకటరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందెస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తెరాల సత్యనారాయణ, మండల నాయకులు అనువోజు జనార్ధన్, అల్లేపు జంపయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు రాకం అంజవ్వ, కేతవ్వ, సౌందర్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ఎజెండా

**సిపిఐ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి అండగా నిలవండి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడమే సిపిఐ ప్రధాన ఎజెండా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రామపంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని బుధవారం భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి, పెనగడప, అంబేద్కర్ నగర్, గ్రామ పంచాయితీలతో పాటు లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని శేషగిరినగర్ తెలగరామవరం, హేమచంద్రాపురం, గుడ్డిగుట్ట గ్రామ పంచాయితీల్లో విస్తృతంగా పర్యటించి అభ్యర్థులకు, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామాల్లో పారదర్శక పాలన సిపిఐ ప్రజా ప్రతినిధులతోనే సాధ్యమన్నారు. ప్రజలకు వెన్నంటి ఉండేది సిపిఐ ప్రజాప్రతినిధులే అన్నారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వంతో కొట్లాడి వివిధ పథకాల్లో నిధులు రాబట్టి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, ప్రజా సమస్యలు పరిష్కరించ గలిగామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడుతున్న సిపిఐ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. గ్రామ స్వపరిపాలన కోసం ప్రజల్లో మమేకమయ్యే సిపిఐ బలపరిచిన అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్స్‌గా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమాల్లో కూనంనేని వెంట పార్టీ జిల్లా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యతోనే ఉన్నత స్థానం



**సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్**

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. విద్య సమాజంలో ఎదుగుదలకు తోడ్పడుతుందని, గొప్పస్థానం లభిస్తుందన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా జగద్గిరిగుట్ట ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పరీక్షలకు ఉపయోగ పడే ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ విద్య ఏ ఒక్కరి సొత్తు కాదన్నారు. వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే నేడు అనేక ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వ అధికారులు, కలెక్టర్లు, ఐపిఎస్ అధికారులు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలో చదివినవాళ్లేనని, అంత ఎదుగుదల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే సాధ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు వినియోగించుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఈ సందర్భంగా సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తాను ప్రభుత్వ పాఠశాల విద్యార్థినని చెప్పుకుంటున్నారని తెలిపారు. మన ప్రాంతంలో చదివే పిల్లలు అధికారులుగా ఎదిగి ఈ ప్రాంతానికి, ప్రజలకు సహాయం చేసి సమాజ నిర్మాణం లో భాగస్వాములు కావాలన్నారు. పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలను అందజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్, జర్నలిస్ట్ నాయకులు తొండ వెంకట్, బాబు, వంశీ, ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్రబోస్, ఉపాధ్యాయులు సుధాకర్, రత్నం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆశయంకోసం పనిచేసే వారిని

# 'స్థానిక' ఎన్నికల్లో ఆదరించండి

**సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్**

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** గ్రామపంచాయతీ ఎన్నికలలో ఆశతో కాదు ఆశయం కోసం పనిచేసే భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు సభ్యులుగా ఆదరించాలని సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ ప్రజలను కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడత జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించి పోరాడే నిస్వార్థ రాజకీయ నాయకులు కమ్యూనిస్టులని, అట్లాంటి వారిని గెలిపించుకోవడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు అవినీతిని పారదోలిన వాళ్ల అవుతారన్నారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ప్రజలకోసం నిరంతరం పాటుపడతారన్నారు. ఈ విషయాన్ని గమనించి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొండపల్లి రాము, ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ మహేష్‌బాబు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### గ్రామాల అభివృద్ధి

# కమ్యూనిస్టులకే సాధ్యం



**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు విలాస్**

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులకే సాధ్యమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు ఎస్.విలాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం, గ్రామం పరిధిలో సిపిఐ అభ్యర్థులను భారీ మెజారిటితో గెలిపించాలని బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇచ్చోడ గ్రామంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎస్కే ఉస్మాన్‌తో కలిసి సిపిఐ వార్డు సభ్యుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి సిపిఐ ముందుండి పోరాడుతుందన్నారు. అలాంటి సిపిఐ అభ్యర్థులను సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా గెలిపిస్తే సమస్యల పరిష్కారినికి పోరాడుతారన్నారు. ఇచ్చోడ గ్రామంలో వార్డ్ నెంబర్ 14 నుంచి పోటీ చేస్తున్న జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులు కల్లేపల్లి గంగయ్యతో పాటు వార్డ్ నెంబర్ 1, 12, 7, 11 స్థానాల్లో, నర్సాపూర్ వార్డ్ నెంబర్ 3, గీర్జం వార్డ్ నెంబర్ 2, సిరిచెల్మ, దుబ్బర్‌పేట్, అడగామా(కే)లో వార్డ్‌నెంబర్ 1, 2 స్థానాలలో సిపిఐ అభ్యర్థులు రంగంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. వారిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్యల లక్ష్మణ్, అన్నెల పెద్దలక్ష్మణ్, మేడపాట్ల గంగన్న, రవి మేస్త్రీ, ఆర్.రాందాస్, జె.దినేష్‌కుమార్, ఎ.దత్తు, మచ్చరమే నరేష్, కల్లెపల్లి నరేష్, నాగమ్మ, మరియమ్మ, దుబ్బాక ఆడేలు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## స్పెషల్ ఆఫీసర్ రాధికగుప్తాకు అభినందనలు



**ప్రజాపక్షం/దమ్మాయిగూడ:** దమ్మాయిగూడ మున్సిపాలిటీ జిహెచ్ఎంసిలో విలీన ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించిన అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా తను నిర్వహించిన పదవీ కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు మార్గదర్శకత్వం వహించడంలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## చక్రీపురం వద్దు...కుషాయిగూడ పేరు పెట్టాలని నిరసన

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిహెచ్ఎంసి వార్డుల పునర్విభజనలో భాగంగా 16వ డివిజన్‌కు చక్రీపురం డివిజన్‌గా నామకరణం చేయడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు. చర్లపల్లి డివిజన్‌ను రెండు విభజిస్తూ ముసాయిదా విడుదల చేసిన వాటిలో 16వ డివిజన్‌కు చక్రీపురం పేరును పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ బస్టాండ్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలసి చక్రీపురం పేరును మార్చి కుషాయిగూడ పేరు పెట్టాలని వెల్ఫేర్ అసోసియేషన్,సిసిఎస్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు కలసి వినతి పత్రం అందజేశారు.దీనికి స్పందించిన ఎమ్మెల్యే జిహెచ్ఎంసి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తానని,పేరు మార్చేందుకు తప్పకుండా కృషి చేస్తానని తెలిపారు.



## డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటుకు డిమాండ్

ఎఐటియుసి అధ్యక్షుడు ఎంఎస్.మూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వైద్య విధాన పరిషత్‌ను రద్దుచేసి, ఆ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు ట్రెజరీ(010) ద్వారా వేతనాలను చెల్లించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.మూర్తి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మలక్ పేట ఏరియా ఆసుపత్రిలో వైద్యశాల ఉద్యోగులు సామూహికంగా సంతకాలు సేకరించి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986వ సం.లో ఏర్పాటు చేసిన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించకపోవడం, అధికారులకు గెజిటెడ్ హోదా లేకపోవడం, వేతన సవరణ సంఘానికి వినతులు సమర్పించ లేకపోవడం, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిలో వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి, ఆ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసస్‌ను ఏర్పాటు చేశారని, తెలంగాణలో కూడా అలాగే చేయాలని కోరారు. ఉద్యోగుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వైద్యశాలల్లో ఉద్యోగులు సామూహికం గా సంతకాలను సేకరించి వాటిని అధికారులకు అందజేసినట్టు ఎం.ఎస్. మూర్తి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

## జాతీయ రహదారుల ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి



కలెక్టర్ మనుచౌదరి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలో కొనసాగుతున్న జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారుల నిర్మాణాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి అధికారులను ఉద్దేశించి మాట్లాడా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ పిడి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.

రోడ్డు విస్తరణకు సంబంధించిన కోర్టు కేసులను కలెక్టర్ వివరంగా అడిగి తెల్సుకొన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను పరిశీలించి కేసు వివరాల పూర్వాపరాల మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## అవకాశం ఇవ్వండి..అభివృద్ధి చేస్తా..

సర్పంచ్ అభ్యర్థి సువర్ణ శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట్ మండలంలో స్థానిక పోరు వేళ ఊరూరా కోలాహలం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల తరహాలో పల్లెల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు తీవ్రంగా కష్టపడుతున్నారు. గెలవాలనే లక్ష్యంతో ఖర్చుకు వెనకడుగు వేయడం లేదు. ప్రత్యర్థి వ్యూహాలకు దీటుగా ప్రతి వ్యూహాలు అమలు చేస్తున్నారు. అందుకోసం ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను దర్శించుకుంటున్నారు. నవాబుపేట్ మండలంలోని అక్నాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈదులపల్లి సువర్ణ శ్రీనివాస్ గౌడ్ పంచాయతీలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ అభివృద్ధిపై పలు కీలక హామీలు ఇస్తూ, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని బలంగా చెప్పారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేస్తానని మాటిచ్చారు. కేవలం ఎన్నికల హామీలు ఇవ్వడం కాకుండా, గ్రామస్థాయిలో నిజమైన మార్పును తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు తమ ఓటు హక్కు వినియోగించుకుని, తమకు కేటాయించిన కత్తెర గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి సువర్ణ శ్రీనివాస్ గౌడ్ కోరారు.

## హత్నాయత్నం కేసులో ఇద్దరికి ఏడేళ్లు శిక్ష

**ప్రజాపక్షం/చర్లపల్లి:** హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఏడేళ్లు జైలు శిక్ష పడింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2012 సంవత్సరంలో హత్యాయత్నం కేసులో ముద్దాయిలుగా ఉన్న ఏ1 రౌడీషీటర్ పండిత్ సంపత్ కుమార్,ఏ2 షేక్ బాబావలీలకు కుషాయిగూడ పిఎస్‌జె కోర్టు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు 11 వేల రూపాయల జరిమానాను ప్రిన్సిపాల సీనియర్ సివిల్ జడ్జి రవీందర్ విధించారు. ఈ కేసుకు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సిఐ సురేష్‌కుమార్,నరసింహ, రమేష్, కానిస్టేబుల్ శ్రీనివాస్‌లు సహకరించారు. తీర్పు అనంతరం ముద్దాయిలను చర్లపల్లి జైలుకు తరలించామని తెలిపారు.



## గ్రామ అభివృద్ధే నా లక్ష్యం



**ప్రజాపక్షం/నవాబుపేట్:** ప్రజలు ఆదరించి సర్పంచిగా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని నవాబుపేట మండలంలోని నారేగూడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి బేగరి నిర్మలమ్మ అన్నారు. బుధవా రం గ్రామంలో గ్రామ ప్రజలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని అన్నారు. అవకాశం ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించండి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతూ గ్రామప్రజల ఋణం తీర్చుకునే అవకాశం కల్పించండని అన్నారు.



## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మహిళా శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల జిల్లా శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవ వేడుకలను బుధవారం మేడ్చల్ జిల్లా సైలెంట్ వాల్డ్ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. నవంబర్ నెలలో జిల్లా స్థాయిలో జరిగిన ఆటపోటీల్లో పాల్గొని విజయం సాధించిన దివ్యాంగులకు జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా శాలువా కప్పి సర్టిఫికెట్లు, మెమొంటోలను అందచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడల్లో జీనియస్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో అద్భుతమైన ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని జీనియస్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపల్ కల్పనరెడ్డి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి జగ్గంగూడలోని జీనియస్ గ్రామర్ హైస్కూల్‌లో ఎస్‌జిఎఫ్ అండర్ 14 ఖో ఖో బాలికల విబాగంలో రాష్ట్రస్థాయిలో ఎంపికైన అభిజ్ఞను పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా శామీర్‌పేట జోనల్ సెక్రటరి గుర్రం సత్తిరెడ్డి మాట్లాడుతూ మంగళవారం రోజున వికారాబాద్‌లో నిర్వహించిన ఖో ఖో పోటీల్లో మేడ్చల్ జట్టు రెండవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ క్రీడల్లో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. అలాగే అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వెంకట్ టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల డిసెంబర్ 22 న జార్ఖండ్‌లో నిర్వహించే నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అడ్విన్, కోచ్ గౌతమ్, విగ్నేష్‌లు అభినందించారు.

## కాంగ్రెస్ హయాంలో ప్రతి నిరుపేదకు ఇల్లు : బొమ్మలపల్లి నర్సింహ యాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తున్నామని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి కేశవరంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు పార్వతమ్మ నూతన ఇంటిని మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్‌తో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో ఇళ్లులేని వారికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్లులేని వారు ఉండకూడదని సిఎం రేవంత్‌రెడ్డి నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, నాయకులు మల్లేష్ యాదవ్, బాలకృష్ణ, కొమురయ్య, వినోద్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా : నర్సింహులు

**ప్రజాపక్షం/బంట్వారం :** ఆశీర్వదించండి గ్రామాభివృద్ధి చేస్తానని... బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థి బోగ్గుల తులశివేణి నర్సిములు బుధవారం బస్వాపూర్ గ్రామంలో గడప గడపకు తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓటు వేసి సర్పంచుగా గెలిపించాలంటూ, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు నర్సిములు, నాయకులు బల్వంత్ రెడ్డి, నరేష్, కమ్మర్‌పల్లి చిన్న, తదితరులు ఉన్నారు.

## వైకుంఠదామంలో చికెన్ వేస్టేజ్ డంపింగ్ చేస్తే కఠిన చర్యలు



కమిషనర్‌ని ఆదేశించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** వైకుంఠ దామంలో చికెన్ వేస్టేజ్‌ని డంపింగ్ చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని భజఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద కమిషనర్‌ని ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి మండల పరిధిలోని ప్రగతినగర్‌లో గల వైకుంఠ దామాన్ని మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే వివేక్ పరిశీలించారు. వైకుంఠ దామంలో డంప్ చేస్తున్న చికెన్ వేస్టేజ్ పదార్థాలతో దుర్వాసన వెదజల్లుతుందని, దోమలు, ఈగలు రోగాలు ప్రబలుతున్నాయని స్థానికులు విన్నవించారు. వైకుంఠ దామంలో కనీస వసతులు కల్పించకుండా కొంద రు వ్యక్తులు అభివృద్ధిని కమిటీ పేరిట అడ్డుకుంటున్నారని, అక్రమంగా చికెన్ వేస్టేజ్‌ని డంపింగ్ చేస్తూ డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని ఫర్ ఏ బెటర్ సొసైటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ వైకుంఠ దామం అనేది ప్రతి వ్యక్తి జీవితంలో గౌరవప్రదమైన చివరి మజిలీ అని గుర్తుచేశారు. వైకుంఠ దామంలో మౌలిక వసతులకు తక్షణమే నిధులు కేటాయించి స్నానపు గదులు, నీటి సరఫరాతో పాటు బోర్ మోటార్‌ని బిగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వైకుంఠ దామం ప్రవేశ ద్వారం వద్ద శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, వైకుంఠ దామంలో చికెన్ వేస్టేజ్‌ని డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు డంపింగ్ చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబెర్ అలీ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సజావుగా ఎన్నికల నిర్వహణ..చెక్ లిస్ట్ సరి చూసుకోవాలి : కలెక్టర్ ప్రతిక్ జైన్



**ప్రజాపక్షం/తాండూరు:** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రతగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు. బుధవారం పెద్దేముల్ మండల పరిధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు, తాండూర ఎంపిడిఓ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గురువారం జరగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి క్షేత్రస్థాయిలో పర్యటించి మెటీరియల్ పంపిణీ పరిశీలించారు. ఉన్నత పాఠశాల తాండూరులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన మెటీరియల్‌ను కలెక్టర్ చెక్ చేశా రు. పోలింగ్ మెటీరియల్ పంపిణి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొంబ్రాస్‌పేట్ ఎండిఓ కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వెళ్ళి బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్స్‌లను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు బాక్సులు జాగ్రత చెక్‌చేసి ప్యాక్ చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకుని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. సిబ్బంది రాక పోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని, వారికి ఉదయం అల్పహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. ఏమైన లోపాలు కన్పిస్తే వెంటనే తెలియజేయాలని, తాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాలు వచ్చిపోయే దారిలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. రూట్ల వారీగా బస్సులు బయలు దేరే విధంగా జిల్లా కలెక్టర్ దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్‌లు, ఎంపిడిఓలు, స్పెషల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నిర్లక్ష్యం వహించిన అధికారుల సస్పెండ్**

పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ తెలిపారు. బుధవారం బషీరాబాద్ మండల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కుల్కచర్ల మండలానికి చెందిన పటేల్ చెరువు తాండ ఎస్జీటి మానస, నీటూరు ప్రాథమికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ నషీం రేహానాలు, పెద్దేముల్ మండల ఎంపిపిఎస్ స్కూల్ చెందిన స్కూల్ అసిస్టెంట్ అన్నపూర్ణలకు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ అధికారులుగా నియమించడం జరిగింది, వీరు విధుల్లో బాధ్యతా రహితంగా నిర్లక్ష్యం వహించి విధులకు గైర్హాజరు అయినందున వీరిని విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల విధుల పట్ల ఎవ్వరు నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## రూ.4లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మచ్చబొల్లారం డివిజన్ భరత్‌నగర్ స్లమ్ కౌకూర్ ప్రాంతంలో రూ. 4 లక్షల వ్యయంతో చేపట్టిన డిఐ పైపు నీటి సరఫరా లైన్లను స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు నీటి సదుపాయాన్ని మెరుగుపరస్తుందని, స్థానిక నివాసితులకు మెరుగైన జీవన పరిస్థితులను నిర్ధారిస్తుందని, ఈ ప్రాంతంలోని దాదాపు 50 గృహాల్లో నివసించే ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని ఈ సందర్భంగా కార్పొరేటర్ అన్నారు. దీంతోపాటు మల్లికార్జుననగర్‌లో రూ.17.3 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులను సైతం ఆయన ప్రారంభించారు.. డివిజన్ అభివృద్ధి విషయంలో సహకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విశేషంగా సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజిరెడ్డి, ముత్యాలు, వీరేష్, డేనియల్, కాంగ్రెస్ శ్రేణులు, డివిజన్ అధ్యక్షుడు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, తుడిమెళ్ల మల్లికార్జున్, నవీన్, రాజు యాదవ్, లడ్డురెడ్డి, విష్ణు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## సుభాష్ నగర్ డివిజన్ పేరు సాయిబాబా నగర్ డివిజన్‌గా మార్చాలి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** జిహెచ్ఎంసిలో నూతనంగా డివిజన్‌లను పెంచిన సందర్భంలో సుభాష్ నగర్ డివిజన్ పేరుని సాయిబాబానగర్ డివిజన్‌గా మార్చాలని కోరుతూ కాలనీవాసులు, కాంగ్రెస్ నేతలు బల్లెమ్ శ్యామ్ కోరారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌ని సాయిబాబానగర్ కాలనీ వాసులు కలిసి వినతిపత్రాన్ని అందజేసి డివిజన్‌లపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ సుభాష్ నగర్ డివిజన్ (130) ప్రస్తుతం ఉండగా ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు మున్సిపాలిటీలను, కార్పొరేషన్‌లను విలీనంచేసి 150 డివిజన్‌లను 300లకు పెంచారని తెలిపారు. ఇందులో భాగంగానే సుభాష్ నగర్ డివిజన్‌ని 292గా, రాంరెడ్డి నగర్ డివిజన్‌ని 290గా మార్చడం జరిగిందని, సుభాష్ నగర్ ప్రాంతమంతా రాంరెడ్డి నగర్ డివిజన్ లో కలిసి ఉంటుందని, సుభాష్ నగర్‌లో ఉన్న కాలనీలు మొత్తం వేరుగా ఉన్నాయని తెలిపారు. సుభాష్ నగర్ డివిజన్‌లో అపురూప కాలనీ, సాయిబాబా నగర్, సూరారం కాలనీస రాజీవ్ గృహ కల్ప ప్రాంతాలు ఉంటాయని, కాని సుభాష్ నగర్ డివిజన్‌లో సుభాష్ నగర్ ప్రాంతం ఉండదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే సుభాష్ నగర్ డివిజన్ పేరుని మార్చి సాయి బాబా నగర్ డవిజన్‌గా పేరు పెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, పాషా, సాయి కుమార్‌లు పాల్గొన్నారు.





## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర్ నగర్ ఉప్పలమ్మ గుడి సమీపంలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, కాంగ్రెస్ సీనియర్ నేతలు బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, కిషోర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించాలి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** శాస్త్రీయ పద్ధతిలో సర్వే నిర్వహించి వార్డుల విభజన చేయాలని తుర్కయంజాల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డిని కలిసి బిజెపి తుర్కయంజాల్ శాఖ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహరెడ్డి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జారీ చేసిన జీవోను బిజెపి వ్యతిరేకిస్తుందన్నారు. జనాభా ప్రాతిపదికన, వైశాల్యం, ఆధారితన సర్వే నిర్వహించి వార్డుల విభజన చేయాలని బిజెపి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్త రామ్‌రెడ్డి, బచ్చిగళ్ళ రమేష్, నోముల కార్తీక్, కొండ్రు పురుషోత్తం, నందగిరి సురేష్, కంచరమోని దాసు, సాయి పాల్గొన్నారు.

# వరద ముప్పులేని నగరంగా హైదరాబాద్

### పర్యవేక్షణ బాధ్యతల్లో నివాసితులను భాగస్వామ్యం చేద్దాం
### ఏప్రిల్ నాటికి డి సిల్టింగ్ పూర్తి చేయాలి
### హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరద ముప్పు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని, అదే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ అధికారులను ఆదేశించారు. నగరంలో అసాధారణంగా 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతున్న తరుణంలో వరద నీరు సాఫీగా సాగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. జిహెచ్ఎంసి మెయింటినెన్స్ విభాగం ఆధ్వర్యంలో జనవరి నుంచి ప్రారంభంకానున్న డి సిల్టింగ్ పనుల నేపథ్యంలో జిహెచ్ఎంసి మెయింటినెన్స్ విభాగం, హైడ్రా అధికారులతో బుధవారం హైడ్రా కార్యాలయంలో జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో హైడ్రా కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ ఏడాది వర్షాకాలం ఆరంభంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా తర్వాత వరద నియంత్రణలో విజయవంతమయ్యామన్నారు. క్యాచ్ పిట్లు, కల్వర్టులలో సిల్ట్‌ను తొలగించేదే హైడ్రా పని అయినప్పటికీ, ప్రధాన నాలాల్లో పూడికను కూడా తొలగించామని చెప్పారు. ఈ వర్షాకాలంలో అనుభవంలోకి వచ్చిన సమస్యలు ఎన్నో పాఠాలు నేర్పాయని, వచ్చే ఏడాది మరింత సమర్థవంతంగా పని చేయడానికి ఇవన్నీ ఊతమిస్తాయని అన్నారు. డిసిల్టింగ్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసి వరద నీరు సాఫీగా సాగడానికి హైడ్రా సహకారం అన్ని విభాగాలకు అందుతుందన్నారు.

**స్థానికుల భాగస్వామ్యంతో..**

నాలాల్లో డిసిల్టింగ్ పనులను జనవరి నుంచే మొదలు పెడుతున్నాం కాబట్టి వీటి పర్యవేక్షణలో స్థానికులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేద్దామని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ అధికారులకు సూచించారు. నాలా నెట్ వర్కుకు ఎక్కడైనా ఆటంకాలతో పాటు ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించడంలో స్థానికులను భాగస్వామ్యం చేయాలని, అప్పుడే వాటి నిర్వహణలో అందరూ జాగ్రత్తలు పడతారన్నారు. నాలాల్లో పూడిక తీసే పనుల్లో ఎలాంటి రాజీ పడాల్సినవసరం లేదని అధికారులకు స్పష్టం చేశారు. ఒకరిద్దరి సమస్యకంటే వందలు, వేలాది మంది సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేయాల్సి ఉందన్నారు. మరీ ముఖ్యంగా నాలాల్లో పూడికను తొలగించడం ఎంత ముఖ్యమో, వాటి నిర్వహణకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు. హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, జిహెచ్ ఎంసి మెయింటినెన్స్ విభాగం చీఫ్ ఇంజినీర్ రత్నాకర్, ఎస్ఎన్‌డిపి ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ జ్యోతిర్మయితో పాటు పలువురు జిహెచ్ఎంసి ఇంజినీర్లు, హైడ్రా ఆర్ఎఫ్‌వో జయప్రకాష్, డిఎఫ్‌వోలు, ఎస్ఎఫ్‌వోలు, హైడ్రా అసెట్ ప్రొటెక్షన్ ఇన్స్పెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొని స్థానికంగా తలెత్తిన సమస్యలను వివరించారు.

## షాద్‌నగర్‌లో నియోజకవర్గంలో 146 గ్రామపంచాయతీలకు ఎన్నికలు



**ప్రజాపక్షం/షాద్ నగర్:** తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయని..ఈ నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గంలోనీ ఆరు మండలాల్లో 153 గ్రామ పంచాయతీలకు గాను ఆరు గ్రామపంచాయతీలలో సర్పంచ్ పదవులు ఏకగ్రీవం కాగా మిగిలిన 1047 గ్రామ పంచాయతీలకు నియోజకవర్గంలో ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 1072 వార్డులగాను 190వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ప్రస్తుతం 882 వార్డులకు ఎన్నికలు జరగబోతున్నాయి. షాద్‌నగర్ ఫరూక్ నగర్ మండలంలో 405 పోలింగ్ స్టేషన్లలో ఓట్లు వేసేందుకు ఏర్పాటు చేశారు. 12 రూట్లు ఉండగా నాలుగు జోన్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో గ్రామపంచాయతీ ఎన్నిక కోసం ఒక ఆరోను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 12 రూట్లలో 35 బస్సులను ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నికలు జరగనుండగా రెండు గంటలకు అదే రోజు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు. మండలంలో సుమారు 500 మందితో మండలంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు ఎసిపిలు, పదిమంది సిఐలు, 30 మంది ఎస్ఐలు మిగతా సిబ్బంది వందల సంఖ్యలో మండలాన్ని మొహరిస్తారు. అదేవిధంగా కొత్తూరు మండలంలో 110 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ కేంద్రాలకు గాను 180 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు శంషాబాద్ ఎసిపి వివరించారు. 110 పోలింగ్ కేంద్రాలకు గాను 110 పిఓలు, ఓపిఓ లు 133 మంది ఎన్నికల విధి నిర్వహణలో పాల్గొంటున్నట్లు మండల ఎన్నికల అధికారి వివరించారు. నందిగామ, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడా మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలను అధికారులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## ఎన్నికల నేపథ్యంలో నిషేధాజ్ఞలు

### శంషాబాద్ జోన్ డిసిపి రాజేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని శంషాబాద్ జోన్‌లో నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు శంషాబాద్ జోన్ డిసిపి బి.రాజేష్ తెలిపారు. డిసెంబర్ 11న (ఫేజ్1), డిసెంబర్ 14న (ఫేజ్2) ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత (బి ఎన్ ఎస్ ఎస్ ) సెక్షన్ 163 ప్రకారం ఐదుగురికి మించి గుమికూడవద్దని ఆదేశాలు జారీ చేశారు. శంషాబాద్, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్, కందుకూరు, చౌదరిగూడెం, కేశంపేట, కడ్తాల్, ఆమనగల్, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ ప్రాంతాల్లో ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. ఫేజ్1కు సంబంధించి డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 12 సాయంత్రం 6 గంటల వరకు, ఫేజ్2కు సంబంధించి డిసెంబర్ 12 సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 15 సాయంత్రం 6 గంటల వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతున్న సమయంలో ప్రజా సమావేశాలు, గుమికూడడాలు పూర్తిగా నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అప్రమత్తతలో ఎన్నికల నిర్వహణ

### శంషాబాద్ అడిషనల్ డిసిపి పూర్ణచందర్




**ప్రజాపక్షం/షాద్ నగర్ :** ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండండి, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి. పల్లె ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించండి.. ఓటర్ స్వేచ్ఛగా ఓటు వేసుకునేలా చర్యలు తీసుకోండి.. అంటూ శంషాబాద్ అడిషనల్ డిసిపి పూర్ణచందర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్ లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం ఎన్నికల ప్రారంభం నుంచి సాయంత్రం ఫలితాలు వెల్లడి దాకా పోలీసులు ప్రతి చోట అప్రమత్తంగా వ్యవహరించాలని వెల్లడించారు. సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షించాలి అన్నారు. ఉద్రిక్తతలకు,ఆందోళనలకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణ జరగాలని సూచించారు. ఎన్నికల సమయంలో అభ్యర్థులు గాని, వారి అనుచరులు గాని ప్రలోభాలకు పాల్పడినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫరూక్ నగర్ మండల పరిధిలో ఇద్దరు ఏసీపీలు, పదిమంది సిఐలు,30 మంది ఎస్సైలు, 500 మందికి పైగా పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఏసిపి రంగస్వామి, పట్టణ సీఐ విజయ్ కుమార్, డిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే పోలీసులకు తెలియజేయాలని వారు సూచించారు.

## డంపింగ్ యార్డు పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని కృష్ణకాంత్ పార్క్ సమీపంలోని డంపింగ్ యార్డును తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం పరిశీలించారు. అలాగే యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంను కూడా పరిశీలించారు. స్టేడియంలో జరుగుతున్న ఎస్‌బిఐ ఇంటర్ సర్కిల్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్న ప్లేయర్లతో మాట్లాడారు. స్టేడియంలో వసతులను పరిశీలించారు.

## నాపై తప్పుడు కేసులు

### చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షుడు అనిల్‌కుమార్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కొంతమంది వ్యక్తులు తనపై తప్పుడు కేసులు పెట్టించి, తప్పుడు ప్రచారం చేస్తూ తనను, సొసైటీని ఇబ్బంది పెట్టేందుకే కుట్రలు చేశారని చిత్రపురి కాలనీ మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్ కూమార్ ఆరోపించారు. బుధవారం చిత్రపురి కాలనీలో తెలుగు సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ కార్యాలయంలో మాజీ కార్యదర్శి పిఎస్ఎన్ దొర, కోశాధికారి టి.లలిత, కమిటీ సభ్యులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికైనా తనపై, సొసైటీపై అభియోగాలు మానుకొని చిత్రపురి కాలనీ అభివృద్ధికి పాటుపడాలని, లేనిచో చిత్రపురి కాలనీ సినీ కార్మికులు వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో అలహారి వివి ప్రసాద్ రావు, కొంగర రామకృష్ణ ప్రసాద్, బత్తుల రఘు, వేణుగోపాలరావు, డి.రమేష్ బాబు, అనిత, నిమ్మగడ్డ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టు..

### ముఠాలోని 10 మందిపై కేసు నమోదు..



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిత్యావసర సరుకులను ఇంటింటికీ చేరవేసే బింకిట్ డెలివరీ బాయ్స్‌గా ఉద్యోగం చేస్తూ మరో పక్కా అవసరమున్న వారికి గంజాయి రవాణా చేస్తున్న అంతరాష్ట్ర గంజాయి అమ్మకం ముఠాను ఎస్‌టిఎఫ్ఎ ఎ టీమ్ అంజిరెడ్డి టీమ్ బుధవారం పట్టుకున్నారు. ఒరిస్సా, ఖమ్మం, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు పది మంది ఉపాధి కోసం వచ్చారు. వీరంత కలిసి హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్‌ల్లో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరి మద్యం పరిచయం ఏర్పడింది. గంజాయి అమ్మకందార్ల వద్ద గంజాయి కొనుగోలు చేసుకొని సేవించే వారు. ఇలా మనం కొనుగోలు చేయడం కన్నా అందరం కలిసి గంజాయిని తెప్పించుకొని అమ్మకాలు చేపడుతామని ప్రయత్నాలు మొదలేట్టారు. బీదర్, ఒరిస్సా నుంచి గంజాయి తక్కువ ధరలకు గంజాయిని కొనుగోలు చేసుకొని తీసుక వచ్చి మాదాపూర్, బంజారా హీల్స్,మరికొన్ని ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు సాగిస్తు వచ్చిన లాభాలను పంచు కుంటున్నారు. గంజాయి అమ్మకందార్లుగా చెలమణి అవుతే కష్టమని భావించిన వీరంతా డెలివరీ బాయ్స్‌గాను, హోటళ్లలో పని చేస్తూ వెనుక నుంచి గంజాయి అమ్మకాలు చేపడుతున్న వీరిని బుధవారం ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీమ్ పట్టుకుంది. నిందితుల వద్ద నుంచి 3.3 కేజీల ంజాయితోపాటు 6 సెల్‌ఫోన్లను, రెండు టూవీలర్స్‌ను సీజ్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఎస్ఎస్ కాంప్లెక్స్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న శ్రీకాంత్ (కర్ణాటక), కిశోర్ (మణికొండ), ఉమేష్ కుమార్ (ఒరిస్సా), సయ్యద్ అన్వర్ (ఖమ్మం), సింహచలరావు (ఒరిస్సా), అమర్ (కర్ణాటక) జోయ అలీ (కర్ణాటక) మహ్మమద్ అలీ (కర్ణాటక) ఇర్ఫాన్ (కర్ణాటక), బాబుల్‌పురి (కర్ణాటక)లపై ఎస్టీఎఫ్ ఏ టీమ్ కేసు నమోదు చేశారు. వీరిలో పై అరుగురిని అరెస్టు చేశారు. మిగిలిన నలుగురు పరారీలో ఉన్నారు. గంజాయి నిందితులను బంజారాహిల్స్ ఎక్సైజ్ స్టేషల్ అప్పగించారు. డెలీవరీ బాయ్స్ ముసుగులో గంజాయి, డ్రగ్స్, గంజాయి అమ్మకాలు జరపడం నేరంగా పరిగణించబడుతుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఎస్టీఎఫ్ ఏ టీమ్ అంజిరెడ్డి సిబ్బందిని నిత్యవసర సరుకులను ఇంటింటికి సరఫరా చేసే బాయ్స్ గంజాయి అమ్మకాలు చేపట్టడాన్ని బయట పెట్టిన ఈ టీమ్ డైరెక్టర్ అభినందించారు.

## అవకాశవాద, వారసత్వ రాజకీయాలు ప్రమాదకరం

### ఎన్‌పిపి ఎపి,టిజి కోఆర్డినేటర్ గవ్వల భరత్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోని యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ ప్రగతికి పాటుపడాలని నేషన్ పీపుల్స్ పార్టీ ఎపి, తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ గవ్వల భరత్ కుమార్ పిలుపునిచ్చారు. అవకాశవాద, వారసత్వ రాజకీయాలతోనే ఈ దేశానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దేశ ప్రగతి కోసం పాటుపడే ప్రతి యువతీ యువకుడు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సేవ చేయాలని సూచించారు. నేషనల్ పీపుల్స్ పార్టీ జాతీయ యూత్ ప్రెసిడెంట్ నిక్కి నాన్గహలా, పార్టీ నేషనల్ సెక్రటరీ(ఆర్గనైజేషన్), అరుణాచల్ మాజీ హోంశాఖ మంత్రి పక్కా బాగే బుధవారం హైదరాబాదులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గవ్వల భరత్ నేతృత్వంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూలమాలలు, సాంప్రదాయ డప్పు చప్పుల్లతో వారికి బ్రహ్మరథం పట్టారు. రాజీవ్ గాంధీ ఎయిర్ పోర్టు నుంచి బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సభకు తీసుకువచ్చారు. భరత్ సభికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బడుగు, బలహీనవవర్గాలకు చెందిన తాను నేడు ఇక్కడ నిలబడి, మన తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దే యువతతో మాట్లాడటం తనకెంతో గర్వంగా ఉందన్నారు. యావత్ దేశవ్యాప్తంగా తిరుగులేని నాయకుడిగా పీ.ఏ. సంగ్మా జాతీయ స్థాయిలో ఎదిగారని, అటువంటి మహనీయుడు పెట్టిన పార్టీకి తాను రెండు తెలుగు రాష్ట్రాల్లో నాయకత్వం వహించడం హర్షణీయం అన్నారు. మహనీయుడు పిఎ సంగ్మా సేవలను స్మరించడానికి మనమందమున్నారని తెలిపారు. విద్యా, వైద్య రంగాల్లో ఫీజుల నియంత్రణ, ఉద్యోగులకు సమయానికి రిటైర్మెంట్, ఆరోగ్య ప్రయోజనాలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ భద్రత, పోలీసులకు సముచిత పని గంటలు, రైతులకు అగ్రికేర్ సపోర్ట్ కేంద్రాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి డిఎ, పిఆర్‌సి, మండల స్థాయిలో పేదలకు ఉచిత న్యాయ సలహాల సాయం, కాంట్రాక్ట్ ఉద్యోగుల భద్రత, ప్రైవేట్ ఉద్యోగుల జీతాలు, పని గంటలు, ఒత్తిడి సమస్యల పరిష్కారం కావాల్సిన అవసరం ఉందన్నారు.

## హైదరాబాద్‌లో ఇడి దాడులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగర శివార్లలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు కానుండటంతో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. దీంతో రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కస్టమర్ల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు సోదాలు నిర్వహించారు. భువన తేజ రియల్ ఎస్టేట్స్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై ఏకకాలంలో పలుచోట్ల దాడులు కొనసాగాయి. ప్రీలాంచ్ స్కీమ్ ల పేరుతో కస్టమర్ల నుంచి భువన తేజ రియల్ ఎస్టేట్స్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సుమారు రూ.70 కోట్లకు పైగా వసూలు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఫ్లాట్లు, ప్లాట్లు ఇస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశారని బాధితులు ఇటీవలే హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు. తాజాగా ఆ కేసు ఆధారంగా మనీలాండరింగ్ ఆరోపణలతో ఇడి విచారణలో భాగంగా భువన తేజ రియల్ ఎస్టేట్స్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కార్యాలయాలు, డైరెక్టర్ల ఇళ్లలో సోదాలు కొనసాగాయి. ఈ సందర్భంగా వారి బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేయడంతో పాటు పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు.

## 'తెలంగాణలో 100 వీకెండ్ వండర్స్'పై పోటీలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక శాఖ రాష్ట్రంలోని తెలియని అందాలను వెలికితీయడానికి, ప్రయాణికులు, కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహించే ప్రత్యేక సృజనాత్మక పోటీ 100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ ను ప్రారంభించింది. ఈ పోటీ ద్వారా రాష్ట్రంలోని తక్కువగా తెలిసిన, అరుదైన, తప్పక సందర్శించాల్సిన వీకెండ్ ట్రావెల్ గమ్యస్థానాలను ఫోటోలతో పాటు చిన్న వీడియోల రూపంలో పరిచయం చేయడానికి పాల్గొనేవారిని ఆహ్వానిస్తోంది. వివరాలకు అధికారిక వెబ్‌సైట్ www.tourism.telangana.gov.inను సందర్శించాలి.

## ఈశ్వరాచారి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

### బిసి జెఎసి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల సాధనకు ప్రాణత్యాగం చేసిన సాయి ఈశ్వరాచారి కుటుంబానికి రూ. కోటి గ్రేషియా ఇవ్వాలని బిజి జెఎసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. హైదరాబాద్, గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బుధవారం మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి కన్వీనర్ కుందారం గణేష్ చారి, నేతలు మణిమంజరి, బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు వేముల రామకృష్ణ తదితరులు సాయి ఈశ్వరాచారి మృతికి సంతాప సూచికగా కొవ్వత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగంలోని 9 షెడ్యూల్‌లో చేర్చి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# 168 గ్రామపంచాయతీలు..536 మంది అభ్యర్థులు

### ఎన్నికలకు పకడ్బందీ చర్యలు
### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి


**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామ పంచాయతీ మొదటి విడుత ఎన్నికల ఏర్పాట్లకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 174 కాగా 6 గ్రామ పంచాయతీలకు సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మిగిలిన 168 గ్రామ పంచాయతీ ఎన్నికలకు నిర్వహిస్తుండగా 536 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. వార్డు సభ్యులుగా 1530 స్థానాలలో ఎన్నికలకు నోటిఫై చేయగా 190 ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. మిగిలిన 1340 చోట్ల ఎన్నికలు నిర్వహిస్తుండగా 3538 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. సర్పంచ్, ఏకగ్రీవంగా ఎన్నికైన 05 గ్రామ పంచాయతీలలో ఉపసర్పంచ్ ఎన్నిక కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రీపోల్ ఏర్పాట్లలో భాగంగా 1989 మంది పోలింగ్ ఆఫీసర్లు(పిఓ), ఒపిఓ లుగా 2314 నియమించినట్లు తెలిపారు. ఎన్నికల జరుగుతున్న సంబంధిత మండలాలకు పోలింగ్ సామాగ్రిని సరఫరా చేయడం జరిగినదని, 32 మందిని మైక్రో అబ్జర్వర్‌లుగా నియమించినట్లు తెలిపారు. సున్నితమైన పోలింగ్ స్టేషన్లకు మైక్రో అబ్జర్వర్‌గా నియమించి, వారికి శిక్షణ పూర్తచేయడం జరిగిందన్నారు. ఎన్నికల సజావుగా నిర్వహించేందుకు వీలుగా 55 మందిని జోనల్ అధికారులు, 21 ఎఫ్ ఎస్‌టిలు, మరో 21 మంది ని ఎస్ఎస్‌టిలు, స్టేజ్1 ఆర్ఓ లు: 62 తోపాటు స్టేజ్ 2 కు 209,మండల స్థాయి పర్యవేక్షక అధికారులు 21 మందిని, ఎంసిసి బృందంలో మరో 22 నియమించడంతోపాటు వ్యయ బృందాలు 21 మందిని నియమించినట్లు కలెక్టర్ వివరించారు. మొదటి దశ గ్రామపంచాయతీ ఎన్నికల నిమిత్తం రవాణా సదుపాయం సిద్ధం చేసి వాహనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్‌గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడుత ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించుట మొత్తం42 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు పిఓ, ఒపిఓ విధులకు గైర్హాజరు అయిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొనుటకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.




### ఇవిఎం గోడౌన్ పరిశీలన

ఇవిఎం గోడౌన్‌న్లు కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సందర్శించారు. బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్‌లోని ఇవిఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని గదులను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఇవిఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ గోదాము సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి యంత్రాలను పరిశీలించడం జరిగింది. అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించడం జరిగింది. కార్యక్రమంలో రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జీ బొమ్మ రాములు, సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీలు నాయకులు ఎన్.రవికుమార్, కె.సతీష్‌కుమార్, సయ్యద్ సిరాజ్, ఎన్.నర్సింహారెడ్డి, కె.బాల్‌రాజ్, అర్షద్,అబ్దుల్ బారీ, ఎన్.వెంకటేష్ పాల్గొన్నారు.

# రీల్




## 'ఆదర్శ కుటుంబం' షూటింగ్ షురూ

తెలుగు చిత్ర పరిశ్రమలో తమదైన ముద్ర వేసిన విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కలయికలో రానున్న చిత్రం కోసం సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కుటుంబ కథా చిత్రాల కథానాయకుడిగా వెంకటేష్‌కి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాగే, పక్కిలిగింతలు పెట్టే హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాల మేళవింపుతో కుటుంబ బంధాలను, విలువలను తెలియజేసే చిత్రాలను తెరకెక్కించడంలో త్రివిక్రమ్ దిట్ట. అందుకే వీరి కలయిక, ప్రకటనతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. వెంకటేష్ సినీ ప్రయాణంలో 77వ చిత్రంగా రూపొందుతోన్న ఈ సినిమాకి ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్ లోగోని గమనిస్తే.. వినోదభరితమైన ఈ కుటుంబ కథా చిత్రంలో ఉత్కంఠ రేకెత్తించే అంశాలు కూడా ఉంటాయని అర్థమవుతోంది. ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 ఫస్ట్ లుక్ ఆకట్టుకుంటోంది. వెంకటేష్ ఫ్యామిలీ మ్యాన్ లుక్‌లో క్లాస్‌గా కనిపిస్తున్నారు. హృదయాన్ని తాకే భావోద్వేగాలతో నిండిన ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రాబోతోందనే సంకేతాన్ని ఫస్ట్ లుక్ ఇస్తోంది. బుధవారం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో చిత్రీకరణ మొదలైంది. వెంకటేష్‌త్రివిక్రమ్ కలయిక మరోసారి ప్రేక్షకులందరికీ చిరస్మరణీయమైన అనుభూతిని అందించడానికి సిద్ధమవుతోంది.



## సస్పెన్స్ థ్రిల్లర్‌గా మిస్టీరియస్

మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో అశ్లీ క్రియేషన్స్‌పై జయ్ వల్లందాస్ నిర్మిస్తున్న మిస్టీరియస్ ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. ముందుగా అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువ అయినా నిర్మాత చాలా పట్టుదలతో తీశారు. సినిమా చేస్తున్న టైంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్నీ ఏర్పాట్లు చేశారు. అందుకే ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చింది. ఒక కొత్త స్క్రీన్‌ప్లేతో పూర్తిగా సస్పెన్స్‌తో వున్న ఈ థ్రిల్లర్ సినిమా ప్రేక్షకులకి తప్పకుండా నచ్చుతుందని చెప్పారు. నిర్మాత జయ్ వల్లందాస్ మాట్లాడుతూ.. మా డైరెక్టర్ మహితో కలిసి మూవీ చేస్తామని అనుకోలేదు. కానీ, మిస్టీరియస్ అది జరిగింది. ఈ మూవీ స్టోరీ మహి చెప్పిన వెంటనే నాకు బాగా నచ్చింది. అందుకే కష్టపడి చేశాం. మా ఈవెంట్‌కు బ్రహ్మానందం గెస్ట్ రావడం హ్యాపీగా ఉంది. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని డిసెంబర్ 12వ తేదీ రోజున ప్రపంచవ్యాప్తంగా 150 థియేటర్స్‌లో విడుదల చేయాలనీ అందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తమ సినిమాకి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు.



## రేపే అఖండ-2

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన సినిమా అఖండ-2: ది తాండవం. తాజాగా ఏర్పడిన ఆర్థిక సమస్యల కారణంగా వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు విడుదల అవుతోంది. అన్ని సమస్యలను పరిష్కరించుకున్న ఈ చిత్రం ఈనెల 12న విడుదల చేస్తున్నామని నిర్మాతలు రామ్ ఆచంట, గోపి ఆచంట తెలిపారు. ఈ చిత్రాన్ని తేజస్విని నందమూరి సమర్పిస్తుంది. బాలకృష్ణబోయపాటి శ్రీను కాంబో సింహా, లెజెండ్, అఖండతో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను అందించింది. వారి నాల్గవ కొలాబరేషన్ వస్తున్న సినిమా కావడం, ముఖ్యంగా బాలకృష్ణ వరుసగా నాలుగు హిట్లను సాధించడంతో అఖండ-2పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.




## 25న 'ఈషా' రిలీజ్

ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వయం తాజాగా 'ఈషా' పేరుతో ఓ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబోతున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్ మెంట్స్, బన్నీవాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీవాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్ని 25న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో. ఈషా మూవీ ట్రైలర్ సక్సెస్ మీట్‌ను బుధవారం హైదరాబాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఈషా' చిత్రం కేవలం హార్రర్ మాత్రమే కాకుండా థ్రిల్లర్ మూవీ. సినిమా చూసి బయటకు వచ్చిన తరువాత అందరూ కచ్చితంగా భయపడతారన్నారు.

## 'కర్మస్థలం' పోస్టర్ విడుదల

సామ్రాజ్ఞి ఫిలమ్స్, రాయ్ ఫిలమ్స్ బ్యానర్ల మీద హర్ష వర్దన్ షిండే నిర్మాతగా బిగ్ బాస్ దివి ముఖ్య పాత్రలో రాకీ షెర్మాన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కర్మస్థలం'. పాన్ ఇండియా వైడ్గా రూపొందిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. దివిని ఓ యోధురాలిగా చూపిస్తూ వదిలిన ఈ కొత్త పోస్టర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. 'కర్మస్థలం' అంటూ వదిలిన పోస్టర్‌లో దివి కదనరంగంలో దూసుకుపోతోన్నట్టుగా కనిపించడం, చుట్టూ అగ్ని జ్వాలలు, బ్యాక్ గ్రౌండ్‌లో యుద్ధం చేస్తున్న సైనికులు ఇలా ప్రతీ ఒక్క డీటైల్‌ను పోస్టర్లో అద్భుతంగా చూపించారు. ఈ చిత్రానికి విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, ఆర్ట్ వర్క్ ప్రధాన బలాలుగా నిలుస్తాయని నిర్మాత చెబుతున్నారు.




## 'నారి నారి నడుమ మురారి'

జనవరి 14న

శర్వానంద్ హీరోగా నటించిన 'నారి నారి నడుమ మురారి'తో ప్రేక్షకులను అలరించనున్నారు. సామజవరగమనతో బ్లాక్ బస్టర్ చేసిన రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కుటుంబ కథా నేపథ్యంతో తెరకెక్కిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. నారి నారి నడుమ మురారి ఈ సంక్రాంతికి జనవరి 14న విడుదల కానుంది. ప్రీమియర్ షో సమయం సాయంత్రం 5:49 గంటలకు ముహూర్తం నిర్ణయించినట్లు నిర్మాత తెలిపారు.. శర్వా గత సంక్రాంతి బ్లాక్‌బస్టర్లు 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా' కూడా జనవరి 14న విడుదలయ్యాయి. సెలవుల సీజన్లో తీవ్రమైన పోటీ ఉన్నందున ఈ పండుగ సందర్భంగా రిలీజ్ కాస్త ఆలస్యంగా రావడం సినిమాకు బెనిఫిట్ కానుందని నిర్మాత భావిస్తున్నారు. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తుండగా, సినిమాటోగ్రఫీని జ్ఞాన శేఖర్ విఎస్, యువరాజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. ఈ కథను భాను బోగవరపు రాశారు, నందు సావిరిగణ సంభాషణలు అందిస్తున్నారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్. అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఈ ప్రాజెక్టుకు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



## ఇది ఛాలెంజింగ్ మూవీ

- హీరో కార్తి

స్టార్ హీరో కార్తి నటిస్తు సినిమా 'అన్నగారు వస్తారు' ఈ నెల 12న వరల్డ్ వైడ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. బుధవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోహీరోయిన్ కృతి శెట్టి మాట్లాడుతూ.. తమిళంలో నా డెబ్యూకు ఇంత కంటే మంచి మూవీ, ఇంతకంటే మంచి కోస్టార్ దొరకరేమో. అలాంటి స్పేస్‌ను నాకు కల్పించారు. అందుకు కార్తికి థ్యాంక్స్. ఆయనకు నా ఫ్యానిజం చూపిస్తుంటా. కార్తి తెలుగు హీరోనే అనే భావన తెలుగు ఆడియెన్స్‌లో ఉంది. తెలుగు ఆడియెన్స్ తమకు నచ్చిన హీరోను ప్రేమిస్తారు. ఈ చిత్రంలో ఒక ప్రపంచాన్ని క్రియేట్ చేశారు. హీరో కార్తి మాట్లాడుతూ నా ప్రతి సినిమా రిలీజ్ తర్వాత చిన్మయి నుంచి ఒక పేజ్ మెసేజ్ వస్తుంది. అది రాహుల్ రాసింది. చిన్మయి రాహుల్ మెసేజ్‌లు నాకు కొరియర్ లా పంపిస్తుంటుంది. వీళ్లంతా నా మీద చూపిస్తున్న ప్రేమకు చాలా థ్యాంక్స్. శైలేష్ నాతో హిట్ 3లో చిన్న కేమియా చేయించారు. అందులో నేను చెప్పిన ఒక్క డైలాగ్ ఎంతో పాపులర్ అయ్యింది. ఆ చిన్న సీన్‌కు చాలా బ్యాక్ స్టోరీ రాశారు శైలేష్. మా కాంబోలో వస్తున్న 'హిట్ 4' కోసం నేను వెయిట్ చేస్తున్నా. ఒక ఎన్టీఆర్, ఎంజీఆర్ ఉన్నారు. వాళ్లు సినిమాను రాజకీయాలను ప్రజా జీవితాలను మార్చేశారు. హీరో తెరపై ఏం చేసినా మనం యాక్సెప్ట్ చేస్తాం. తెలుగు దర్శకుల్లో ఇందరు అభిమానులు ఉన్నారనే విషయం నాకు ఇప్పుడే తెలిసింది. ఆయన 8 ఏళ్ల తర్వాత చేస్తున్న చిత్రమిది. ప్రతి ఒక్కరూ ఈ సినిమా గురించి ఎగ్జైటెడ్‌గా వెయిట్ చేస్తున్నారు అని అన్నారు.



## '29' ఫస్ట్ లుక్ విడుదల



స్టోన్ బెంచ్ స్టూడియో, జీ స్క్వాడ్ కలయికలో రూపొందుతోన్న మూవీకి '29' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. 29 సినిమాకు రత్న కుమార్ రచన, దర్శకత్వం వహిస్తున్నారు. రియలిజం, ఫీల్ గుడ్, ఎమోషన్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. మెయ్యాద మాన్, ఆడై, గులు గులు వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత గ్రిప్పింగ్ స్టోరీతో, హృదయాలను హత్తుకునే మానవ సంబంధాలను తెలియజేసేలా, ప్రేమ గొప్పదనాన్ని తెలియజేసేలా ప్రేమ కథా చిత్రంగా 29 రానుంది. విదు, ప్రీతి అస్రాని ప్రధాన పాత్రల్లో నటించారు. వారి మధ్య కెమిస్ట్రీ, పాత్రల్లోని గాఢత 29 సినిమాకు ప్రధానాకర్షణ కానున్నాయి. వైవిధ్యమైన సంగీతాన్ని అందించే సేన్ రోల్డన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తుండటంతో మరోసారి డిఫరెంట్ మ్యూజిక్‌ను ఆస్వాదించవచ్చనని ప్రేక్షకులు భావిస్తున్నారు. కార్తికేయన్ ఎస్, లోకేష్ కనకరాజ్ నిర్మిస్తోన్న సినిమా ఇది.

# హైదరాబాద్‌లో మరో మెగా స్పోర్ట్స్ ఈవెంట్

### నేటి నుంచి 45వ ఎన్‌టిపిసి సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ - 2025

### హెచ్‌పిఎస్‌లో 11-18, 2025 వరకు పోటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగరం మరో మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతుంది. చారిత్రాత్మకమైన బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 45వ సీనియర్ ఆర్చరీ ఛాంపియన్ షిప్–2025 పోటీలు ప్రారంభం కానుంది. ఒలంపిక్స్ పతకాలే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ వెన్నుదన్నుగా నిలుస్తుందని తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు ప్రధాన కార్యదర్శి పి.అరవింద్ కుమార్‌లు అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1978లో జరిగిన తొలి సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ తరువాత, 48 సంవత్సరాల దీర్ఘ విరామం తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ పోటీ మళ్లీ హైదరాబాద్‌లో జరగడం మనందరికీ గర్వకారణమని ఈ సీనియర్ నేషనల్ ఛాంపియన్షిప్‌లో అన్నీ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, మొత్తం 43 యూనిట్లు, పాల్గొంటున్నాయని తెలిపారు. స్త్రీ, పురుషులు కలిపి 971మంది ఆర్చర్లు ఈ పోటీలో తమ ప్రతిభను ప్రదర్శింప బోతున్నారని వారు వివరించారు. 45వ సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో దేశం నలుమూలల నుండి చేరిన అసాధారణ ప్రతిభను ప్రదర్శింపబోతున్నారని వారు తెలిపారు. ఈ పోటీలు కేవలం ఒక ఛాంపియన్‌షిప్ మాత్రమే కాదు.. భారత ఆర్చరీ చరిత్రలో మరో ముఖ్యమైన మైలురాయిగా వారు అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా కొత్త ప్రతిభను వెలికితీయడం, గ్రామీణ గిరిజన ప్రాంతాల ఆర్చర్లను ముందుకు తేవడం, అందరికీ సమాన అవకాశాలు కల్పించడం, తెలంగాణ యువ ప్రతిభను జాతీయస్థాయికి తీసుకెళ్లడం, 2028 ఒలింపిక్స్ కోసం శక్తివంతమైన భారత జట్టును నిర్మించవచ్చని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ అశ్విన్ రావ్, అభివృద్ధి కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య కాంపిటీషన్ డైరెక్టర్ పైయా బి. వార్ నోంగ్రబ్ జ్యూరీ సభ్యులు డాక్టర్ జోరీస్‌లు పాల్గొన్నారు.

# దీపావళికి యునెస్కో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన షెకావత్, ఇది భారతీయులకు ఇది భావోద్వేగ అంశమన్నారు. 'దీపావళి అనేది భారతదేశం అంతటా విభిన్న వ్యక్తులు, సమాజాలు ఏటా జరుపుకునే కాంతి పండుగ. ఇది సంవత్సరంలో చివరి పంటను కొత్త సంవత్సరం, కొత్త సీజన్ ప్రారంభాన్ని సూచిస్తుంది. చంద్రామాన క్యాలెండర్ ఆధారంగా ఇది అక్టోబర్ లేదా నవంబర్‌లో అమావాస్య వస్తుంది. ఇది చీకటిపై కాంతి, చెడుపై మంచి విజయాన్ని సూచించే ఆనందకరమైన సందర్భం. ఈ పండుగ సమయంలో ప్రజలు తమ ఇళ్లను, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేసుకుని అందంగా అలంకరిస్తారు. ఇంకా ఇంటి ముందు దీపాలు, కొవ్వొత్తులను వెలిగించి బాణసంచా పేల్చుతారు. అనంతరం అందరి శ్రేయస్సు, కొత్త ప్రారంభాల కోసం ప్రార్థనలు చేస్తారు' అని యునెస్కో పేర్కొంది. మరోవైపు దీపావళికి యునెస్కో గుర్తింపు రావడం పట్ల సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర షేకావత్ ఆనందం వ్యక్తం చేశారు. భారతీయులకు దీపావళి ఎంతో ప్రత్యేకమైనదని చెప్పారు. భారతీయులకు ఇది భావోద్వేగ అంశమని, అనేక తరాలుగా దీనిని జరుపుకొంటున్నట్లు షేకావత్ తెలిపారు. కుండలు చేసే వారి నుంచి కళాకారులు వరకు అనేక మంది ఈ వారసత్వాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. యునెస్కో గుర్తింపు రావడం ఒక బాధ్యత అని, మనమందరం కచ్చితంగా ముందు తరాలకు అందించాలని పేర్కొన్నారు. దీపావళి అంటే రామరాజ్యానికి, సుపరిపాలనకు సంబంధించినదని పిల్లలకు తెలియాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎర్రకోట వద్ద యునెస్కో 20వ సదస్సు డిసెంబర్ 8 నుంచి 13 వరకు సమావేశాలు జరుగుతున్నాయి. కాగా ఈ ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ తొలిసారిగా భారత్‌లో జరుగుతోంది. యునెస్కో గుర్తింపు కోసం 80 దేశాలు సమర్పించిన 67 ప్రతిపాదనలను కమిటీ పరిశీలిస్తోంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు వందల మంది ప్రతినిధులు వచ్చారు. ప్రస్తుతం భారత్‌లో 15 అంశాలు యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ప్రస్తుతం భారత్‌లో 15 అంశాలు యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. వీటిలో 2017లో కుంభమేళా, 2021లో కోల్‌కతా దుర్గా పూజ, 2023లో గుజరాత్‌లోని గర్బా నృత్యం, 2016లో యోగా, వేద పఠన సంప్రదాయం, 2008లో రామలీల ఇతిహాసం 'రామాయణం' సాంప్రదాయ ప్రదర్శన ఉన్నాయి. వాటిని రక్షించుకోవాల్సి ఉందని యునెస్కో ప్రతినిధులు తెలిపారు.

**లక్నో వంటకాలకు ప్రపంచం గుర్తింపు**

అంతకుముందు కొద్ది రోజుల క్రితమే రాజవంశీయ వంటశాలల నుంచి స్ట్రీట్ ఫుడ్ వరకు శతాబ్దాల చరిత్ర కలిగిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నో వంటకాల వారసత్వానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. లక్నోను యునెస్కో క్రియేటివ్ సిటీ ఆఫ్ గ్యాస్ట్రానమీగా ప్రకటించింది. ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండలో నిర్వహించి యునెస్కో 43వ సాధారణ సమావేశంలో అధికారికంగా ప్రకటించింది.

## న్యాయవాదులు కావలెను

### దరఖాస్తులను ఆహ్వానించిన దక్షిణ మధ్య రైల్వే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్, అమరావతిలోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, సర్క్యూట్ బెంచ్, రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్స్‌కు దక్షిణ మధ్య రైల్వేత తరపున ప్యానెల్స్ ఏర్పాటుకు ఆసక్తికలిగిన న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో, అర్హత వివరాలను తెలియజేస్తూ ఎంపానెల్ చేయబడటానికి సిద్ధంగా ఉన్న న్యాయవాదుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశామన్నారు.. న్యాయవాదుల ప్రయోజనం కోసం సంబంధిత బార్ అసోసియేషన్ల నోటీసు బోర్డులలో ఈ నోటిఫికేషన్‌ను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయాలని బార్ అసోసియేషన్లకు సూచించడమైనదని ఆయన తెలిపారు. ఇందుకు సంబందించిన నమూనా దరఖాస్తు మరియు వివరణాత్మక నోటిఫికేషన్ దక్షిణ మధ్య రైల్వే వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో కూడా అందుబాటులో ఉందని శ్రీధర్ తెలిపారు. ఆసక్తిగల న్యాయవాదులు తమ దరఖాస్తులను జనవరి 9 వరకు సికింద్రాబాద్, రైల్ నిలయంలోని 3వ అంతస్తులోనున్న డి.జి.ఎం లా కార్యాలయానికి అందజేయవచ్చు లేదా ra.catrct.scr@gmail.com కు మెయిల్ ద్వారా పంపవచ్చునని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ తెలిపారు.

## అంకెల గారడీలు (మొదటి పేజీ తరువాయి)

గ్రౌండ్ అయ్యాయి? ఎంతమంది తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు వచ్చాయి? అనే అంశంపైన శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్‌రావు సిఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. గ్లోబల్ సమ్మిట్‌లో గ్లోబల్ రిప్రెజెంటేటివ్స్ కరువయ్యారని, చివరకు ఎంబిఎ విద్యార్థులను, కాంగ్రెస్‌నాయకులను, కార్యకర్తలకు కోట్ వేసి వారిని కూర్చోబెట్టారని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ ఒక భూములు అమ్ముకునేందుకు ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ ఎక్స్‌పో లాగా ఉన్నదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ వేదికగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పరువు పోగొట్టుకున్నదని, అందాల పోటీల్లాగే, గ్లోబల్ సమ్మిట్ కూడా అట్టర్ ఫ్లాప్ షో అని ఎద్దేవా చేశారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ లో విజన్ లేదని, దానిని చేరుకునే మిషన్ కూడా లేదని హరీశ్‌రావు ఆరోపించారు. విజన్ డాక్యుమెంట్ ప్రిపరేషన్‌లో కమిట్‌మెంట్ లేదని, ఆ డాక్యుమెంట్ కు శాంటిటీ లేదన్నారు. అక్షరాలు, అంకెలు, రంగు రంగుల పేజీలతో అర్థం లేకుండా అల్లిన అబద్ధాలు, అర్ధ సత్యాల 'విజన్ లెస్' డాక్యుమెంట్ అని అన్నారు. రెండేళ్ల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చడానికే సిఎం రేవంత్‌రెడ్డి చేసిన పిఆర్ స్టంట్ గ్లోబల్ సమ్మిట్ అని చెప్పారు. 18రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 5వేల మంది విదేశీ ప్రతినిధులు వస్తరని చెప్పారని, మంత్రులు వెళ్లి ఒక్కో ముఖ్యమంత్రికి స్వయంగా ఆహ్వాన పత్రికలు అందించారని, కనీసం ఒక్క ముఖ్యమంత్రి, 5వేల మంది విదేశీ ప్రతినిదులు కూడా రాలేదని, ఒక డి.కె శివకుమార్ తప్ప. చివరకు ఎఐసిసి నేతలు, కాంగ్రెస్ ఎంపిలు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని హరీశ్ రావు అన్నారు. కెసిఆర్ పదేళ్ళ పాలన గురించి, తెలంగాణ అభివృద్ధి గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడే రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని అన్నారు.

# మత ఘర్షణలకు బిజెపి కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పరస్పర గౌరవంతో భిన్న వర్గాల వారు సామరస్యంగా తమ మత కార్యక్రమాలు నిర్వహించుకుంటారు. కానీ హిందూత్వశక్తులు, బిజెపి ఈ ప్రశాంతతకు భంగం కలిగించేందుకు ప్రయత్నిస్తోంది' అని నాయకులు దుయ్యబట్టారు. తమిళనాడులో రాజకీయంగా లబ్ధి పొందే ఉద్దేశంతో బిజెపి నాయకులు మతసామరస్యానికి విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే పావులు కదుపుతూ ఈ ప్రాంతాన్ని దక్షిణాది అయోధ్యగా నామకరణం చేశారు. బయట వ్యక్తులను తీసుకొచ్చి దీపోత్సవం వేళ గొడవలకు యత్నించారు. సామరస్యానికి భంగం కలిగించి ఘర్షణలను రెచ్చగొట్టేందుకు సామాజిక మాధ్యమాన్ని అస్త్రంగా మల్చుకున్నారు. ఇటీవల మద్రాసు హైకోర్టు మధురై బెంచ్ సంబంధిత పిటిషన్‌పై ఇచ్చిన తీర్పు కూడా ఇందుకు ఆజ్యం పోసిన పని చేసింది. గత తీర్పులను, చరిత్రను, ప్రార్థనా స్థలాల చట్టాన్ని తోసిపుచ్చుతూ సికందర్ బాదుషా దర్గా సమీపంలో బ్రిటిష్ కాలం నాటి స్థంభంపై కార్తిగై దీపం వెలిగించేందుకు అనుమతి ఇస్తూ తీర్పు వెలువడింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ యంత్రాంగం అభ్యంతరాలను తోసిపుచ్చుతూ మతశక్తులు రెచ్చిపోయేందుకు ఏకసభ్య ధర్మాసనం అవకాశం కల్పించింది. దీపం వెలిగించేందుకు పిటిషనర్‌కు సీఐఎస్ఎఫ్ భద్రతను సైతం కల్పించాలని పేర్కొంది. ఈ పరిస్థితిపై వామపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచేదిగా... శాంతి భద్రతల వ్యవహారాల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని కాదనేదిగా తీర్పు వచ్చిందని వ్యాఖ్యానించాయి. మత అల్లర్లు సృష్టించే ప్రయత్నాలను తిప్పికొట్టేలా బహులత్వ సంప్రదాయాలకు కట్టుబడుతూ, మత విద్వేష రాజకీయాలను తిరస్కరించిన తమిళనాడు, మధురై ప్రజల ఐక్యతను ప్రశంసించాయి. ఈ వ్యవహారాన్ని డిఎంకె ప్రభుత్వం తీరును మెచ్చుకున్నాయి. మతశక్తులకు మద్దతు ప్రకటించిన ఎఐఎడిఎంకే వంటి పార్టీలను ఆక్షేపించాయి. మధురై ఎంపి ఎస్.వెంకటేశ్వన్‌ను చంపేస్తామంటూ హిందూత్వ సంఘాలు బెదిరించడాన్ని వామపక్షాలు ఖండించాయి.

# ఒప్పందం ఉల్లంఘన

(మొదటి పేజీ తరువాయి)

చొచ్చుకుపోతున్నారు. ఇటీవలి రోజుల్లో తిరుగుబాటుదారుల కాల్పుల్లో 74మంది పౌరులు మరణించారు. మరో 83మంది గాయపడ్డారు. వారిని స్థానిక ఆసుపత్రులలో చేర్చారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. తిరుగుబాటు దారులు ఈ ప్రాంతాన్ని ఎంతో వ్యూహాత్మకమైనదిగా భావిస్తున్నారు. ఈ ఏడాది ఆరంభంలో తూర్పు కాంగోలో రెండు కీలక ప్రాంతాలను వారు స్వాధీనం చేసుకున్నారు. దీంతో యుద్ధం చేయిదాటిపోతుందని భావించారు. ట్రంప్ జోక్యం చేసుకుని ఒప్పందం ద్వారా దాడులకు విరామం ఇవ్వగలిగారుగానీ కీలక సమస్యను పరిష్కరించలేకపోయారు. తూర్పు కాంగో ప్రాంతంలో అత్యంత విలువైన, ప్రపంచంలోనే అరుదైన ఖనిజవనరులు, మూలకాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో జోక్యం ద్వారా ప్రయోజనం పొందాలని ఒకవైపు అమెరికా ఆశిస్తున్నది. తూర్పు కాంగోను స్వాధీనం చేసుకునేందుకు ఎం 23 తిరుగుబాటుదారులకు ఆయుధాలు ఇచ్చి సరిహద్దుదేశం రువాండా ఆజ్యం పోస్తున్నది. ఎం–23కి మద్దతుగా రువాండా సైన్యం 2022లో తూర్పు కాంగోలో ప్రవేశించింది. 'ఈ ప్రాంతంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాన్ని పరిష్కరించేందుకు మేం ప్రయత్నం చేస్తున్నాం, వారు దీర్ఘకాలంగా పరస్పరం హత్యలు చేసుకుంటూ కాలం గడిపారు, కానీ ఇప్పుడు ఈ సమావేశంలో ఒకరిని ఒకరు (కాంగో–రువాండా ప్రభుత్వ ప్రతినిధులు) ఆలింగనం చేసుకుంటూ శాంతి యత్నాలు చేస్తున్నారు' అని ఈ ఏడాది జూన్ 27వ తేదీన ట్రంప్ అన్నారు. ఆనాడు కుదిరిన ఒప్పందం ప్రకారం కాంగో నుండి రువాండా సైన్యం వైదొలగింది. ఎం–23కి వారు ఆయుధాలు ఇచ్చి మద్దతు ఇవ్వకూడదు. కానీ ఈ ఒప్పందం అమలు జరుగడంలేదు. ఆ తర్వాత కూడా తిరుగుబాటు దారులు రెచ్చిపోయి దాడులు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వ దళాలే సామాన్య ప్రజలపై బాంబుదాడులు చేస్తున్నాయని ఎం–23 తిరుగుబాటుదారులు ఆరోపిస్తున్నారు.

# విమానాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని వర్గాలు తెలిపాయి. మంగళవారం, ఎల్బర్స్ ఎయిర్‌లైన్స్ తిరిగి గాడిలోకి వచ్చిందని, ప్రభుత్వం ఇండిగో శీతాకాలపు విమాన షెడ్యూల్‌ను 10 శాతం లేదా రోజుకు ఆమోదించబడిన దాదాపు 2,200 విమానాలలో 220 విమానాలను తగ్గించినప్పటికీ దాని కార్యకలాపాలు'స్థిరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇండిగో మంగళవారం ఆరు మెట్రోల నుండి మాత్రమే 460 విమానాలను రద్దు చేసింది. లక్షలాది మంది కస్టమర్లు ఇప్పటికే పూర్తి వాపసులను అందుకున్నారని, కానీ వారి అనుమతి లేకుండా అకస్మాత్తుగా రద్దు చేయబడిన, భారీగా ఆలస్యం అయిన లేదా రీషెడ్యూల్ చేయబడిన విమానాలకు పరిహారం విషయంలో ఎలాంటి చర్య తీసుకోలేదని ఎల్బర్స్ అన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రయాణికుల చార్టర్ ప్రకారం, కొన్ని పరిస్థితులలో విమాన ఆలస్యం లేదా రద్దులకు విమానయాన సంస్థలు ప్రయాణికులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఉంటుంది. అలాగే, విమానయాన సంస్థలు ప్రయాణికులు అభ్యర్థించాల్సిన అవసరం లేకుండానే ఈ పరిహారాన్ని స్వయంగా అందించాలి. కఠినమైన భద్రతా నిబంధనలను ప్లాన్ చేయడంలో విఫలమైన తర్వాత, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలగడం, ఇతర దేశీయ విమానయాన సంస్థలపై విమాన ఛార్జీలను పెంచడం, భారతదేశం అంతటా విమానాశ్రయాలలో గందరగోళం సృష్టించిన తర్వాత ఇండిగో దేశవ్యాప్తంగా వేలాది విమానాలను రద్దు చేసింది.

డిసెంబర్ 1న ప్రారంభమైన పరిస్థితి తర్వాత, ప్రభుత్వం చివరకు జోక్యం చేసుకుని, డిజిసిఎతో కలిసి ఎల్బర్స్, రాహుల్ భాటియా నియంత్రణలో ఉన్న విమానయాన సంస్థకు అకౌంటబుల్ మేనేజర్ అయిన ఇండిగో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఇసిడ్రో ప్రోక్వెరాస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విమాన ఛార్జీలకు పరిమితిని కూడా విధించింది. కాగా, పీటర్ ఎల్బర్స్ గురువారం తన కార్యాలయంలో హాజరు కావాలని, ఇటీవలి కార్యాచరణ అంతరాయాలకు సంబంధించిన సమగ్ర డేటా, నవీకరణలతో పాటు పూర్తి నివేదికను సమర్పించాలని డిజిసిఎ ఆదేశించింది. నియంత్రణ సంస్థ ఆదేశం ప్రకారం, విమాన పునరుద్ధరణ, పైలట్లు, సిబ్బంది నియామక ప్రణాళిక, పైలట్, క్యాబిన్ సిబ్బంది సంఖ్య నవీకరించబడిన స్థానం, రద్దు చేయబడిన విమానాల సంఖ్య, రీఫండ్‌లు ప్రాసెస్ చేయబడిన వాటితో సహా ఇతర సమాచారాన్ని సమర్పించాలని ఎయిర్‌లైన్‌ను కోరింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com